



ANDHRA PATRIKA ILLUSTRATED WEEKL





మైసూరు మహారాజాగారి భవనం (బెంగుళూరు.)

—ఫొటోలు : దశిక రామలింగేశ్వర రావు.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 47
సంచిక 34
5-5-54

జయ వైశాఖ శుద్ధ తదియ బుధవారం



మాతృశ్రీ

—ఫొటో: యస్. రామకృష్ణ, మాయవరం.

విషయానుక్రమణిక

ముఖచిత్రం : హాలీవుడ్ తార జోన్ ఫాంటెయిన్.

కాలక్షేపం

దానము భోగము నాశము
పూనికతో మూడుగతులు - భువి ధనమునకున్
దానము భోగము నెఱుగని
దీనుని ధనమునకు గతి దృతీయమె పొసగున్.

తా॥ ధనమునకు యీ ప్రపంచంలో మూడు పోకడలు కన్పించుచున్నవి. (1) దానము (2) అనుభవించడం (3) నాశనము. ఏ దీనునియొక్క ధనమునకు దానము చేయడం, అనుభవించడం అనే రెండు వినియోగములున్నూ లేవో అటువంటివాని ధనమునకు మూడో మార్గము మాత్రమే విధిగా ఏర్పడును.

ధనము బాగా సంపాదించి నిల్వచేసినటువంటివాని విషయములో సదరు ధనమును ఏమి చేయవలెననే సమస్య ఒకటి ఏర్పడుతుంది. దీని అర్థం ఏమిటి? కష్టపడి సంపాదించిన ధనంగాని, గాలివాటంగా వచ్చిన ధనంగాని కొంత సమృద్ధిగా ఉన్నప్పుడు దానిని ఏమిచేస్తే బాగుంటుంది అనే యోచన తప్పకుండా, సహజంగా కలుగుతుంది. ఈకాలంలో బ్యాంకులు అనేవి అనేకము వెలసినవి గనుక వెంటనే మంచి బ్యాంకు ఒకటిచూచి అందులో, ఆ కోఠీలో, తన పైకాన్ని తన ఖాతాలో జమకట్టించడం ఉత్తమమైన పని. ఆరుమాసాలకొకసారి వడ్డీ యిస్తారు. బ్యాంకు స్థిరంగా ఉన్నంతకాలమూ మన ధనమునకు చలనము ఉండదు. మన దేశములో కోఠీ వ్యాపారం అనగా బ్యాంకు వ్యాపారం చాలాకాలం నుంచీ ఉంటూఉండేది. ప్రత్యేకంగా కొందరు సాహుకార్లు తమవద్ద ఉన్న ద్రవ్యాన్ని అప్పులకు యిస్తూఉండేవారు. అటువంటి కోఠీ వ్యాపారస్తులవద్ద కొందరు తమ ధనం దాచుకుంటూ ఉండేవారు. ఈ కోఠీ వ్యాపారస్థునివద్ద లక్షరూపాయీలు తెచ్చి ఏదైనా వ్యాపారం మనము చేసినట్లయితే, అట్టి వ్యాపారంవల్ల మనకు రెండు లక్షలు లాభం రావచ్చు. వ్యాపారంలో పెట్టుబడి పెట్టిన మూలధనం వృద్ధి అయిందని అన్వయించాలి. అందువల్ల యీవిధంగా లాభరూపమున వచ్చిన వృద్ధిద్రవ్యంలో కొంతభాగమును పెట్టుబడిధనంయిచ్చిన సాహుకారుకు పంచియివ్వడం అవసరం - లక్షరూపాయీల పెట్టుబడితో వ్యవసాయంచేసి పంట బాగా పండించినట్లయితే, ఆవ్యవసాయంవల్ల వచ్చిన ఫలసాయంలో కొంతవంతు యివ్వవలెననికోరితే, కోరిన రేటు భారం కాకపోతే, కృతజ్ఞతా పూర్వక వందనములతో సహా, తాంబూలంలో పెట్టి సమర్పించవలసిందే - వృద్ధియైన అయిశ్వర్యం సమృద్ధిగా ఉన్నప్పుడు అట్టి అయిశ్వర్యాభివృద్ధికి తోడ్పడి సహకరించినవారందరూ, అట్టి అయిశ్వర్యాభివృద్ధిలో సహభాగస్వాములే అని అంగీకరించాలి. ఈ వృద్ధిద్రవ్యంలో అందరికీ భాగస్వామ్యం ఉండవలసిందే.

ఈ వృద్ధినే వడ్డీరూపంలో పంచిపెట్టవలసిఉంది. వడ్డీ అంటేనే వృద్ధి. కాబట్టి దేశంలో వడ్డీరేటు పెరిగిందంటే, అయిశ్వర్యం వృద్ధి అయిందని అర్థం చెప్పవలసి వస్తుంది. బ్యాంకులలో వడ్డీరేటు హెచ్చుగా యిస్తున్నారంటే, బ్యాంకులవద్ద అప్పులు తీసికొన్న ఆసాములు బ్యాంకులకు హెచ్చురేట్ల వడ్డీ యివ్వగల్గుచున్నారని అర్థం. ఈ ఆసాములకు వ్యాపార లాభాలు ఎక్కువగా వస్తూఉండడంవల్లనే బ్యాంకులకు హెచ్చురేటు వడ్డీని యివ్వగల్గుతారు. కాబట్టి వడ్డీరేటు హెచ్చినదంటే వ్యాపార రంగంలో అయిశ్వర్యలాభాలు వృద్ధిగా ఉన్నాయని బ్యాంకులు అన్వయిస్తాయి. వృద్ధి అంటేనే "వడ్డీ"—"వడ్డీ" వృద్ధి. బ్యాంకులో పెద్దపెద్ద ఖాతాదారులు అంటేనే వేలకొలదిగా లక్షలకొలదిగా ధనం దాచుకుంటే, ఆ ద్రవ్యమును బ్యాంకువారు యితర ఆసాములకు అప్పులుగా యిస్తారు. అప్పులుగా యిచ్చిన మొత్తములకు వడ్డీలు వసూలుచేస్తారు. ఈ వడ్డీలవల్ల బ్యాంకుకు ఆదాయం చాలా వస్తుంది. సదరు వడ్డీ ఆదాయంలో భాగాన్ని బ్యాంకులో పైకం దాచినవారికీ, బ్యాంకుకు పైకం సమకూర్చినవారికీ దామాషాయీ లెక్కను పంచిపెడ్తూ ఉన్నారు.

ఈ విధంగా బ్యాంకులో పైకం దాచుకున్నవారికి వడ్డీ యిస్తున్నారు. అయితే యీ వడ్డీరేటు అంత ఎక్కువైనది కాదు. నూటికి నెల 1కి నాలుగణాలు లభించడం ఒక గొప్ప విషయం కాదంటారు. ధనస్వాములు తమంతట తామే అప్పులిచ్చి వడ్డీ వసూలు చేసికొనినట్లయితే, నూటికి నెలకు ఒక రూపాయిచొప్పునకూడా లభిస్తుంది. అనగా నాలుగురెట్లు ఎక్కువ వడ్డీ లభిస్తుంది. కాని, స్వయంగా అప్పులిచ్చి ప్రోనోట్లు వ్రాయించుకొని, తాకట్టు దస్తావేజులు వ్రాయించుకొని, యీ బాకీ వసూళ్ళకోసం కోర్టులకెక్కి, ప్లీడర్లకు ఫీజు లిచ్చి, డిక్రీలు పొంది, కోర్టుద్వారా బాకీదారుల ఆస్తులను ఏలము వేయించి, అప్పు

మొత్తమును ఆఖరుకు వసూలు చేసికోవడం చాలా వ్యయప్రయాసలతో కూడిన పని. చిట్టచివరకు లెక్క చూచుకుంటే, కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లుగా వ్యవహారకాండ అంతా, వ్యయభారకాండ కావచ్చు. ఇదంతా ఎందుకు? హాయిగా కాలుమీద కాలు వేసికొని, బ్యాంకులలో పైకాలు వేసికొని కాలక్షేపం చేస్తే శ్రేష్ఠం. బ్యాంకువారే మనయింటికి వచ్చి యిదిగో మీ మొత్తానికివచ్చిన ఫలసాయం అన్నట్లుగా, అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా, మీ మొత్తానికి వేసిన గెల తాలూకు అత్తమిదిగో అని తెచ్చి యిస్తారు. ఈ విధంగా వడ్డీ పెరిగి, శ్యమంతకమణి బంగారుగ్రుడ్లు పెట్టినట్లుగా ఆయిశ్వర్యం వృద్ధి అవుతూఉంటే, లచ్చి వచ్చి మన యింటితలుపు కొట్టినట్లుగా ఉంటుంది అటువంటి సందర్భంలో "మా యింటిలో పలికి రావద్దులక్ష్మమ్మా! బ్యాంకులోనే ఉండక మళ్ళీ యిక్కడికి వచ్చావెందుకు?" అని విసువుతో కసరి కొట్టేవాళ్లు ఉండరు

"సిరి రా మోకాలొడ్డ నేల?" అనేవాక్యం వింతవిషయంగా కన్పిస్తుంది. కాని, అటువంటివాళ్లుకూడా అక్కడక్కడ ఉన్నారనేమాట అబద్ధంకాదు ఒక శుద్ధ శ్రోత్రియోత్తమ నిష్ఠాగరిష్ఠుడైన ముసల్మాను ఉండేవాడు. ఆయన పేరు సలాం సాహెబ్బుగారు. ఆయన మతంప్రకారంగా వడ్డీ పుచ్చుకోవడం అన్యాయం అక్రమం. అటువంటి వడ్డీవ్యాపారాలు తన మతధర్మశాస్త్రానుసారం చేయకూడదని వాదించేవాడు. ఆ విధంగా యీ కలియుగంలో ఆయన వెలసినందుకు సాటి మహమ్మదీయులకు ఆయనమీద ఒకవిధమైన గురుభావంకూడా ఉండేది ఆయనయందు చాలామందికి భక్తిప్రపత్తులు ఏర్పడుటకు అదొక పెద్ద కారణంగా ఉండేది అయితే, ఋషంతా లక్ష్మిమీద నిరక్ష్యమా? అని శంకించి తబ్బిబ్బయినసాహెబ్బులు చాలామంది ఉన్నారు. ఆయన మంచి స్థితిపరుడు. సలాంసాహెబుకు సాలుసరి అయివజు పహాసాలమీద ఉంటుంది. దుబారా చెయ్యడు. కాని నవాబులాగున నలుగురిలో దర్జాగా బ్రతుకుతున్నాడు. ఆయన స్నేహితులుగాని బంధువులుగాని ఎవరైనా రొక్కం అవసరం ఉండి ఆయనను అప్పు యివ్వండని నొక్కి నొక్కి అడిగితే, ఒక్కటే జవాబు చెప్పేవాడు. "అరే! భాయ్! అసలైన ముసల్మాను ముఖంఎదుట అటువంటిమాట అనవద్దు. నా గడ్డం తీసివేయమంటే తీసివేస్తాను. కాని వడ్డీ తీసికోమంటే, నా ప్రాణం పోతుంది. కనుక, వడ్డీ పుచ్చుకొని అప్పులివ్వడం ఏ 'లా' ఒప్పుకున్నా అల్లా ఒప్పుకోడు. అటువంటి వడ్డీ వ్యాపారంలోకి నేను దిగడం ధగిడీపని. నన్ను అప్పు అడగడం చెప్పుతో కొట్టినట్లే "మీ వడ్డీకొక సలాం!" అని సలాం సాహెబు జవాబు చెప్పేవాడు.

ఈవిధంగా ఎవరికీ అప్పు యివ్వకుండా తప్పించుకొనేవాడు. అప్పు లిచ్చినతర్వాత అయినవాళ్ళతో అనేక కలహాలు కలుగుతాయి అనే భావంతో బావమరదితో కూడా లావాదేవీలు పెట్టుకొనేవాడు కాడు. కాని సలాం సాహెబుగారి సాలుసరి పంటధాన్యంఅంతా అమ్మివేసినతర్వాత ఆ పైకంతో ఏవైనా కొత్తభూములు బేరానికి వస్తే కొనేవాడు. అటువంటి అవకాశం లేకపోతే, ఆ పైకం బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా (స్థిర మొత్తముగా) నిల్వఉంచేవాడు. ఆవిధంగా ఆయన డిపాజిట్లు మొత్తం లక్షకు మించి ఉంటుందని లోకం చెప్పుకునేది. ఒకనాడు సలాం సాహెబ్బుగారు గడ్డం దువ్వుకుంటూ కొరాను పారాయణంచేస్తూ సావిట్లో కుర్చీలో కూర్చున్నాడు. ఆయన చుట్టూ ఉన్న కుర్చీలలో ఘరానా మిత్రులు కొందరు కూర్చుండి, ఆయన చదివి వినిపించుచున్న స్వమత సారసంగ్రహ గుళికలను "వహావ్వా వహావ్వా" అంటూ, రసగుల్లాలవలె, "నోరూర చవులు బుట్టగ" విని ఆనందిస్తున్నారు. సరిగ్గా ఆ సమయంలోనే బ్యాంకునుంచి గుమాస్తా వచ్చి సలాం సాహెబ్బుగారి కొక ఉత్తరం ఇచ్చాడు. బ్యాంకులో సాహెబ్బుగారి డిపాజిట్లు మొత్తములమీద ఆయన తీసికోవలసిన వడ్డీ రమారమి మూడువేల రూపాయీలవరకు ఉన్నదనిన్నీ, ఆ మొత్తం ఏమి చెయ్యమంటారో వెంటనే తెలియజేయవలెననిన్నీ, అందుకొరకై సలాం సాహెబుగారి జవాబుకోసం బ్యాంకు ఏజంటుగారు ఎదురుచూస్తున్నారనిన్నీ, ఆగుమాస్తా వచ్చి చెప్పాడు. ఆ మాటవిని సలాం సాహెబుగారు జ్వాలా సాహెబు లాగున మండిపడ్డారు. "ఇన్ని దినాలనుంచీ నాతో మీరు దోస్తీ చేస్తూ, మన సంగతి తెల్సుకోలేదూ అంటే, బలే చిత్రంగాఉంది. వడ్డీ మొత్తం అంటే అది మా గడ్డిదొడ్డిలోకికూడా రాకూడదు. అది మాకీ మీరు యివ్వకూడదు. మేమూ పుచ్చుకోకూడదు" అన్నాడు. ఆ మాటవిని అక్కడ ఆయనచుట్టూ సుఖాసీనులైన ముసల్మానులందరూ ముక్కుమీద వేళ్లు వేసికొన్నారు. ఆ మాటలన్నీ బ్యాంకుగుమాస్తా విని, "అలాగయితే ఆ మొత్తం మీకు పంపించము లేండి మరో ఫిక్స్డు డిపాజిట్టుగా మీ పేర బ్యాంకులోనే ఉంచుతాము. అది మీకు సమ్మతమేనా?" అని బ్యాంకు గుమాస్తా ప్రశ్నించాడు. ఆ మాటలకు సలాం సాహెబ్ "సెబాస్!" అన్నాడు. "అల్లా చెయ్యండి. అది అల్లా మెచ్చినపని" అన్నాడు.

ఇంగ్లీషు చదువుకొన్న పెద్దలు కొందరు సలాం సాహెబు గారితత్వం చాలా చిత్రంగా ఉన్నదన్నారు. ఆయన వడ్డీ పుచ్చుకోనంటాడుగాని వడీమొత్తాన్ని తిరిగి డిపాజిటుగా బ్యాంకులో నిల్వ ఉంచితే, ఆ వడ్డీకి వడ్డీ ఆయనకు లభిస్తుంది. కనుక, యిందుమూలంగా ఆయన అయిశ్వర్యం మఱ్ఱిఊడలు దిగినట్లుగా విస్తరిస్తోంది.

అయితే మన ఆర్థికధర్మసందేహం కూడా ఒక ఊడవలె ఇంకా వ్రేలాడుతూనే ఉంది. సలాం సాహెబ్బుగారుతన అయిశ్వర్యం అంతా ఆప్రకారంగా నిల్వచేస్తూ ఉండడంవల్ల ఆయన అనుభవించడమూ లేదు. ఆయన యితరులకు దానం చేయడం లేదు. ఈ రెండు పనులూ ఆయన చేయుట లేదు గనుక, మూడో గతి దానికి పట్టవలసి ఉంటుంది. ఆయన మూట్కైముడి వీడేగతి దాని మూడోగతి. కాని, బ్యాంకులో దాచినటువంటి ధనం లోకులకు అనేక అవసరాలకు బ్యాంకువారిచే అప్పుగా యివ్వబడుతూ

(54-వ పేజీ చూడండి)

చర్చలో మాన్యరాగం

ఆరుద్ర

"లలాటాన కుంకుమాగ్ని
భుజంమీద బుఱ్ఱదుబ్బు
కాళ్ళకింద క్రొత్త చెప్పు
అడుగో స్త్రీం పాడుంకాయ
హద్దు లేని అవధానం
వెళిపోయిం వెళిపోయింది"

అని ఒకటింపావు పుస్తకాల కిందటే జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి వాపోయాడు. నిజమే! ఆశు కవిత్వాలకీ, అవధానాలకీ ఇవి రోజులు కావు. ఆ యుగం అంతరించిందా అనిపిస్తుంది. తిరుపతి కవుల ధర్మమా అని రెండు తరాల కిందటదాకా, ఊరికి కనీసం ఇద్దరు జంటకవుల ముఠాలు, వీధికో ఆశుకవి పూర్వం మనకి ఉండేవారు. నెలాళ్ళ కొకసారైనా ఏదో అవధానం ఉండేది. ఆ వాయస స్వర్ణయుగం అయిపోయింది.

జంటకవిత్వం, ఆశుకవిత్వం ఆరోజుల్లో మరీ శ్రుతి తలలు వేసి పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు కంఠాభరణంలో గేలి చేయవలసినంత, చేసినంత దుస్థితికి వెళ్ళింది. 'బోడా ఇశ్చేదవు గేదె పేడా! భరలోన' అనే పద్ధతిలోనే చిల్లర కవిత్వం దిగిపోయింది. ఆశుకవులన్నా అవధానం చేసేవాళ్ళన్నా చిన్న చూపు, అగౌరవం, అంటరానితనం మొదలైనవి ఈరోజుల్లో పరిపాటి అయిపోయింది.

కాని ఆశుకవిత్వాన్నీ అవధానాన్నీ అంతగా కొట్టి పారెయ్యకూడదు ఈ విద్య అంతరించకూడదు. సమర్థులైనవాళ్ళు ఆశు కవిత్వం చెపుతూ ఉంటే సదస్యులకి షడ్రసోపేతమైన భోజనం చేసినట్టు ఉండక తప్పదు.

సర్వసామాన్యులకి ఎవరేనా కవిగారిని పరిచయం చేస్తున్నప్పుడు - "కవిగారూ - ఆ చీపురుకట్టమీద పద్యం చెప్పండి - ఈ గొంగళీపురుగుమీద కవిత్వం కట్టండి" అని అడగడం ఆ సర్వసామాన్యులకి సర్వసామాన్యం. ఇలాగ మామూళ్ళ విషయాల మీద కావ్యవస్తువులు కాని వాటి మీద పద్యాలు చెప్పమంటే భావకవులకి కోపం రావచ్చు. ఆధునిక కవులు అలా చెప్పడానికి ఇష్టపడకపోవచ్చు గాని చెప్పగలగడం మంచిది. చెప్తే మరీ మంచిది.

శ్రీశ్రీ చెప్పినట్టు
"అగ్గిపుల్లా
సబ్బుబిళ్లా
కుక్కపిల్లా
కాదేదీ కవితకనర్హం
ఔనౌను శిల్పమనర్ఘం"

చెప్పగలిగినవాడుంటే దేనిమీదైనా పద్యం చెప్పగలడు. ప్రజలను రంజింప చెయ్యడం కవిత్వంయొక్క బహు ప్రయోజనాలలో ఒకటి. చిత్రకవిత్వం, సాము గరిడీలు, సమస్యా పూరణాలు మొదలైనవి కూడా సజీవంగా ఉండాలి, వాటిని ప్రాక్టీసుచేసి ప్రజలలో కవితాశక్తిని ప్రదర్శించి, కవితాసక్తిని పెంపొందించే కవులు ఉండాలి.

అందుకే మొన్న కర్నూలులో ఎవరో ఆశు కవిగారికి సన్మానం జరిగిందని చదవగానే ప్రాణం లేచొచ్చింది. ప్రతి ఊళ్ళో మూడునెలల కొకసారైనా ఆశు కవిత్వ ప్రదర్శనాలు, అవధానాలు జరిపించి ఆ కవులకి తగు రీతిగా సన్మానాలు చేయిస్తే చాలా మంచిది

ఆధునిక కవిసమ్మేళనాలు కావ్యపఠనాలు జరిగే ఈరోజుల్లో ఇలాగ పాత పద్ధతిలో అవధానాలు అవీ జరిపించడం, గడియారాన్ని వెనక్కి తిప్పడం అని భావించకూడదు. కవిత్వంలో ప్రజలు స్వయంగా పాల్గొనే పద్ధతి అవధానం. ఉత్సాహం ఉన్నవాళ్లు ఒక సమస్య ఇవ్వడానికి ప్రయత్నిస్తారు. లేదా "పూలదండ" "మాలముండ" "కొత్తకుండ" "గోలకొండ" లాంటి ఏవో మాటలుపెట్టి పద్యం అల్లమంటారు అదికూడా అడగలేనివారు ఏదో మామూళ్ళ విషయంమీద ఏదో పద్యం చెప్పించుకొంటారు. ఏమైనా ప్రజలు సంతోషించేది అవధానం. దాన్ని పునరుద్ధరించడం ఆరకం కవుల ధర్మం. ఆ కవులని ప్రోత్సహించి పోషించడం ప్రజల విధి!

* * *

సుభద్రా బలభద్ర సమేతుడైన శ్రీ జగన్నాథుడు రథంమీద బైఠాయించి-యాత్ర సాగించి, గుడిసన్న గుళ్ళకిళ్ళి అక్కడ ఒక పదిరోజులు కెంపు ఖిణాయిస్తాడు. కొండ జగ్గడిలాంటి మన ఆంధ్ర ప్రభుత్వం కూడా వేసవిలో రథాయాత్ర లాంటి పొగబండీ యాత్ర చేసి, గుడిసన్న గుళ్ళలాంటి పెద్ద వాల్తేరు కాలేజీ భవనాలలో కచేరీ పెట్టుకొని కెంపు ఖిణాయిస్తుందట! శ్రీ జగన్నాథుడు ఆ పది రోజులు అక్కడ క్షేమంచేసినమీదట పూజారులు రోజుకో అవతారం చొప్పున స్వామివారికి దశావతారాలు అలంకరించుతారు. మన ఆంధ్రప్రభుత్వం మట్టుకూ వాల్తేరులో ఉన్నంతకాలం రోజుకో అవతారం దాల్చకుండా ఉంటే చాలు!

రాజధాని రావలసినది అది ఎగిరిపోయింది. పోనీ హైకోర్టు వస్తుందా అంటే ఆ కోరికా విరిగిపోయింది. విశాఖపట్నం వాళ్లకి వళ్ళు మండి - ఏడుపొస్తున్నది. "నేను విశాఖపట్నం వొదిలిపెట్టేసి చెన్నపట్నానికి కాన్నాళ్లాయి వెళిపొచ్చేసినా నా అంతరాత్మ అక్కడే తచ్చాడుతూ ఉంటుంది. కాబట్టి మా ఊరివాళ్ల లోలోపలి ఏడుపు వినిపించేస్తూ ఉంటుంది" వాంఛూ వాంఛించినా మా ఊరుకి ఏ ఒక్కటీ ఇవ్వకపోతే మా విస్సినాదంగారు . ఊరుకొంటారా?

'భ్రష్టులార పతితులారా
విశాపట్నం వాసులారా
దగాపడిన తమ్ములార
ఏడవకం ఏడవకం
ఛేఛవకండి!
వొస్తున్నాయ్ వొస్తున్నాయ్
వొస్తున్నాయ్ వొస్తున్నాయ్
జగన్నాథ రథచక్రా
లొస్తున్నాయ్ ఒస్తున్నాయ్"

అని వేసవి ప్రభుత్వ రథ చక్రాలని తుమ్మెదల మెట్టదగ్గర చినవాల్తేరులోదింపి - ఎర్ర మంటిదిబ్బల పెదవాల్తేరు పట్టిస్తున్నారు. అయితే ఒక్కందుకు నాకు విచారం! వానాకాలం చదువు ఎంత ప్రయోజనకారో ఎండాకాలం రాజధాని కూడా అంతేకదా అని నా మనవి! ఆంధ్రదేశంలో ఎండలులేనిచోటు ఎక్కడుంది. (మదనపల్లి తప్పించి). శాసనసభ్యులు ఆకర్నూలులోనే కూర్చొని పదిగ్గాతగాదాల మలిన వస్త్రాలు ఉతుక్కోవడమే మంచిదేమో

* * *

హావెన్‌లో చిన్న నేషనల్ కాంగ్రెసు లేవదీసి దేవుడిగారి పవర్సు తాను తీసుకొని గిరీశం ఆంధ్రదేశానికి వచ్చి కొన్ని ప్రణాళికలు అమలు జరుపుతానన్నాడు. అవి వరసగా: ఒకటి— ఈస్టరన్ ఘాట్స్ అనగా మన తూర్పు

(53-వ పేజీ చూడండి)

ఉయ్యాలలో తుఫాను

[పిల్లవాడు నిద్రపోకుండా క్యారు క్యారు మని ఏడుస్తూ మారాం చేస్తుంటాడు ఉయ్యాలలో]

తల్లి : (పాడుతూ)

ఏడవకు ఏడవకురా
నాపాప
ఏడిస్తె చూడలేనూ
నీ కలువకళ్లలో నా
కన్నీళ్ళు
నీలాలు కురియుట నేలా? ||ఏ||
బూచివాడొచ్చె నదిగో
ఎంచక్క
బబ్బోరబుద్ధి గానూ
ఎత్తుకొని పోతాడురా
పిల్లల్ని
ఏడిస్తె పూరుకోడూ ||ఏ||
తెలివిగా మెలగవలెరా
నాపాప
దేశభక్తుడవీవురా
వీరుడై వన్నె కెక్క
అమ్మనూ
వీరమాతను చేయరా ||ఏ||

[పిల్లవాడు ఏడవటం మానివేసి నిద్రపోతాడు]

నాపాప నిదురలో నవ్వుకుంటాడు
పెద్రిలోకము చూసి వెక్కిరిస్తాడు
అమ్మకెన్నో ఆశలున్నాయి,
ఆచరించాలోయి అబ్బాయి!
అమ్మచెప్పినమాట వినవోయి,
అన్ని కలలూ నిజము లవుతాయి!
అయిదేళ్లు రాగానె నీకు
బడిలోకి పంపింతు నిన్ను.
చదవాలి శ్రద్ధగా అబ్బాయి!
అమ్మ నోచిననోము నీవోయి!

* * *

పంతులు :

రెండు రెళ్ళు ఆరేమిట్రా ధడవా?
'ఎక్క' భంగమయిందిరా ఈతడవా!
'కుంచానికి ఆరుశేర్లు' ఇదొకటా!
మానభంగమయిందిరా చవటా!

అబ్బాయి :

వెధవచదువు వెధవచదువు,
వారానికి వొకటే సెలవు!
రోజూ ఆదివారమయితే బాగుండును!
మేష్టారికి జబ్బుచేస్తే బాగుండును!

1-వ పంతులు :

ఆర్కిమిడీస్ సిద్ధాంతం
అంతా తప్పావోయ్

2-వ పంతులు :

పైథాగరస్ థీరం
పల్టీ కొట్టించావోయ్,

3-వ పంతులు :

అయ్యఖర్మ! అది
కర్మధారయ కాదురా!

4-వ పంతులు :

ఫ్రాన్సుకి రాజధాని
బెర్లిన్ యేమిట్రా!

అబ్బాయి :

వెధవచదువు వెధవచదువు
పనికిరాని పాడుచదువు.

* * *

పం : ఇంద్రధనుస్సుకి కారణమేమిటి?
అ : ఏదో వొకటి!
పం : మైనస్ ఒకటికి స్క్వేర్రూటెంత?

భాస్కరం : ప్రభాకరం

అ : ఎంతో కొంత!
పం : ఉల్లిపాయలో సల్ఫర్ వుందా?
జెల్లీఫిష్‌లో ఫాస్ఫర్ వుందా?
అ : వుంటేయేం వుండకపోతేం?
కొంప మునిగిపోయిందాయేం?

* * *

స్టూడెంటు :

యూనివర్సిటీ పరీక్షలు పైనెల,
బాగా చదవాలోయ్ మనమీనెల
అ : (బట్టీపడుతూ)
శార్దూలం మసజసతతగ
ఈఛందస్సు వీగాదరగ.
మత్తేభం సభరనమయవ
ఎందుకొచ్చిన ట్టీగొడవ!

* * *

(కాలేజీ గంట మోగుతుంది)

కాపరు :

ఏయ్ మీరంతా మంచివాళ్లుగాని,
కాపీకొట్టకండి, అది మీ కేహాని.
సొంతంగా రాయండి సమాధానాలు
లేకపోతే మీకూ నాకూ అవమానాలు.

* * *

(కాలేజీ వెల్లు)

ప్రశ్న : నువ్వెల్లా రాశా?
అన్సరు : డొక్కచీరేశా!
ప్ర : నువ్వెల్లారాశా?
ఆ : ఆ కైటేదాశా!
ప్ర : నువ్వెల్లారాశావ్?
ఆ : బాగా మార్కులురావ్.
ప్ర : చేశావా ఈథీరం?
ఆ : చాలండే సైం!

* * *

(కాన్వొకేషను)

ఛాన్సిలరు :

In the name and on behalf of the senate of Andhra University, I admit you to the Degrees of Master of Arts, Bachelor of Arts (Honours) and Bachelor of Arts in this University and in token there of you have been presented with these Diplomas and I authorise you to wear the hoods ordained as the insignia of your Degrees.

తల్లి :

పెళ్లివయసువచ్చింది నీకు నాయనా!
మంచిపిల్లని పెళ్లికి చెయ్యాలి ఎవతెనైనా.

* * *

అమ్మాయి :

ఏమిటోయ్ నీకవిత్వం నవ్వొస్తున్నా.
పూరుకుంటున్న కొద్దీ ఇదవుతావ్ మరీనూ!

అబ్బాయి :


అదికాదు నా ప్రేయసీ కాదు
అమృతమియ్యి ఈరోగికి ఒకమోతాదు.
నీవు నాకు చక్షువు.
నేను నీకు భిక్షువు.
ఓ మిస్ సైన్టిన్ ఫిఫ్టీఫోర్!
స్పైజ్ విన్‌చేసి నీ బ్యూటీ
ప్రెయిజ్ చెయ్యడం నా డ్యూటీ.

అమ్మాయి :

బావుందోయ్ నీమాటలూ నవ్వొస్తున్నా
పూరుకుంటున్న కొద్దీ మరీనూ!

అబ్బాయి :

నిన్ను చూశా నారోజా



గంధర్వస్త్రీ (నాగార్జున శిల్పం) —ఏ. హనుమంతరావు.

ఉయ్యాలలో తుఫాను

నీతల్లోని రోజు
నీ బ్యూటిఫుల్ బ్లౌజు
నీచేతికి ప్లాస్టిక్ గాజు
నీలవ్లీపోజు
అదే నాహార్టు బర్న్కు కాజు.
ఇదే నా కన్ఫెషన్
కోరుతున్నా నీ రిసెప్షన్
కాదా నాకది డిజెక్షన్
కాదంటే, చూశావా, ఆరివర్ సైడు
చేసుకుంటానుసుమా సూయిసైడు!

పంతులు :
రాసుకోండి కుర్రాళ్లూ రాసుకోండి.
ఇది పరీక్షలో అడుగుతారుసుమండీ!
వివాహాలలో రకాలు ఎనిమిది,
అందులో గాంధర్వం మొదటిది.
అనగా పంచభూతాలూ సాక్షిగా
మంత్రాల ప్రమేయం లేకుండగా
ప్రేయసీ ప్రియు లిరువురు
అమాంతం పెళ్ళాడుదురు.

అమ్మాయి :
మన పెళ్లికి మావాళ్లొప్పుకోరేమో?
చివరి కేమవుతుందో ఏమో!

అబ్బాయి :
మా అమ్మవిషయంమాత్రం?!..
...కాని దీనికుందో సూత్రం!
మనం రిజిష్టరు మేరేజి చేసుకుందాం.
ఎవరికీ తెలియకుండా వుడాయిద్దాం.

తల్లి :
కనిపెంచిన తల్లిమాట
కాస్త ఆలోచించరా
నీవాడిన దాట పాట
నీకడ్డే లేదురా!

అబ్బాయి :
అదుగో మాఅమ్మ వొప్పుకుంది
మీవాళ్లే ఇక మిగిలింది!

అమ్మాయి :
జరిగితీరుతుంది మన వివాహం.
ఎందుకంత నిరుత్సాహం?
ఏడుస్తా కోపిసా
మావాళ్లను వొప్పిస్తా.

* * *

[సన్నాయిమేళం. పెళ్లి మంత్రాలూ. "నాయనా మంగళసూత్రంకట్టు". సన్నాయి —"సీతమ్మ పెళ్ళికూతురాయె నే"]

* * *

అబ్బాయి :
ఓహో నా డియరెస్ట్!
నా ప్రేమే ఎవరెస్ట్!

అమ్మాయి :
ఓహో మై డార్లింగ్!
నా ప్రేమే పెన్సింగ్!

అబ్బాయి :
ఓహో నా స్వప్న సుందరి
నా ప్రేమకు లే దసలుదరి!
నీవలపులు చిలికినజాడలు
నందన తరు శాఖలనీడలు!

అమ్మాయి :
అది సరేలేకాని ప్రియతమా
వలపునమిలి బతకగలమా
ఉద్యోగం పురుషలక్షణం
పెళ్ళికాలి ఉద్యోగం తక్షణం,

*　　*　　*

("ఆలిండియా రేడియో. వార్తలు. ప్రధాన మంత్రి ఈరోజున కళాశాల ప్రారంభోత్సవం జరిపారు. ఆ సందర్భంలో ఆయన ఇలా అన్నారు. దేశంలో విద్యావాంఛ నానాటికీ ఎక్కువవడం దేశానికి శుభసూచన. కానీ నిరుద్యోగసమస్య దినదినానికీ ప్రబల మవుతున్నది నిరుద్యోగసమస్యా నిర్మూలనానికి పంచవర్ష ప్రణాళిక ఎంతైనా తోడ్పడగలదు"...ఫేడౌట్ -)

*　　*　　*

అబ్బాయి :
అయ్యా, ఐయామ్ ఏ గ్రాడ్యుయేట్.

సమాధానం :
సారీ, యూ ఆర్ ఎ బిట్ లేట్.

....

అబ్బాయి :
అయ్యా ఇప్పించం డొకజాబూ.

సమాధానం :
వేకెన్సీ లేదయ్యా బాబూ.

....

అబ్బాయి :
అయ్యా నేనొక బియ్యే గాణ్ణి.

సమాధానం :
ఖాళీవుంటే ఇచ్చేవాణ్ణి.

....

అబ్బాయి :
అయ్యా బియ్యే ప్యాసయ్యాను.

సమాధానం :
ఖాళీలేదు! వుంటే ఇవ్వనూ?

*　　*　　*

అబ్బాయి :
నే బియ్యే ప్యాసయ్యానండీ.
వుద్యోగం ఏదయినా ఇవ్వండీ.

షావుకారు :
ఎందుకయ్యా మాకు బియ్యేలూ ఎమ్మేలూ?
అందులో మీరంటే మాకెంతో హేళనలూ.

అబ్బాయి :
షావుకారు గారికి దండాలు
గట్టెక్కించాలి నా గండాలు.
చదువుసంగతి చూడకండిబాబూ
మీకేంకావాలో అది చేస్తాబాబూ

షావుకారు :
కల్లతూకములు తూచగలవుటోయ్?
నల్లబజారులు చేయగలవుటోయ్?

అబ్బాయి :
మీరేం చెబితే నే నది చేస్తా
మీకేంకావాలో అదిచేస్తా.

షావుకారు :
కోతలు బాగా కోయగలవుటోయ్?
ఇన్‌కంటాక్స్ ఎగగొట్టగలవుటోయ్?

అబ్బాయి :
మీ రేం చెబితే నేనదిచేస్తా
మీకేంకావాలో అదిచేస్తా.

*　　*　　*

అబ్బాయి :
వుద్యోగం దొరికిందే ప్రేయసి!

అమ్మాయి :
గుమాస్తాగిరీయే ఇంతా చేసి?

అబ్బాయి :
అయితేయేం పైన సంపాయిస్తాగా!

అమ్మాయి :
దానికిమాత్రం తెలివి ఏడిస్తేగా!

*　　*　　*

అమ్మాయి :
చూశారా, పక్కయింటిగణపతి గారు
నిన్న నే కొన్నారు మోరిస్ కారు

అబ్బాయి :
ఆయనకేమే, పెద్ద యింజనీరూ!
కారొకటేనా, చాలాకొంటారు!

అమ్మాయి :
చేస్తున్నారు వుద్యోగం ఇన్నాళ్లుగా
ఏమన్నా తెలివి ఏడిస్తేగా!

అబ్బాయి :
అబ్బబ్బ! అబ్బబ్బ!

*　　*　　*

అమ్మాయి :
వచ్చారూ, మహారాజావారూ?
రెండుపూటలా భోజనానికి తయారు!
అందరూఅన్నీ కొంటూంటారు చిత్రం!
మనంమాత్రం ఇంతే దరిద్రం!

అబ్బాయి :
ఎడతెగని దరిద్రం
ఇక ఇంతే మనమిద్రం.

*　　*

అమ్మాయి :
టెస్టుమ్యాచి జరుగుతోంది
జనవరి పన్నెండుని!

అబ్బాయి :
చిల్లిగవ్వ చేతలేదు
చంపకు డబ్బిమ్మని!

*　　*

అమ్మాయి :
ఎల్లుండే వస్తున్నది
'ఐవన్హో' పిక్చరు.

"చస్తున్నానురా బ్రదర్ - ఈ సమస్యలతో తల బద్దలైపోతోంది. మన తరఫున యీ బాధలన్నీ పడటానికి సిద్ధంగా వున్నవాడిని ఎవణ్ణైనా చూడు; వాడికో ఐదొందలు యిచ్చేస్తాను!"

"ఐదొందలే?...ఐతే నేను సిద్ధంగానే వున్నాను. తే! నీ ఐదొందలూ!"

"ఆ ఐదొందలూ పుట్టించడమే నాకు యిప్పుడు పట్టుకొన్న మొదటి సమస్యరా భాయ్।"

అబ్బాయి :
చేత కానిలేదుకాని
సినీమాకి తయారు.

అమ్మాయి :
"అబ్బబ్బా! అబ్బబ్బా
డబ్బులేదు, డబ్బులేదు"
విసుక్కోని క్షణంలేదు.
డబ్బొచ్చే దినంలేదు.

అబ్బాయి :
అబ్బబ్బా! అబ్బబ్బా!
ఆపది యమరాక్షసి
శత్రువుకైనా వద్దోయ్
చదువుకున్న ప్రేయసి.

[మహాసభ. జనం. కోలాహలం]

(వక్త) రాజకీయ నాయకుడు ·
అహ్యహా! సుతసుతనిబు
ధాన్యహా! సోదరాంధ్రులారా! నేడీ
యుష్యత్ప్రపంచధోరణి
భోగ్యముకద, ఇది
　　అపూర్వమున్ గాదుగదా!
ఓహో భారతయువకుల్లారా!
ఓహో భారతయువతుల్లారా!
దేశానికి ఇది అగ్నిపరీక్ష
మీరంతా పూనాలీదీక్ష
నేడో రేపో రానున్నది యుద్ధం.
యుద్ధానికి మీరంతా సిద్ధం
కావలిసిన సమయం వచ్చెను.
ఆత్మార్పణకిదే అదను.
నరహంతకి అదిగో దారిద్ర్యరోగం.
పారవిచ్చుకు వస్తున్నది నిరుద్యోగం.
గడ్డుసమస్యలు కడతేరాలి.

ఉయ్యాలలో తుఫాను

ప్రజలంతా బాగుపడాలి.
అయితే వున్నది వొకటే దారి.
మీరంతా ఎంచుకోవాలి రహదారి.
దారిద్ర్యంతో చనిపోవడమో,
దేశంకోసం ఆహుతవడమో.
నేడో రేపో రానున్నది యుద్ధం,
యుద్ధానికి మీరవ్వాలి సిద్ధం.

పంతులు:
నేనురాను నేనురాను,
యుద్ధంలో కసలు రాను.
ఇక్కడున్న విద్యార్థుల
కెంతో చెప్పాలి నేను.

వక్త:
మీరంతా సైన్యంలో చేరాలి
మీరంతా ముందుకి రావాలి!

షావుకారు:
నేనురాను నేనురాను,
యుద్ధంలో కసలు రాను.
ఇక్కడుండి వ్యాపారం
"ఇంప్రూవ్" చెయ్యాలి నేను!

వక్త:
మీరంతా సమరంలో చేరాలి
నడుంకట్టి ముందుకు దూకాలి

పంతులు:
ఇట నిలబడి చూస్తున్నా
డిదుగో నా శిష్యుడు.
నవయువకుడు, కడుధీరుడు,
ఇదుగో నా శిష్యుడు.

షావుకారు:
అవును నిజం, అవును నిజం
అతను మాకు గుమాస్తా.
యుద్ధానికి పంపిస్తా.
అతను మాకు గుమాస్తా.

శ్రీశ్రీ:
స్వాతంత్ర్యం, సమభావం
సౌహార్దం, సౌభ్రాత్రం
పునాదులై ఇల్లు లేచి,
జనావళికి శుభం పూచి,
శాంతి కాంతి కాంతి శాంతి
శాంతి కాంతి జయిస్తుంది.
ఈ స్వప్నం నిజమవుతుంది!
ఈ స్వర్గం ఋజువవుతుంది.

అబ్బాయి:
మన స్వప్నం కరిగింది!!!
రణరంగం రగిలింది!
శాంతి వీణ మూగవోయి
రణభేరి మ్రోగెనోయి.

వక్త:
మీరంతా రావాలి ముందుకు.
ఆలస్యం చేస్తా రెందుకు?

తల్లి:
కని పెంచిన తల్లి వాక్కు
కొంత ఆలోచించరా.
యుద్ధం ఇది, మనుజభుక్కు,
దానిజోలి వలదురా.

అమ్మాయి:
పెట్టుమ్యాచి జరుగుతోంది
జనవరి పన్నెండుని
ఎల్లుండే వస్తున్నది
ఐవన్హో పిక్చరు.

వక్త:
నవయువకా, యుద్ధానికి రమ్మని

పంతులు:
పాఠశాల ప్రార్థిస్తున్నది.

షావుకారు:
దేశం కోడై కూస్తున్నది.

వక్త:
భగవద్గీతలో ఏమన్నాడు
శ్రీకృష్ణభగవానుడు? -
హతోవా ప్రాప్స్యసి స్వర్గం
జిత్వా వా భోక్ష్యసే మహీం
తస్మాదుత్తిష్ఠ కౌంతేయ
యుద్ధాయ కృతనిశ్చయః॥

అబ్బాయి:
ఇదుగో నే చెప్తున్నా
యుద్ధంలో చేరేశా.

సోల్జర్‌గా వస్తున్నా.
ఇస్తున్నాను భరోసా.

అంతా :

ఆహోహో ఆహోహో
నవయువకుడు త్యాగమూర్తి!
ఇక చూస్కో నల్దిక్కుల
వ్యాపించును అతనికీర్తి!

తల్లి :

నీకేమీ చెప్పాలేనూ,
మాట్లాడక కూర్చోలేనూ.
వెడుతున్నావ్ యుద్ధంలోనికి
ఆశీస్సులు ఇవిగో నీకు.
[యుద్ధం...బాంబులు...సైరన్లు]

వక్త :

యుద్ధం డిక్లేరయింది,
సిద్ధం కావాలి మీరు.
యుద్ధం డిక్లేరయింది
సిద్ధం కావాలి మీరు.
[యుద్ధం....బాంబులు...సైరన్లు]

శ్రీశ్రీ :

ఏమిటి ఈ అపస్వరాలు?
—తెగింది తీగ
ఏమిటి ఈ వింతభయాలు?
—చావూ బ్రతుకూ
ఎచటికిపోతా వీరాత్రి?
—అవతలిగట్టుకు.

(ఆలిండియా రేడియో. వార్తలు. ఈనాడు ఇరవయిఆరవ జోన్‌లో సంకులసమరం కొనసాగింది. చాలామంది హతులయినప్పటికీ జయం ఇదమిత్థమని నిర్ణయం కాలేదు మన సైనికులంతా చాలా నైపుణ్యంతో పోరాడుతున్నారు......")

వక్త :

అద్భుతంగా ఎగురుతోంది మనధ్వజం!
విజయం మనదే, అదిమాత్రం నిజం!

పంతులు :

నాశిష్యులు సాగిస్తున్నారు వార్
మహాసమర్థులు, వీరాగ్రేసరులువారు!

షావుకారు :

" యుద్ధం బాగా సాగుతున్నది
వ్యాపారం మూడింతలవుతున్నది!

(ఫేడిన్) "ఈ వార్తలు మీరు ఆలిండియా రేడియోనించి వింటున్నారు. ఈ దినం ఇరవయిఆరవ జోన్‌లో మరణించిన వారి జాబితా ఇప్పుడే అందింది. మొదట ......" ఏదో చదువుతాడు అస్పష్టంగా (ఫేడౌట్)

పంతులు :

అయ్యయ్యో, అతడే నాశిష్యుడు
నవనీతసమానహృదయుడు.
అతని పేరు పాఠశాలలో
చిరస్థాయిగా నిలిపేశాడు.

షావుకారు :

మాకుమాస్తాయేనాండీ?
చాలామంచివాడు సుమండీ!
మరచిపోలేనతన్ని పాపం
అతని కుటుంబానికై నాసంతాపం

వక్త :

అతనికేమండీ అదృష్టవంతుడు
వీరస్వర్గం చూరగొన్నాడు!
అతనితల్లి కిదే మనదేశం
పంపుతున్నది సానుతాపసందేశం!

*　　*　　*

తల్లి :

ఎందుకు నాకీ సందేశాలూ?
తెస్తాయా నాపుత్రుడి జీవాలు?
మీరంతా నరరూప రాక్షసులు
తీసుకున్నారు నాకొడుకు అసువులు
మీరంతా తేనెపూసిన కత్తులు!
అధికారాసక్తులు, రక్తపానమత్తులు!
స్వార్థపరులు అంతా మీరు
నాకుమారుణ్ణి చంపేశారు!
నాయనా, బాబూ, చనిపోయావా
నాయనా, బాబూ, నువ్వికరావా?
కనిపెంచినతల్లి హితోక్తులు
కాస్తైనా ఆలోచించావా
తొందరపడి వెళిపోయావా?
చిచ్చుపెట్టి వెళిపోయావా?

శ్రీశ్రీ :

"ఓవ్యథానివిష్టులార
ఓకథావశిష్టులార
పతితులార భ్రష్టులార
బాధాసర్పదష్టులార
దగాపడిన తల్లులార
ఏడవకం డేడవకండి!
నాస్వప్నం నిజమవుతుంది
మనస్వర్గం ఋజువవుతుంది."


*　　*　　*

(పిల్లవాడు నిద్దర్లో లేచి ఏడుస్తాడు)

తల్లి :

ఇది అంతా కలయేనా?
అయితే అంతా కల్లేనా?
ఊహావ్యక్తులా మీరంతా!
కలచివేశారు నామనసంతా.
వద్దు యుద్ధం మానవాళికి.
స్వసి చెప్పుడు యుద్ధకేళికి.
వద్దు యుద్ధం మానవాళికి
పాటుపడాలిక లోకశాంతికి.
(పిల్లవాడు మళ్లీ ఏడుస్తాడు)
లేచావా నిద్రలోంచి నాన్నా
ఇప్పుడే నీమీద పీడకలకన్నా.

(54-వ పేజీ చూడండి)



నవయుగ పిక్చర్సు
జ్యోతి
జి. వరలక్ష్మి...సావిత్రి...శ్రీరామమూర్తి
పెరుమాళ్లు
కాశ్యప.
నేడే చూడండి
డైరెక్షన్.....శ్రీధర్ & తిలక్.
మ్యూజిక్.....పెండ్యాల.
రచన.....సుంకర & వాసిరెడ్డి గంటి.
స్టూడియో...వాహిని.

పిలవని పేరంటం

మండువాలో అడుగుల అలికిడీ, కొత్త గొంతుకా విని, కాంతారాణి పక్కమీంచి లేచి బయటికొచ్చింది. గోడగడియారం వళ్లు విరుచుకొంటూ బద్ధకంగా గంటలు కొడుతోంది. కాంతారాణి చెంపకు చేరజేసి కళ్ళు సావిడీ మండువా అంతా కలయదిరుగుతున్నాయి. అప్పుడే లేతయెండ నిప్పుచ్చారలా మండువాగొట్టంలోంచి, తొంగిచూస్తోంది– అప్పుడే లేచిందేమో – చెదిరిన ముంగురులూ విడివడిన తలకట్టూ – చెరిగిన కోకతో నలిగిన అందంలా వుంది.

అప్పుడే రామరాజూ, రాజారావు డ్యూటీలకి వెళ్ళిపోయేరల్లే వుంది. ఇల్లంతా నిశ్శబ్దిస్తోంది.

ఎవరా వచ్చిన కొత్త ముహం?

ఏవిఁటా తమమధ్య చుట్టరికం?!

బాగా ప్రయాణం దెబ్బలు తిని సొట్టలుపడ్డ పెట్టె –దాంతో ఓ పాతగుడ్డలమూట– ఆ మూటలోంచి తొంగిచూస్తోన్న రాగిచెంబూ – ఆ వచ్చిన కొత్తవ్యక్తి తాత్కాలికపు టాస్తి! ఇది కాంతారాణి లేవగానే చూచిన అపూర్వ దృశ్యం.

"అయ్యో నా బంగారు తల్లీ! నీకోసమేనే నా రాక! కొంతానివి కావే! అలా కురచగా చిక్కిపోయావేమే? నన్నెగాదిగా అలా చూస్తావేమే? నేనే నే! రత్తమ్మ బామ్మని! జ్ఞాపకం లేదటే? నీ పెళ్ళికి, ఆయనా నేనూ దడదడలాడుతూ వచ్చాం" అంది.

కాంతారాణి తొట్రుపాటు, తడబాటూ పడుతూ, "మీరా బామ్మగారూ లోపలికి రండి!" అంది. ఆ వచ్చినావిడెవరో ఎంత గుర్తుకు తెచ్చుకుందామనుకున్నా, అంత దూరం పోతోంది జ్ఞాపకం! తన భర్తతరఫు వాళ్ళెవరేనా ఏమో? అనుకుని స్వాగతం పలికింది!

"ఇదేనటే మర్యాద? వచ్చి రాగానే, పలకరించి, కాళ్లకి నీళ్ళిచ్చి—కష్టం సుఖం అడుగుతారా? ఏవేఁ కొంతం? మరి మీ ఆయనేడీ? మరిదేడీ? పిల్లలేరీ?...తోడికోడ లేదీ? అవి చేమన్నా సరసురాలేనా? ...ఎంత సంపాయించుకున్న వాళ్ళయితే మాత్రం, చుటం పక్కం మర్యాదా మాన్యం వుండొద్దుటే?......ఏవిఁటో నా సోది నాదే గాని......ఎంత ఫేశన్లయితే మాత్రం?...కాస్త నిజాయితీ అదీ ఉండదటే? అంత గర్వాలయితే...ఏమోనమ్మా... అదిగాదు గాని......మీ ఆయనకేం ఉద్యోగం?"

ఏవిఁటీ అసందర్భమైన తగులాట. అనుకుంది కాంతారాణి. మళ్ళీ ఏమంటే ఏం దెప్పుతుందో అని, రత్తమ్మ ధోరణి వెగటనిపించినా, తేలిగ్గా నవ్వేస్తూ...

"ఏదో కుర్రవాళ్లం తెలీదండి బామ్మగారూ! ఏదీ పెద్ద ఆసరాలేక ఇలా తెలుగు మీరిపోయి ఉన్నాం...మమ్మల్నడిగే వాళ్ళూ లేరు! అంతా మాలో మేమే గౌరవించుకున్నా, హెచ్చరించుకున్నా...ఉండండి నీళ్ళు తెస్తాను."

"ఓసి నీయిల్లు బంగారంగానూ! ఊరికే అన్నానే! ఇంతకుముందే సందుమొగదల కుళాయిదగ్గర కడుక్కున్నాలేవే! ఐతే మీ ఆయనకేం వుద్యోగం?"

"ఏదో కంపెనీలో మేనేజరుగా పని చేస్తున్నారు! ఏం పని లెండి!"

"అబ్బో మేనేజరు గిరీ చేస్తున్నాడూ? వెర్రి వెంగళాయిలా ఉండేవాడు! బామ్మా బామ్మా అంటూ మొన్న మొన్నటిదాకా నా కొంగట్టుకునే తిరిగే వాడేవ్!"

రత్తమ్మగారి ధోరణి పాము మెలికలు తిరిగిపోతోన్నట్టు తిరిగిపోతోంది గాని, ఆగిన పాపాన పోలేదు. మొదటిసారి, వాళ్లుంటోన్న ఇల్లు పొగడ్డం మొదలుపెట్టింది. ఆ పొగడ్తలు అగడ్తలుదాటుతోంటే, కాంతారాణి మధ్యలో అడ్డుతగిలి, "అద్దె యిల్లండీ!" అంది.

"అయ్యో! అయ్యో! సొంతఇల్లనుకుంటే ఇందాకట్నుంచీ నోరు వాగుతోందే!"

కాంతారాణి బామ్మగార్ని లోపలికి తీసుకెళ్ళి, తోడికోడలు సుబ్బలక్ష్మికి చూపుతూ, "చూశావో? మనింటికి చుట్టాలొచ్చారు! ఈమధ్య ఎవరూ రావటంలేదని ఒహటే పలవరిస్తున్నావు" అంది.

తోడికోడలు ముహం గంభీరంగా పెట్టి, "ఏవూరిబామ్మ" అంది కాస్త నిర్లక్ష్యంగా.

రత్తమ్మ మెరుపు కొట్టినట్టు నిలుచుండిపోయి—తేరుకొని, "రాజారావు పెళ్ళాం ఇదేనేమిటే కొంతం దీనిపెళ్లికి నే రానేలేకపోయాను. అప్పుడాయనకెంత జబ్బో! క్షయ పీడించి, పీడించి వదిలిపెట్టింది. తీరా ఇవతలపెట్టాకా, మదనపల్లి తీసుకెళ్ళమన్నారు!...ఇంకేవుంది? ఆ ప్రాణజ్యోతి ఆరిపోయింది...ఒహటే యమయాతన పడ్డాడు మహారాజు...చచ్చిపోయేటప్పుడు కూడా, రాజారావు పెళ్ళికెళ్ళలేదనే బెంగతో పోయాడు" –

"అయ్యయ్యో! తాతగారూ మీరూ తప్పకండా రావాల్సింది, మీ రాజారావు మన వడిపెళ్లికి దంపతి తాంబూలాలు పోయాయి గామోలు పాపం!"

"ఆ రాజారావంటే, ఆ మహారాజుకెంతభిమానం! ఎంతభిమానం? ఇంకా కొంతం మొగుడంటేనే కాస్త ఇదిగాని, మీ ఆయనంటే పడి చచ్చిపోయేవాడు"

ఇక అక్కణ్ణుంచీ రత్తమ్మపడ్డ కష్టాలన్నీ ఏకరువు పెట్టబోయింది.

"వద్దులెండి!...ఏవే కొంతక్కా! బామ్మకిల్లంతా చూపించలేక పోయావా? దొడ్లో మల్లిపందిరీ...చిక్కుడుపాదులూ...బంతి మొక్కలూ...బాదంచెట్టూ..."

రత్తమ్మ పర్యవేక్షణలో అవన్నీ ప్యాసయ్యాయి. చిక్కుడుపాదుని తెగ మెచ్చుకొంటూ, "ఆకుకి నాలుగేసి కాయలు విరగ్గాశాయే నాతల్లీ! మాయింట్లో చెట్టంతా పురుగు నాకిపోయింది" – బాదం చెట్టు నిండా విరగబడుతోన్న పండూ, ముదరకాయల్నిచూసి, "ఒక్క నాలుగు తింటే పుడిసెడు నీళ్లు పుచ్చుకొంటే చాలే కడుపు నిండిపోతుంది.

మల్లిపందిరిని చూచి ఆనందించే సౌభాగ్యవల్లిక తెగిపోయినందుకు విచారించి, గతాన్ని నెమరేస్తూ, "ఆరోజుల్లో గుప్పెడు పువ్వులిలా తీసుకు తురుముకోవడమే కొప్పులో – ఇప్పుడా షోకులన్నీ వెళ్ళమారాయి" –

కాంతారాణి కళ్లు తిరుగుతున్నాయి రత్తమ్మ మాటలకి. పొద్దుటే కాస్త కాఫీ అన్నా తాగనిచ్చేట్టు లేదు. ఏవన్నా తన నోట్లోంచి మాట ఊడిపడేసరికి పూర్వ

52–వ పేజీ చూడండి)

సినిమా ప్రేక్షక సంఘం

ఇంటి దగ్గర పెద్దలు చెప్పిన చిల్లర పనులు పూర్తిచేసుకొని పార్కుకు చేరేటప్పటికి నాలుగున్నరైంది మా మిత్రులు అప్పటికే పార్కులో మామిడి చెట్టు నీడను చేరి బాతాఖానీ కొడుతున్నారు. వాళ్ళ మధ్యను కూర్చుని వేణు చేతులు త్రిప్పుతూ మహో ఉద్రేకంగా మాట్లాడుతున్నాడు. రాజు, మూర్తి శ్రద్ధగా వింటున్నారు. రామకృష్ణ, రెడ్డి, చెట్టుకి జార్లపడి కూర్చున్నారు.

నన్ను చూడగానే రామకృష్ణ "హలో బ్రదర్, ఇండియన్ పన్‌క్చు ఆలిటి అంటే నీదే! తెనాలి - గుంటూరు రైళ్ళలాగా యెన్నడూ టైముకి రావుకదా!" అన్నాడు.

'నీకేం! చెబుతావు. ఇంటిదగ్గర వాళ్లు నన్ను పూరికే కూర్చోనివ్వరు. యేదో ఒక పని చెబుతూ నేవుంటారు. కాకపోయినా యింతట్లోనే అంత మునిగిపోయే రాచకార్యాలేమీ లేవుగా!" అన్నాను.

"ఇన్నల్లు. లేకపోవట మేమిటి! ఈవాళ చాల ముఖ్యమైన విషయాన్ని గురించి ఆలోచిస్తున్నాం. ఇందాకటినుంచీ నీకోసమే యెదురుచూస్తున్నాం."

"యేమిటా ముఖ్యవిషయం?"

"ఈదేశంలో మనంకూడా వున్నాం! అని ఋజువు చేయదల్చుకున్నాం" అన్నాడు వేణు.

"మంచిదే! దానికెందుకూ ఋజువు? మనం ఈ దేశంలో లేమనటానికి ఋజువు కావాలిగాని!" అన్నాను.

"అదికాదు బ్రదర్! ప్రతివాళ్ళు యేవేవో సంఘాలనీ, పార్టీలనీ కంపెనీలనీ పెట్టుకొని తారాజువ్వల్లాగ పైకి లేచిపోతున్నారు. మనలాంటి బుదిమంతులు మాత్రం యిలా అడుగున పడిపోతున్నారు. ఔనంటావా కాదంటావా?"

"తప్పకుండా ఔననే అంటాను."

"మన సుబ్బారాయుణ్ణి చూడూ. నిన్న మొన్నటిదాకా మనతోటే చప్పగా కూలబడే వున్నాడా? ఇప్పుడమాంతం పంచాయితీ యెలక్షన్లలో నిలబడ్డాడు. ఇప్పుడు మనతో మాట్లాడమన్నా మాట్లాడడు."

"నువ్వు చెప్పింది అక్షరాలా నిజం. అయితే మనంకూడా ఒక పార్టీని యేర్పాటు చేసుకుందాం. దానికి ఆస్తే మూలధనం కాని, అనుభవం కాని అక్కర్లేదు" అన్నాను.

"నువ్వు చెప్పింది బాగానే వుందికానీ అటువంటి రాచకీయ పార్టీలకి యిప్పుడేమంత తొందరలేదు. అటువంటివి ఎన్నికల ముందు మాత్రమే అవసరం. దానికోసం యిప్పటినుంచీ తాపత్రయ పడటం యెందుకు? మే మనుకునేది అదికాదు." అన్నాడు రెడ్డి.

"అయినా రాచకీయాలు మనకంటె కొద్దిగా పెద్దవాళ్ళకి వదిలేద్దాం. అసలు సంగతి విను" అన్నాడు వేణు.

"ఇన్నల్లు. మనకంటె పెద్దవాళ్ళెవరు?" అన్నాడు రాజు.

"పెద్దవాళ్ళంటే బుద్ధిలో పెద్దవాళ్ళని కాదు. మనకంటె యెక్కువ తీరుబాటు వున్నవాళ్ళు—అనగా మన మాత్రంకూడా పనిలేని వాళ్ళని అర్థం" అన్నాడు వేణు.

"అయితే యేదేనా ఒక కంపెనీ పెట్టదల్చుకున్నారా?"

జె. పరబ్రహ్మం

"నో. నో. కంపెనీకి మూలధనం యెక్కడినుంచి వస్తుంది? మన చేతిలోపడ్డ డబ్బు హారతికర్పూరంలాగ కరిగిపోతుందని ప్రతివారికీ తెలుసు. అటువంటి తెలివి తక్కువ పని కాదు మేము చేయదల్చుకున్నది." అన్నాడు రామకృష్ణ.

"అయితే యేమి చేయదల్చుకున్నారు?"

"ఈ వూళ్ళో నూటికో డబ్భైమంది పైచిలుకు సినిమా ప్రేక్షకులుంటారు. అటువంటి వారి హక్కుల్ని కాపాడే నిమిత్తం సినిమా ప్రేక్షకసంఘాన్ని ఒకదాన్ని యేర్పాటుచేసి తద్వారా దేశసేవ చేయదల్చుకున్నాం." అన్నాడు వేణు.

"భేష్! మెఱుపులాగ వుంది యీ ఆలోచన. అయితే మన వూళ్ళో వున్న సినిమా ప్రేక్షకుల్నందర్నీ ఒకచోట చేర్చటం, ఒక సంఘాన్ని యేర్పాటు చేయటం ఎప్పుడూ యెల్లాగ?" అన్నాను.

"నువ్వు వట్టి వెఱ్ఱివాడివి. మనం ప్రేక్షకులం కాదా యేమిటి? యింకా యెవరు కావాలి? మనమందరం యిప్పుడు యిక్కడ వున్నాం. కాబట్టి యిప్పుడే యిక్కడే ఒక సంఘాన్ని యేర్పాటు చేసేసుకుందాం" అన్నాడు వేణు

"శుభస్య శీఘ్రం" అన్నారు మిగతా వాళ్ళు.

ప్రస్తుతం మేము ఆరుగురం వున్నాం. ఈ ఆర్గురితోనూ సంఘాన్ని ప్రారంభించవచ్చును సినిమా ప్రేక్షక సంఘం మా వూళ్ళో ఒక్కనిముషంలో యేర్పాటైపోయింది.

సంఘానికి ఒక అధ్యక్షుణ్ణి యెన్నుకోవాలి. మా ఆర్గురిలోంచి ఎవరిని అధ్యక్షుడిగా యెన్నుకోవాలో అంత తేలికగా తెలియలేదు. ఎవరికివారే అధ్యక్షుడు కావాలని ఆశపడుతున్నారు. కాని యెవరి పేరు వారే ప్రతిపాదించుకోవటానికి మొహమాటంగా వుంది రెండవవారెవరైనా ప్రతిపాదిస్తే వెంటనే అంగీకరించటానికి అందరమూ సిద్ధంగా వున్నాం. సమావేశంలో స్తబ్ధత యేర్పడింది.

మా అందరిలోకీ వేణు కొంచెము చుఱుకైనవాడని నా నమ్మకం. వాడికి విపరీతమైన ఓపికకూడా వుంది. మెట్రిక్యులేషన్ పరీక్షలకు యిప్పటికి డజనుసార్లు కూర్చున్నాడు. మాలో చాలమందికి మెట్రిక్యులేషన్ పరీక్షలకు కూర్చునే సాహసంకూడా లేకపోయింది. కాబట్టి చదువులోకూడా మా అందరికంటె అతనిదే పైచెయ్యి. అందుచేత నేను వేణుపేరు ప్రతిపాదించేను.

వెంటనే అభ్యంతరాలువచ్చేయి - వేణు మళ్లీ మెట్రిక్ కికట్టే ప్రయత్నంలో వున్నాడని అందుచేత అధ్యక్షభారాన్ని సక్రమంగా నిర్వహించలేకపోవచ్చుననీ.

వేణుమాత్రం మెట్రిక్ పరీక్ష అనేది ఆట్టే పెద్దవిషయంకాదని, అందువల్ల తాను అధ్యక్షుడుగా వుండటానికేమాత్రం అభ్యంతరం లేదన్నాడు. వచ్చిన అభ్యంతరాలన్నీ అణిగిపోయేయి. చివరకు ఈ ప్రతిపాదనను అందరూ అంగీకరించారు

గట్టిగా అభ్యంతరం చెప్పిన రాజుని ఉపాధ్యక్షుడిగా యెన్నుకున్నాం. కొంత తర్జనభర్జన అయిన తర్వాత రెడ్డిని కార్యదర్శిగాను, రామకృష్ణని కోశాధికారిగాను, నన్ను సహాయ కోశాధికారిగాను నియమించుకున్నాం (—లేదా యెన్నుకున్నాము.)



"భేష్ బాగానేవుంది. మిమ్మల్ని అభ్యంతరపెట్టే వాళ్లెరు ?
ప్రతిచిత్రం తప్పకుండా మీరు చూడవచ్చు. తలకు 0-1-0 మాత్రమే టిక్కెట్లు."

తర్వాత అధ్యక్షుడు వేణు ఒక చిన్న ఉపన్యాసం యిచ్చేడు. తనను అధ్యక్షుడిగా యెన్నుకున్నందుకు కృతజ్ఞత తెలియచేస్తూ, సినిమా ప్రేక్షకసంఘంవంటి మహత్తరమైన సంస్థయొక్క అధ్యక్షస్థానం బాధ్యతలతో కూడినదనీ, దానిని సక్రమంగా తాను నెరవేర్చాలంటే మా అందరి సహాయ సహకారాలు పూర్తిగా అవసరమని మనవిచేశాడు.

సినిమాల ప్రమాణం పడిపోకుండా చూడవలసిన బాధ్యత సినిమాప్రేక్షక సంఘాల మీద వుంది. అనగా మామీద వున్నదన్న మాట.

తర్వాత "...పురప్రముఖు లందరూ సమావేశమై సినిమా ప్రేక్షకసంఘాన్ని యేర్పాటు చేసుకున్నారనీ, 'దానికి ఫలాని ఫలానివారు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు వగైరాలుగా యేకగ్రీవంగా యెన్నికైనారనీ' ఒక ప్రకటన తయారుచేసి ప్రముఖ సినిమా పత్రికకి పంపటానికి కూడా నిశ్చయించుకున్నాం.

వేణు అందరికంటే ఉత్సాహంగా వున్నాడు. సినిమాల ప్రమాణం తగ్గకుండా వుండాలంటే యిటువంటి సంఘాలకు యెంతేనా అవసరం వుందన్నాడు. అఖిల భారత సినిమా ప్రేక్షకసంఘం, దానికి అనుబంధంగా ప్రాంతీయ ప్రేక్షకసంఘాలు ప్రాంతీయ ప్రేక్షకసంఘాల ఆజ్ఞాయిషీ క్రింద జిల్లా ప్రేక్షకసంఘాలు ఈవిధంగా యేర్పడటం తన చిరవాంఛ అనీ అటువంటి సంస్థలు దేశమంతటా యేర్పడేవరకు తను నిద్రాహారాలు కూడా మానేసి కృషి చేయగలనని వాగ్దానం చేసేడు.

"అయితే ఈ సంఘంవల్ల మనకి ప్రయోజన మేమిటి?" అన్నాను.

"ప్రత్యక్షంగా మనకేమీ లాభం లేకపోతే ఈ సంఘాన్ని రద్దుచేయవలసిందే"—తను అధ్యక్షుడు కాకపోయినందుకు లోపలలోపల కుళ్లుతున్న రాజు అన్నాడు తీక్షణంగా.

"మనం లాభంలేని పని యెప్పుడూ తలపెట్టం. మనమందరం డబ్బు తగలేసి సినిమాలు చూస్తున్నాం. సినిమాలు అధోగతికి పోకుండా జాగ్రత్త పడవలసిన బాధ్యత మనమీద వుంది. మనం తలుచుకుంటే అదేమంత కష్టమైనపని కాదు. నిర్మాతలు, దర్శకులు, నటులు

★ సినిమా ప్రేక్షక సంఘం ★

నటీమణులు అందరూ మనమూలంగానే బ్రతుకుతున్నారు. వాళ్ళ అదృష్టాలన్నీ మనచేతిలో వున్నాయి. ఈసంగతి వాళ్లు గ్రహిస్తున్నట్లు లేదు. ప్రేక్షకులమైన మన మందరం ఒకమాటమీద నిలబడ్డామా, ఏనాటికైనా యెటువంటి నిర్మాతైనా, ఎటువంటి నటుడైనా, యెటువంటి నటీ మణైనా మనదగ్గరకువచ్చి ఎదురుగుండా నిలబడవలసిందే. ఇంతకంటె మన కింకేం లాభం కావాలి?" అని ఒక సుదీర్ఘమైన ఉపన్యాసం యిచ్చేశాడు రెడ్డి.

"నిజమే" అనిపించింది మాకు. అతుణం లోనే ఎవరో అందమైన తారామణివచ్చి మాముందు నిలబడినట్టే సంతోషించేశాం.

వేణుకి మా అందరికంటే కొంచెం లోక జ్ఞానం హెచ్చు.

"ఏడ్చినట్టేవుంది మీలాభం" అన్నాడు.

"ఏమీ" అన్నాం గట్టిగా; దగ్గరకు వచ్చిన తార దూరమైపోయినట్టు బాధ పడుతూ.

"మీ ఆలోచనలకి ఎక్కడా తాడూ బొంగరం లేదు నేను చెప్పబోయే లాభం అదికాదు. మనం యింతవరకూ డబ్బు తగ లేసి సినిమాలు చూస్తున్నాం. ఇకముందు తగలేయకుండా చూడాలి. అంతేకాకుండా మనవూళ్లోవున్న సినిమాహాలుకి పూర్తిగా మరమ్మత్తు జరిగేటట్లు చూడాలి. రేపు నేనొకతమాషా చేస్తాను. సరిగా మధ్యాహ్నం రెండుగంటలకి హాలుదగ్గిరకి మీరందరూ రండి!" అన్నాడు. నమస్తేలతో ఆరోజు కార్యక్రమం పూర్తి అయింది.

*　　*　　*

మర్నాడు మధ్యాహ్నం సరిగా రెండు గంటలకు సినిమాహాలు కెదురుగా చింత చెట్టుక్రింధవున్న రాతిబండమీద సభ్యుల మందరం సమావేశమైనాం. వేణు చేసే తమాషా యేమిటో దానివల్ల మాకు కలిగే లాభమేమిటో తెలుసుకోవాలనే ఆతురత మా అందరిలోనూ వుంది. ఇంకొక అర గంటలో మ్యాటినీ ప్రారంభిస్తారు.

"ఏ ప్రేక్షకులవద్దనుంచి అయితే ఈ హాలు యజమానులు లక్షలకు లక్షలు సంపా దిస్తున్నారో, ఆ ప్రేక్షకుల ప్రతినిధులం మనం. కాబట్టి హాలు యజమాని మనకు ఉచితంగా హాల్లోకి ప్రవేశం యిచ్చి తీరాలి' అన్నాడు వేణు.

"తప్పకుండా యివ్వవలసిందే." అన్నాడు మూర్తి.

"ఆ విషయం ఖచ్చితం [illegible] తెల్సు కుందాం రండి హాలు ప్రొప్రైటరు దగ్గరకు పోదాం" అన్నాడు వేణు.

హాలుబయట గేటుకీపరు నిలబడి వున్నాడు.

"హాలు యజమాని యెక్కడ?" అన్నాడు వేణు.

"యెందుకు?"

"పనివుంది."

"యేంపని?"

"చాల ముఖ్యమైన పని. లోపలికి పోనీ యకపోతే మీ హాలుకి తీవ్రమైన నష్టం వచ్చేస్తుంది. జాగ్రత."

"యజమాని యింటిదగ్గర వుండవచ్చు. మేనేజరు మాత్రం వున్నాడు. ఆకింగుగదికి ప్రక్క గదిలో వుంటాడు. కావలిస్తే ఆయ నతో వెళ్ళి మాట్లాడండి" అన్నాడు గేటు కీపరు.

"ఈమాత్రం దానికి ప్రాణం పోయినట్టు మాట్లాడుతున్నాడు" అన్నాడు మూర్తి నెమ్మదిగా.

"మన మెవరమో వీడికింకా తెలియ లేదులే. మేనేజరుతో చెప్పేమంటే వీడి రోగం నిముషంలో కుదురుతుంది" అన్నాడు రామకృష్ణ యింకా నెమ్మదిగా.

సమాజమంతా కట్టకట్టుకొని మేనేజరు దగ్గరకు వెళ్లేం.

పెద్ద పెద్ద బుగ్గమీసాలు, గిరజాలజుట్టూ, కళ్ళద్దాలు పెట్టుకొని పెద్ద వస్తాదులాగ ఛాతీ విరుచుకొని కుర్చీమీద కూర్చొని వున్నాడు మేనేజరు. మమ్మల్ని చూసి—

"ఎవరు మీరు?" అన్నాడు.

"నేను సినిమా ప్రేక్షక సంఘానికి అధ్య క్షుణ్ణి" అన్నాడు వేణు.

"ఓహో! అల్లాగా?!......అటువంటి సంఘం ఈ వూళ్లో వున్నట్టు నే నింత వరకూ వినలేదే!"

"మీరు వినివుండకపోవచ్చును. కాని అటువంటి సంఘం ఒకటి వుంది. కాదంటే రాబోయే సినిమా పత్రికలో మీకు దాఖలా చూపించగలం."

"కావచ్చు. అయితే యేమంటావ్?"

"ఈ రోజుల్లో మంచి చిత్రాలు రాక పోవటంవల్ల హాలు యజమానులకు నష్టాలు వస్తున్నాయి అని విన్నాం..." అంటూ యేదో యేదో చెప్పబోయేడు వేణు.

"వట్టి అబద్ధం. మాకు లాభాలే వస్తు న్నాయి. యెవళ్లో కిట్టనివాళ్లు మీకామాట చెప్పివుంటారు." అన్నాడు మేనేజరు.

"అయినా వాళ్లే నష్టాలసంగతి వీడి కెందుకూ, యేవో ప్రగల్భాలు అడగక?" అనుకున్నాం మనసులో.

"నేను మీసంగతికాదు సార్ చెప్పు తుంట! సామాన్యంగా థియేటర్లకి నష్టాలు వస్తున్నాయని విన్నాం. కారణమేమంటే నిర్మాతలు మంచి చిత్రాలు తీయకుండా తుక్కుచిత్రాలు తీసి హాలుయజమానుల్ని మోసంచేస్తున్నారు. మంచి చిత్రాలు తయారుచేయటమే మానుకున్నారు సార్—బొత్తిగా!"

"ఆ సంగతేదో వాళ్ళే చూసుకుంటారు. వాళ్లు చిత్రాలు తీయటం నీకోసము, నా కోసమూ కాదు;—వాళ్ల లాభాలకోసం వాళ్ళ పేరుప్రతిష్ఠలకోసం. అందుచేత మంచి చిత్రాలు తీయాల్సిన అవసరాన్ని గూర్చి మనమేమీ వాళ్లకు చెప్పనక్కర్లేదు. వాళ్లకే తెలుసు."

"మీరు చెప్పేది అక్షరాలా నిజం. వాళ్లకు కావలసింది వాళ్లలాభం. అంతే కాని ప్రేక్షకుల క్షేమంకాదు. 'అందుచేత ప్రేక్షకుల మందరం సినిమాకళను ఉద్ధరించి చిత్రాలస్థాయి పెరిగేటట్లు చూడవలసివుంది. మంచి చిత్రాలతోపాటు మీకు కూడా లాభాలు పెరుగుతాయి. ఈ సదుద్దేశ్యం తోనే మేమొక సంఘాన్ని స్థాపించేము."

"మేనేజరు యేమీ మాట్లాడలేదు.

"మేము మాకు తోచినవిధంగా ఈ సినిమాకళకు సేవచేద్దా మనుకుంటున్నాం. కళాసేవ చేయటమంటే సామాన్యమైన విషయం కాదు. దానికి మీ సహకారం కూడా మాకు చాలా అవసరం!" అన్నాడు వేణు.

"నా సహకారమా! నాదగ్గర డబ్బు దస్కం యేమీ లేదు" అన్నాడు మీసాల మేనేజరు మొరటుగా.

"మాకు కావలసింది అది కాదు సార్. చిత్రాలు మంచివిగా వుంటే మీకు లాభాలు బాగా వస్తాయి. ఆ మాట నేను వేరే చెప్పక్కర్లేదు. చిత్రాలు బాగుండా లంటే మా బోటి సినిమా ప్రేక్షకసంఘ ప్రతినిధులు ప్రతి చిత్రాన్ని విధిగా చూసి, అందులో వుండే బాగోగులను తక్షణం నిర్మాతలకు, దర్శకులకు తెలియజేస్తూ వుండాలి. అటువంటి లోట్లు ఇంకముందు వారెప్పుడూ చేయకుండా చూడాలి. ప్రజ లందరికీ చిత్రాలలోని బాగోగులు నచ్చ చెప్పాలి" అన్నాడు వేణు.

"భేష్. బాగానే వుంది. తమరని అర్థ్యం తర పెట్టే వాళ్లెవరు? ప్రతి చిత్రం తప్ప కుండా మీరు చూడవచ్చు. తలకు పద్నా లుగు అణాలు మాత్రమే టిక్కట్టు" అన్నాడు మేనేజరు తాపీగా.

మాకు తల తిరిగినంత పనైంది. చాలా

అసాధ్యుడులాగవున్నాడు యీ మేనేజరు.

కాని వేణు మాత్రం తన వాదాన్ని సాఫీగా సాగిస్తూనే వున్నాడు. "మీరు చెప్పింది కూడా సబబే. అయితే మాది కొత్తగా యేర్పాటైన సంఘం. దానికి యింకా ఒక పునాది యేర్పాటు కాలేదు. ఫండ్సు చాలా తక్కువగా వున్నాయి. ఈ పరిస్థితులలో మా సంఘం ప్రతి సినిమాకు పధ్నాలుగు అణాలు ఖర్చుపెట్టే స్థితిలో లేదు. ఇటువంటి సమయంలో మీరు ఉదారంగా మా సంస్థకి ఫ్రీప్యాస్‌లు యిస్తే ఆర్థికంగా నిలబడగలదు. కళాసేవ చేసే భాగ్యం మాతోబాటు మీకు కూడా దక్కుతుంది."

"మీఅందరికీ ఫ్రీప్యాసులా? నేనేమన్నా వెఱ్ఱివాణ్ణి అనుకున్నారా యేం?" అన్నాడు మేనేజరు ఆశ్చర్యంగా.

"అందరికీ కాకపోయినా..." అంటూ యేమిటో చెప్పబోయేడు వేణు.

"అధ్యక్షుడనే పేరుతో అన్యాయంగా వీడొక్కడూ ఉచితప్రవేశం కొట్టేస్తాడేమోనని మా అందరిలోను అలజడిపుట్టింది. రాజు వెంటనే అందుకుని ఆ ప్రమాదాన్ని తప్పించేడు.

"ఆ - అందరికీ యివ్వవలసిందే. మేమందరంకూడా ఆ సంఘం తాలూకు కార్యనిర్వాహకవర్గసభ్యులం. "మాఅందరికీకూడా సమానమైనహక్కులు, అధికారాలు, బాధ్యతలు వున్నాయి" అన్నాడు.

"యేమీ లాభంలేదు; పొమ్మ"న్నాడు మీసాలాయన.

"అయితే సినిమాకళ అంతా నశించిపోవలసిందేనా!" అన్నాడు రెడ్డి.

"నశించిపోయినా యిష్టమే కాని మీకు మాత్రం ఫ్రీపాసులు యివ్వటం అసంభవం" అన్నాడు మేనేజరు.

"మేము యింతవరకూ చెప్పవలసిన విధంగా చెప్పేం. మాసంస్థకి ఫ్రీ ప్యాసులు యివ్వకపోతే దానివల్ల వచ్చే ఫలితాలకు మీరే బాధ్యులు కావలసి వుంటుంది" అన్నాడు రాజు.

"మీయిష్టం వచ్చినట్లు చేయండి. మీరు మాహాలుకి రాకపోయినంతమాత్రంలో మాకు పోయే దేమీలేదు" అన్నాడు మేనేజరు.

"మేమంటే యేమిటో అనుకుంటున్నారు. మేము ఈ వూళ్ళోవున్న ప్రేక్షకులందరిచేత ఏకగ్రీవంగా యెన్నుకోబడిన ప్రతినిధులం. వారందరికి మాలో పూర్తిగా నమ్మకం వుంది. అంటే మేమేది చెబితే అది వాళ్లు తప్పకుండా చేస్తారన్నమాట. మేము తలుచుకుంటే మీ హాలుకి ఒక్కణ్ణి కూడా రాకుండా చేయగలం." అన్నాడు రెడ్డి.

"ఇప్పటికేనా మించిపోయిందేమీ లేదు. మేము చెప్పింది కొంచెం సావధానంగా ఆలోచించుకోండి" అన్నాడు వేణు.

"ఏమీ ఆలోచించ నక్కర్లేదు. అడ్డమైన ప్రతివాడికీ ఫ్రీప్యాసులు యివ్వటమే మా పని అనుకున్నారా? పనీపాటూ లేని ప్రతి ఐదుగురూ కలసి ఒక్కొక్క సంఘం యేర్పాటుచేసి ఫ్రీపాసు లడగటం మొదలుపెడితే మా పనైనట్టే." అన్నాడు మేనేజరు.

"మీ కటువంటి సందేహం అక్కర్లేదు. మా సంఘానికి పోటీగా యింకోటి రావటానికి వీల్లేదు." అన్నాడు వేణు.

"తమరంతా యిక దయచేయవచ్చు" అన్నాడు మేనేజరు.

"మమ్మల్ని కాదని మీరీ హాలుని ఎల్లాగ నడపగలరో చూస్తాం" అన్నాడు రెడ్డి.

"అల్లాగా! యేం చేస్తారేం?" అన్నాడు మేనేజరు వికటంగా.

"ఏదేనా చేయగలం. వచ్చే సినిమా పత్రికలో మీ హాలుని పట్టుకొని యేకిపారేస్తాం" రాజు అన్నాడు.

"మీది వట్టి డబ్బాహాలని వ్రాస్తాం" అన్నాడు రెడ్డి.

"టిక్కట్లు చింపకుండా మళ్ళీ అమ్ముకుంటున్నారు అని ప్రకటిస్తాం" అన్నాడు మూర్తి.

"హాలు పడిపోయే పరిస్థితిలో వుందని పచారం చేస్తాం" అన్నాడు రామకృష్ణ.

"అసలు పడిపోయిందనే చెప్పేస్తాం" అన్నాను నేను.

"మేనేజరు ఆడవాళ్ళ గేటుదగ్గిర చేరి అఘాయిత్యాలు చేస్తున్నాడని మర్యాదగల స్త్రీలెవరూ రాకూడని ఈ వూరంతా ప్రచారం చేస్తాం" అన్నాడు వేణు.

"మీ హాలులో చీమలు దోమలు జాస్తిగా వున్నాయనీ, కుర్చీలనిండా నల్లులేవనీ పేపర్లలో వ్రాస్తాం."

"మీ హాలుకి అన్నీ తుక్కుచిత్రాలే వస్తాయి"

"మాటలు సరిగా వినపడవు"

"బొమ్మలు బొత్తిగా కనపడవు."

ఈవిధంగా అందరమూ తలో మాటా, టకటకా అనేశాం. మేనేజరు చీమకుట్టినంతైనా చలించలేదు. మా మాటలన్నీ నవ్వుతూ విన్నాడు; ఇదంతా వినోదం క్రింద జమకట్టినట్టున్నాడు.

"మీ రనవలసినవన్నీ అయిపోయాయా! ఇక అవతలకి నడవండి! లేకపోతే గెంటిస్తాను!" అన్నాడు మీసాలు దువ్వుతూ.

పరిస్థితి చేయిజారిపోయిందని తెలిసిపోయింది. హాలు మేనేజరు నయానికి భయానికి కూడా లొంగలేదు. వట్టి మూర్ఖుడు. వాడికి కళంటే యేమిటో ఏం తెలుసు!

"అయినా వీడితో మాట్లాడటమేమిటీ అసలు యజమాని వుండగా? తప్పంతా మనదే." అనుకుని మెల్లిగా బయటకు వచ్చేసేం.

"డామిట్! కథ అడ్డంగా తిరిగింది." అన్నాడు రెడ్డి.

"మన కథ యెప్పుడైనా సాఫీగా నడిచి ఏడిసిందా యేమిటి? మీరందరూ కలిసి తెగేవరకు లాగేరు" అన్నాడు వేణు.

"ఆమాత్రం మాకు తెలియకపోలేదు. జాగ్రత్తగా వీరవాడి అధ్యక్షుడనే పేరుతో నువ్వొక్కడివీ ఫ్రీపాసు కొట్టేద్దామనుకున్నావు!" అన్నాడు రాజు.

"అయిందేదో ఐపోయింది. ఇక ముందు సంగతేమిటి?" అన్నాను

"వేణునే అడగండి. 'ఏదో గమ్మత్తు చేస్తాను. రేపు సరిగా రెండు గంటలికి రమ్మ'న్నాడు. గొంఢిలో తల దూర్చుకుంటూ వచ్చేం" అన్నాడు రె[illegible]

"శుభ్రంగా ఇంటికి వెళ్ళండి" అన్నాడు వేణు.

"మేనేజరుగాడి గత అయిపోయిన చివాట్లు వేయించేవు ఇందుకేనా యేమిటి మమ్మల్ని రమ్మంట?" అన్నాడు రాజు.

"మీ అభిప్రాయం అల్లాగ వుం[illegible] నేనేమి చేయను?" అన్నాడు వేణు.

"ఇటువంటి వట్టి పనులేవో చే[illegible]టావు. నువ్వు అధ్యక్షుడుగా పనికిరావని నేను మొదట్లో నే చెప్పేను" అన్నాడు రా[illegible]

"పోనీ, నిన్ను అధ్యక్షుడిగా యెన్నుకున్నాం కదా - కనీసం కాఫీయేనా పోయిస్తావా? ఈ యెండలో గంపెడాశ పెట్టుకుని వచ్చేం" అన్నాడు రామకృష్ణ.


"నన్ను ఇప్పుడు ఈడ్చి తన్నినా దమ్మిడీ రాలదు. కావాలంటే తక్షణం అధ్యక్షపదవికి రాజీనామా యిస్తాను. కాని కాఫీ మాత్రం పోయించలేను" అన్నాడు వేణు

"అంతేనా. అఖిల భారత ప్రేక్షక సంఘాలనీ, ప్రాణాలు తెగించైనా సరే కళాసేవ చేయాలనీ యేవేవో పెద్ద కబుర్లు చెప్పేవు?" అన్నాడు మూర్తి.

"అల్లాగైతే నేనో చక్కటి ఉపాయం చెబుతాను వినూ. నిన్న సమావేశమైన సంఘం యావత్తూ ఇక్కడే వుంది. మనం యిప్పుడే యిక్కడే కాఫీహోటలు కొంతదారుల సంఘం ఒకటి యేర్పాటుచేద్దాం. కేఫ్‌కి వెళ్ళి కాఫీ ఉచితంగా ఈ సంఘానికి పోస్తాడేమో కనుక్కుందాం. పదండి" అన్నాను.

అందరూ నవ్వేరు. ఆరోజుతో మా సంఘానికి ఆయుర్దాయం తీరింది. ★

తుంగభద్రా ప్రాజెక్టు



ఏ.సి.సి. సిమెంటు

2,20,000

టన్నులకు పైగా

వినియోగింపబడినది.

తుంగభద్రా ప్రాజెక్టు ఆంధ్రరాష్ట్రములో 1,00,000 కిలోవాట్టుల విద్యుచ్ఛక్తిని, 8,00,000 ఎకరముల భూమిని తడుపుటకు నీటిని సరఫరాచేయును.

కాంక్రీటు ఆనకట్టలు మనదేశములోగల బంజరుభూములను ఆహారసమృద్ధితో అభివృద్ధి చెందు ప్రదేశములుగా మార్చుటకు తోడ్పడును.

ఏసిసి

సేల్సు మేనేజర్సు

ది సిమెంట్ మార్కెటింగ్ కంపెనీ ఆఫ్ ఇండియా. లి.

ప్రాసక్రీడలు

కుటుంబరావు ఆ ఊరుకు కొత్త. ఆ ఊరు కుటుంబరావుకు కొత్త. మొట్టమొదటిసారి ఉద్యోగ జీవితంలోకి అడుగు పెడుతూనే ఈ ఊరు రావల్సి వచ్చింది. రెండురోజుల క్రితమే ఈ ఇంట్లోకి కాపరం దిగారు. కుటుంబరావు వచ్చిన రోజు రాత్రి పంకజంతో అన్నాడు. "నాకూ ఉద్యోగం చెయ్యటం కొత్త అనుభవమే. మొదట్లో కొంతకాలం వరకూ అనుభవం ఉన్న పక్క గుమాస్తా మాట సహాయం నాకెల్లా అవసరం ఉంటుందో గృహకృత్యాల్లో - పెదది - ఇంటావిడ సలహా అడిగి తెలుసుకోవటం నీకూ అవసరమే" అని.

"ఏదో నాకు చేతనయినట్టుగా నిర్వహిస్తాను నా బాధ్యతల్ని" అంది పంకజం.

"ముందు పనిమనిషిని కుదిర్చి పెట్టమని అడుగు" అని కూడా అన్నాడు కుటుంబరావు. 'అలాగే' అంది పంకజం.

*　　　*　　　*

"మీ ఎరికన మంచి పనిమనిషి ఎవరైనా ఉంటే కుదిర్చి పెట్టండి పిన్నిగారూ!" అంది పంకజం ఇంటావిడ కాంతమ్మగారితో.

ఎవరుంటారమ్మాయి ఇక్కడ! పోనీ మా పనిమనిషి ఉందిగా?" అంది కాంతమ్మ.

"ముసల్ది ఇన్నిళ్ళల్లో చాకిరీ చెయ్యటం కష్టం. ఏవేళ పన్లు ఆవేళకి అవుతేగాని నాకూ తెరిపిగా ఉండదు. ఇప్పటికే రెండు మూడిళ్ళల్లో పనిచేస్తోంది. ఎంగుకొచ్చింది లెండి దానికీ కష్టం, మనకీ సుఖం ఉండదు" అంది పంకజం.

"నువ్వు చెప్పింది నిజం కాదనను కాని ఏమాట కామాటే చెప్పాలి. మా దేళ్ళ నుంచి పనిచేస్తోందా ఏనాడూ ఇబ్బంది అన్నమాట ఎరగం. బుద్ధి ఎంత మంచిదను కున్నారు?" అంటూ కాంతమ్మ పనిమనిషి రత్నాలు, నమ్మకం, నిజాయితీ బుజువు చేసే ఘట్టాలెన్నో పంకజానికి వినిపించింది.

"అలాగా!" అంది పంకజం ఆశ్చర్యంగా. "అయితే అడిగి చూడండి. దాన్నే కుదుర్చుకుంటాను. మీరింతగా చెబుతుంటే కాదని మరొకర్ని పెట్టుకుంటే అదెలాటిదౌతుందో?"

అలాగే రేపు కనుక్కుంటాను అంది కాంతమ్మ.

*　　　*　　　*

ఉదయం లేస్తూనే తలుపు తెరిచేసరికి పనిమనిషి రత్నాలు నవ్వుముఖంతో ఎదురుపడింది పంకజానికి.

"పనిమనిషి కావాలన్నారు కదమ్మా" అంది రత్నాలు.

"ఎవరు చెప్పారే?"

"అమ్మగోరు చెప్పారు"

"నువ్వు సరిగ్గా చేస్తావో లేదో అని ఆలోచిస్తున్నానే!"

"అదేం దమ్మోయి నాకేటి? నాలుగు రోజులు నాపని చూసి మరీ కుదుర్చుకోండి" అంది రత్నాలు.

"ఎన్నిళ్ళల్లో పనిచేస్తున్నావు?" అని ప్రశ్నించింది పంకజం. తన ఉద్దేశం రెండు మూడు ఇళ్ళల్లో మాత్రం పనిచేసే మనిషయితే దాని పనది తెరిపిగా చేసుకుంటుందని.

పురాణం సూర్యప్రకాశరావు

"లిల్ల లక్ష్మమ్మ గారిలూ, మన అమ్మగారిల్లూ మరెక్కడా చెయ్యటం లేదమ్మా"

"సరే! అయితే మా యింట్లో నువ్వు చెయ్యాల్సిన పనల్లా పాచిఊడవటం అంట్లు తోమటం, అవసరమైతే చిల్లరమల్లర పనులు కూడా చెయ్యాలి" అంది పంకజం. చివరికి "ఎంత పుచ్చుకుంటావు చెప్పు" అని అడిగింది.

"మీకు తెలియందేముందిలెండి" అంది రత్నాలు చేతులు నలుపుతూను.

"అదేవన్నమాటే కష్టపడేదానివి నువ్వా నేనా. రూపా యిస్తానంటా ననుకో నువ్వు చేస్తావూ?"

"మీరలా కష్టం తెలుసుకోని మనుషులు కారని నాకు తెలుసునమ్మో! పరాచికాలాడుతున్నారు అమ్మగారు" అంటూ నవ్వేసింది రత్నాలు.

"అది సరేగాని కచ్చితంగా ఎం తిమ్మంటావు చెప్పు. నా కవతల పనుంది"

"నాలుగు రూపాయి లివ్వండి చాలు" అంది రత్నాలు.

"సరే రేపట్నించి రా" అంది పంకజం.

రత్నాలు ముఖం తృప్తితో విప్పారింది. "గుండెగల మహాతల్లి" అనుకుంది మనసులో. సాధారణంగా పనిమనిషిని కుదుర్చుకోవటం ఇంత సులభంగా, సవ్యంగా జరిగే పనిగాదు. 'అలాగేనమ్మా' అంటూ రత్నాలు వెళిపోయింది.

ఆ సాయంత్రం ఆ మాటా ఈ మాటా చెబుతూ "రత్నాలు రేపట్నించి వచ్చి పనిచేస్తుంది. మనిషి మంచిదిలాగానేవుంది" అంది పంకజం కాంతమ్మతో.

"ఎం తిస్తున్నారు?" అని అడిగింది కాంతమ్మ.

"నాలుగిమ్మంది. సరేనన్నాను."

"ఆఁ!" ఆశ్చర్యంగా నోరు ఆవులించేసింది కాంతమ్మ. "ఇద్దరు మనుషులు కాఫీలు కూడా తాగరు కదా ఏమంత పనుంటుందమ్మాయి? ఏవిటో అనుకున్నాను! నిన్ను బుట్టలో వేసింది" అంది దవడలు నొక్కుకుంటూను.

"కాదూ కూడదూ అంటే మూడున్నరకు చేస్తుందనుకోండి. అర్థ రూపాయిలో పోయేదేముందిలెండి పిన్నిగారూ! ముసల్ది పాపం!" అంది పంకజం

"ఏమోలే నేనంత భారీగా ఇవ్వలేను సుమా!" అంది కాంతమ్మ.

పంకజానికి కష్టంవేసిన మాట నిజం. "దాని కేముందిలెండి. మీకు సబబని తోచింది మీ రిస్తున్నారు. దానికి నష్టమైతే అది మాత్రం ఒప్పుకుంటుందా?" అంది పైకి.

"నేను మూడు రూపాయి లిస్తున్నాను."

ఎటొచ్చి రూపాయేగా తేడా! నెల నెలా ఓ రూపాయి దానం చేసుకుంటున్నాననుకుని తృప్తి పడతాను." అంది పంకజం.

కాంతమ్మగారు మౌనం వహించారు. ఈ ముభావాన్ని బట్టి ఆమె ఆంతర్యాన్ని గ్రహించిన పంకజం "వస్తానండి పిన్నిగారూ!" అంటూ లోపలికి వచ్చేసింది. "ఎంత నిర్లక్ష్యం!" అనుకుంది కాంతమ్మ. ఆవిడ చాలాసేపటివరకూ ఆ విషయమే ఆలోచిస్తూ ఉండిపోయింది.

నిన్న ఆనోటితోనే గా పనిమనిషి గురించి ఆకాశాని కెత్తేసింది. ఇంతలో ఎలా తేలిపోయిందో!" అనుకుంది పంకజం.

ఆరాత్రి జరిగిన సంగతంతా భర్త చెవిన వేసింది పంకజం. "అప్పుడే విభేదాలు

★ ప్రాసక్రీడలు ★

దృష్టిదోషంవున్న ఒక పెద్ద మనిషి పోలాలగట్టు మీదగా పడిపోతున్నాడు. ఇంతలో పెద్ద గాలి వీచింది. ఆ గాలికి ఆయన తలమీదనున్న టోపీ ఎగిరిపోయింది. పారిపోతున్న టోపీని పట్టుకోవటానికిగాను యీయన కూడా పరిగెత్తటం ప్రారంభించాడు.

చాలాదూరం పరిగెత్తాడు. అంతలో ఒకామె యీయన వెంటబడి కేకలూ అవీ వేసి ఎట్లాగయితేనేం, యీయన్ని ఆపేసింది. దగ్గిర కొచ్చాక "ఎందుకయ్యా పరిగెత్తుతున్నావ్?" అని అడిగింది.

"గాలికి నా టోపీ ఎగిరిపోతేనూ, పట్టుకొందామనీ..."

"ఏడిసినట్లే వుంది. నువ్వు పట్టుకోబోయేది మా యింటి కోడిపుంజు నీ టోపీ కాదయ్యా!" అంది ఆ ఇల్లాలు.

మొదలయా యన్నమాట!" అన్నాడు కుటుంబరావు.

"ఇందులో విభేదాల కేముందండీ?"

"అదేవిటో ఇప్పుడు చెప్పినా నీకు బోధపడదు. అనుభవంలోగాని అర్థం కాదు" అన్నాడు కుటుంబరావు. "అనవసరంగా తగాదాలూ తంపులూ రాకుండా చూసుకో" అని కూడా హెచ్చరించాడు పంకజాన్ని. పంకజం అయోమయంగా అతని ముఖంలోకి చూసింది.

మొర్నాడు రత్నాలు పనిలో చేరింది. రత్నాలు పనికి తను తృప్తిపడిందనటానికి నిదర్శనంగా "సాయంత్రం ఇంటికి వెళ్ళేటప్పుడు అన్నముంది పట్టుకెళ్లవే" అంది పంకజం.

ఆ సాయంత్రం ఇద్దరు మనుషులకి సరిపోయే అన్నం విస్తరాకులో పెట్టుకుని రత్నాలు తీసుకువెళ్లటం కాంతమ్మ పనిగట్టింది. కాంతమ్మ ముక్కుపుటాలు ఎగరేస్తూ నసుగుతూ లోపలికి వెళ్ళిపోయింది. ఆరోజు కూడా పంకజాన్ని పలకరించలేదు కాంతమ్మ.

పంకజానికి ఆ ధ్యాసే లేదు.

*   *   *

మొర్నాడు భోజనాలదగ్గిర "వంకాయకూర బొత్తిగా రుచిలేదు. ఇందులో ఏవి తక్కువైందో కూడా చెప్పటం కష్టంగా ఉంది" అన్నాడు కుటుంబరావు చిరాగ్గా.

"ఎంత బాగా చెయ్యాలనుకున్నా అంతకంటే కుదరటంలేదు" అంది పంకజం.

"చేతయినవాళ్ళ సలహా తీసుకోవటం చేతకానివాళ్లు చెయ్యాల్సిన పని. ఇంటావిడ్ని అడుగుతూండమని చెప్పటంలా?"

"ఆవిడ నాతో మాట్లాడటం మానేసింది" అంది పంకజం మెల్లగా.

"ఏం?"

"అదే నాకూ బోధపట్టంలేదు."

"నేను మొదటే చెప్పాను. నలుగురిమధ్య కాని మసులుకోలేనంటూ ఇంత పొడుగు ఉత్తరం రాశావు. లేకుంటే విడిగా వుండే మరోభాగం చూసేవాడ్ని." అన్నాడు కుటుంబరావు తప్పంతా పంకజంమీద నెట్టేస్తూను.

"ఏమో! ఒక్కతినీ బిక్కుబిక్కుమంటూ ఉండటం అలవాటు లేదేమో తోడుగా పలకరించే వాళ్ళుంటే కాలక్షేపంగా ఉంటుందికదా అని ఉద్దేశపడ్డాను." అంది పంకజం తన్ను సమర్థించుకుంటూను.

"ఇప్పుడు భరించలేనంత సందడిగా ఉంటుందిలే" అంటూ వ్యంగ్యంగా నవ్వుతూ చెయ్యి కడుక్కున్నాడు కుటుంబరావు.

నిష్కారణంగా కాంతమ్మ తన విషయంలో మాటా మంతీ లేకుండా ముభావంగా, కోపంగా ఉండటానికి తగిన కారణం పంకజం ఊహించలేకపోయింది. బహుశః ఆమె స్వభావమే అంతకాబోలు అనుకుని సర్దుకోబోయింది పంకజం. అయితే ఆ సాయంత్రం జరిగిన మరో సంఘటనతో ఈ ప్రవర్తనని కేవలం ఆమె స్వభావంగా తీసిపారెయ్యటానికి వీల్లేదని తేలిపోయింది. ఆమెకు తనమీద ఏ కారణంవల్లనో ఆగ్రహం వచ్చిందని స్పష్టపడింది

"ఉన్నవాళ్ళిద్దరన్న మాటేగాని తీరూ తావీ లేని మనుషులు" కాంతమ్మ ఈ మాటలు పొరుగింటి ఆవిడితో అనటం పంకజం స్పష్టంగా విన్నది. "ఏమోలే ఎవరి గురించో" అనుకుంది మొదట్లో.

అయితే కాంతమ్మ చెప్పదల్చుకున్నది అంతటితో వదలిపెట్టదల్చుకోలేదు. "చిన్నవాళ్ళుగదా తెలియదేమో అని చెప్పబోతే లక్ష్యపెడితేనా? ఎంత భారీతనం! ఎంత ఘరానాగా మాట్లాడిందనుకున్నారు."

బహుశః ఆవలి వ్యక్తి ఈవిడ చెప్పే మాటలు శ్రద్ధగా వింటూఉండాలి. పంకజానికి అనుమానం వేసింది. చేసే పనివదిలిపెట్టి పెరటి గుమ్మంవార నిలబడింది పంకజం. అక్కడికి వాళ్లు మాట్లాడుకున్నవన్నీ స్పష్టంగా వినబడతాయి.

ఆ తర్వాత కాంతమ్మ ఏవేవిటో చెప్పింది. కడుపులో మండిపోయింది పంకజానికి. నాలుగూ ముఖం వాచేట్లు చివాట్లు పెడదామన్నంత ఉద్రేకం పుట్టినా ముందు వెనుక ఆలోచించి తమాయించుకుంది పంకజం. ఆరాత్రి భర్తకి సంఘటన చెప్పేవరకూ మనసు మనసులోలేదు. అంతా చెప్పింతర్వాత "చూశారుటండీ ఆవిడ మాటలు" అంది రోషంగా.

"పోనిద్దూ! ఆవిడతో మనకేవిటి" అన్నాడు కుటుంబరావు. ఇవి చూట్టానికి చిలిపికయ్యాల్లాగుంటాయి గాని ప్రాణాలు తోడేస్తాయి. రెండు తెగల్లో ఏ ఒక్కరైనా సర్దుకునేవాళ్ళు లేకపోతే ఈ తగాదాలు ఎంతవరకూ పోతాయో కూడా కుటుంబరావుకు తెలుసు. "నువ్వుమాత్రం నోరు జారలేదుగా" అన్నాడు.

"చాలుగూ దులిపేదాన్నే. దానిరోజులు బాగుండిపోయాయి." అంది పంకజం ఉద్రేకంగా. కుటుంబరావేమీ మాట్లాడలేదు.

నా ఊసు తనకెందుకంట? వాళ్ళదగ్గరా వీళ్ళదగ్గరా నానా అవాకులూ చవాకులూ వాగుతే నేనెంత లోకువైపోతాను.

ఈ ధోరణిచూస్తే కుటుంబరావుకు నవ్వొచ్చింది. "స్వయం కృతాపరాధం" "పోయి భోజనంచేసి పడుకో తెల్లవారింతర్వాత ఆలోచిద్దుగాని" అన్నాడు.

*   *   *

అప్పుడప్పుడు అత్యవసరం ఒస్తేగాని పంకజం తనకి పన్లు పురమాయించదని రత్నాలుకి తెలుసు. అథవా ఒకటిరెండు సార్లు వెళ్ళాల్సివచ్చినా అణా బేడా చేతులో పెడుతూండేది.

"నీ కెంతమందే సంతానం?" అని అడిగింది పంకజం.

"ఒక ఆడబిడ్డ ఒక మగబిడ్డ ఉండేవారు తల్లీ" అంది రత్నాలు విచారంగా.

"ఇప్పుడెక్కడున్నారు వాళ్ళు?" అడిగింది పంకజం.

"యమలోకంలో తల్లీ యమలోకంలో"

ఇక అవిషయం గురించి అట్టే పరామర్శించటం మంచిదికాదన్నట్టుగా "నీ మనవలిద్దరూ రాలేదేవే?" అని ప్రసంగ విషయం మార్చింది పంకజం.

ఎందుకు వెధవలు అల్లరిచేస్తారు. ఇంటికాడే ఒగ్గేశాను."

ఉన్నట్టుండి తమాషా ప్రశ్న వేసింది పంకజం "నీ కెన్నేళ్ళే?" అని. ఇటువంటి ప్రశ్నలు పదహారేళ్ళ పంకజం కాబట్టి అడిగింది కాని మరెవ్వరికీ దాని వయసుతో ప్రమేయం ఉండదు. సాధారణంగా ఆ వయసు పిల్లలకే ఇలాటి ప్రశ్నలు వెయ్యాలని బుద్ధిపుట్టేది.

రత్నాలు "నాకు తెలియదు" అంది బుర్ర ఊపుతూను.

పంకజం ఆశ్చర్యంగా "నీ వయస్సు నీకే తెలియకపోవడ మేమిటే?" అంది.

ఎన్నేళ్లయితే ఏముందిలెండి? నా శక్తిని బట్టి నాకు తెలుస్తుందిగా తల్లీ మరింక మూడు నాలుగేళ్ళకన్న ఎక్కువ బ్రతకను" అంది రత్నాలు.

"ఏడిశావులే! పొద్దున్నే అవేం మాటలు? పాడుమాటలు!" అని కోప్పడింది పంకజం. క్షణం ఆగి ఏదో అడగాలనుకుందిగాని మళ్లీ తన కెందుకన్నట్టుగా ఊరుకుంది. అయినా ఉండబట్టలేక గది ఊడుస్తున్న రత్నాలుతో "కాంతమ్మగారంటుంది కదా నువ్విప్పుడు పూర్తిగా మారిపోయావుట! మునపటి మనిషివేకావుట! ఏం చెప్పినా చెయ్యటం మానేశావట?" అంది పంకజం ధైర్యంచేసి.

"మీతో చెప్పిందామ్మా?" అని అడిగింది రత్నాలు.

"లేదు పక్కింటి ఆవిడతో చెబుతుంటే విన్నాను."

మనిషి కనుపిస్తే ఆమెకి ఎక్కడలేని అవసరాలూ ఒస్తాయి! తిరగలేక కాళ్లు బలపాలు కడుతున్నా యమ్మగారూ? ముసలి ముండను ఏం చెయ్యగల్ను చెప్పండి. ఒప్పుకున్న పనిలో లోపం ఉంటే లచ్చ తిట్టండి తలొగ్గుతాను" అంది రత్నాలు.

రత్నాలు వాదం సబబుగానే తోచింది పంకజానికి. "నువ్వన్నమాట సబబుగానే ఉందే" అంది.

ఆసాయంత్రం నిన్నటివేళకే కాంతమ్మ పెరటిగోడదగ్గరకు వెళ్ళి పిన్నిగారూ అని పిలవటం పంకజం విన్నది. చేస్తూచేస్తూన్న పనల్లా ఆపేసి తలుపువారకు వెళ్ళి నిలబడింది.

"ఎవర్ని ఎంతలో ఉంచాలో అంతలో ఉంచాలి. పనిమనిషిని నెత్తి కెక్కించుకుంటే రేపు నీమాట అది లక్ష్య పెడుతుందా? అబ్బే నా మాటంటేనూ నేనంటే వీసమెత్తు గౌరవం ఉంటేనా? మునుపటి రత్నాలు కాదు. దాని కీమధ్య ఎదురు జావాబు చెప్పటంకూడా నేర్చుకుంది"

పంకజానికి ఈ మాటలు వింటుంటే అరికాలిమంట నెత్తి కెక్కింది.

"దాని అంతస్తేం? మన అంతస్తేం? దానితోనా మనకు కాలక్షేపం?" అంది కాంతమ్మ.

"అవునుమరి లోకువైపోం" అంది అవతల వ్యక్తి.

"అలా అని మనం చెప్పగలంటండీ! వినే సంస్కారం ఉండొద్దూ. పల్లెటూరు మోటుతనాలు ఎక్కడికి పోతాయి. చాదస్తపు మొగుడు చెపితే వినడు గిల్లుతే ఏడుస్తాడు."

పంకజం ఓర్పు గాలిపడగలా ఒక్కసారి తెగి ఊరుకుంది. "ఏవిటీ అన్నారూ? మేమంతా మోటువాళ్ళమూను మీరు మహా సున్నితమైనవాళ్ళా అన్నమాట! నిన్నట్నుంచి వింటున్నా. ఎందు కెందుకని ఊరుకుంటుంటే మరీ బరితెగించి మాట్లాడుతున్నారే" అంది పంకజం విరుచుకు పడుతూను.

"మాటలు తిన్నగా రానీ అమ్మాయి. నేను మంచిదాన్ని గాను. నిన్ను గురించెవరన్నారు?" అంటూ బుకాయించబోయింది కాంతమ్మ.

"నన్ను బుకాయించకండీ. నే వినలేదనుకున్నారా? నా ఊసు మీ కెందుకంటే?" - పంకజం ఇంతవరకూ కాంతమ్మనుద్దేశించి మాట్లాడుతున్నదల్లా "ఆవిడకీ జ్ఞానం లేకపోతే మీకన్నా ఉండొద్దుటండీ? పనిచేసిందానితో మాట్లాడినంత మాత్రాన లోకువైపోతాం? ఓనాడు మా తాతలూ మా తాతలూ పేడ పిసుక్కున్న వాళ్లే. ఈనాడు అంతస్థులు పెరిగిపోయాయి గాని..." అంది పంకజం.

ఎప్పుడైతే రంగంలోకి అసలు వ్యక్తి

ఇటీవల ఒక ఊళ్ళో ఒక గొప్ప బహిరంగసభ జరిగింది. ఆ సభలో ఒక సుప్రసిద్ధ కవి పండితుడు ప్రసంగించాడు. ఆయన ప్రసంగం చాలాబాగుందంటే బాగుందన్నారు శ్రోతలు. సభానంతరం ఆ కవి పండితుడు ఒక మిత్రుని ఇంట్లో విశ్రమించాడు. కవి పండితుడు నిద్ర లేవగానే ఆ మిత్రుని సంతానంలోకల్లా చిన్నదైన సరళ అన్నదిగదా "శాస్త్రి గారూ మీరు చాలా చక్కగా మాట్లాడారండీ."

నిజంగా పసిపిల్లలను కూడా ఆనందింపచేయగలిగినందుకు ఆ కవిపండితుడు తనలో తాను ఉప్పొంగిపోయినాడు. మంచం మీద కూచున్నవాడల్లా ఆ ఆరేండ్ల సరళదగ్గరకు వెళ్ళి "నిజంగానా తల్లీ...నా ఉపన్యాసం నీకు బాగున్నదా" అన్నాడు.

"చాలా బాగున్నది. కానీండి మీరు ఇంకా కొంచెం బిగ్గరగా మాట్లాడాలి. మీరు ఏమి చెప్పిందీ మాకు వినబడలా" అన్నది సరళ.

కవి పండితుడు చిత్తయినాడు.



ఎండవేళ చిన్నకునుకు
ఫొటో : దశిక రామలింగేశ్వరరావు-మద్రాసు.

★ ప్రాసక్రీడలు ★

దూకిందో మెలగా తను జారుకుందాం అనుకుంటున్న పొరుగింటావిడ ఈ మాటల్తో అభిమానం అడ్డుపడగా గుటకలు మింగుతూ "ఏమిటీ? నా తాత పేడ పిసుక్కున్నాడూ? నువ్వు చూశావన్నమాట. నోటికి సుద్దీ బద్ధం లేకుండా మాట్లాడుతున్నావేం?" అంది పంకజాన్ని కొరకొరా చూస్తూను.

"ఎవరు మీరా నేనా సుద్ధబద్ధం లేకుండా మాట్లాడుతున్నది." అని రెట్టించింది పంకజం.

"మేం ఉన్నమాట అనుకున్నాం. పని మనిషిని, అలా నెత్తి కెక్కిచ్చుకుంటే రేపు దానికి లోకువైపోం? నిన్నమటుకు నిన్న బజారు కెళ్ళి అరటిపళ్లు తీసుకురావే అంటే వెళ్ళను గాక వెళ్ళనంది. ఎందుకు వెళ్ళుతుంది? తేపా అణాలూ బేడలూ మప్పుతుంటేను. నువ్వు చేయించుకునే పనెంత? నువ్విచ్చేజీతం ఎంత? నాలుగురూపాయిలిస్తావూ? పూటా ఇంతింత అన్నం పడేస్తావూ? మేమంటే గౌరవం ఉండమంటే ఎందుకుంటుంది ఇదివరకెప్పుడైనా ఇలా సమాధానం చెప్పిందా మరి" మనసులో ఉన్న అక్కసంతా తీర్చుకుంది కాంతమ్మ.

పొరుగింటావిడ ఎప్పుడు జారుకుందో పంకజం గమనించలేదు గోడవతల్నించి గొణుగుడు మాత్రం వినిపిస్తోంది. "నాయిష్టం నే ఇస్తాను నీ కెందుకంట నా ఊసు." అంది పంకజం సాభినయంగా.

మాటకి మాట తెగులు! నువ్వు ముండవంటే నువ్వు రండవ నేవరకూ పరిస్థితులు విషమించేసరికి ఇరుగు పొరుగు వాళ్ళు జోక్యం కల్పించుకోక తప్పలేదు పక్కింటి డాబామీంచి ఇంతసేపునుంచి గమనిస్తున్న తాసిల్దారుగారు ఫక్కున నవ్వేసరికి యదాలాపంగా అటు చూసిన పంకజం చచ్చేటంత అభిమానపడింది. చెదిరిపోయిన జుట్టును మీదికి నెట్టుకుంటూ చరాచరా ఇంట్లోకి వెళ్ళి తలుపు మూసేసుకుంది పంకజం. పెరట్లో ఇంకా ఇద్దరు ముగ్గురు కాంతమ్మతో మాట్లాడుతూనే ఉన్నారు.

"కాదు మరీ! దేనికైనా హద్దూ పద్దూ లేకపోతే దానివల్ల ఎంతిమందికి నష్టం"— ఇది కాంతమ్మ గొంతు కాదు అక్కడ మూగినవాళ్ళల్లో ఎవరిదో అయుంటుంది. "లోకానికికూడా దాని వాదనే సబబుగా తోచింది కాబోలు" అనుకుంది పంకజం. పొయ్యిమీద కూర మాడి మసిఅయిపోయింది. ఈ సందడిలో కుంపటిమీద పాలన్నీ పొంగి పొర్లిపోయాయి. ఎక్కడపన్లు అక్కడే ఆగిపోయాయి. మరో గంటకల్లా ఆవురావురుమంటూ కుటుంబరావు వస్తాడు. ఆ వేళకి అన్నం ఉడుకుతుందో ఉడకదో అని మరో చింపబాధ పడింది పంకజం బియ్యం కడగటానికి తలుపు తియ్యాలి. వాళ్ళంతా అక్కడే ఉన్నారు పంకజానికి సిగ్గుతో ఒళ్ళంతా కుంచించుకుపోయింది. తన జీవితంలో ఎప్పుడూ ఇటువంటి ఘర్షణపడి ఎరగదు. "ఎంత సిగ్గుమాలిన పని చేశాను? పాడు రోజు! లేచిన వేళ మంచిదికాదు" అనుకుంది పంకజం.

* * *

ఆదరాబాదరాగా చేసిపడేసిన వంటకాలని "ఇవాళేదో ప్రత్యేకత ఉంది వంటకాలన్నీ అద్భుతంగా ఉన్నాయి" అని మెచ్చు

కున్నాడు కుటుంబరావు. పంకజం భయంగా పేలవంగా నవ్వింది.

"ఎక్కువ రోజులు ఇక్కడ ఉండటం మంచిది కాదు" అన్నాడు కుటుంబరావు తలపంకించుకుని. పంకజం గతుక్కుమంది.

"ఈ వీధిలో ఆడాళ్ళంతా నా కేసి ఎగబడి చూస్తున్నారివాళ. ఏనాటి కేలాటి బుద్ధులు పుడతాయో ఎవరు చెప్పగలరు! అమాయకురాలివి నీకు అన్యాయం జరుగుతుందేమోనని భయంగా ఉంది"

పంకజం ఒక్క నిట్టూర్పుతో తేలిక పడింది. రాత్రి కుటుంబరావు పుస్తకం మూసి కన్ను మూయబోతుంటే "ఎక్కడున్నా వేరుగా ప్రత్యేకంగా ఉండేవాటా ఏదన్నా చూడండి ఈ సెంఖుకి ఖాళీ చేసేద్దాం." అంది పంకజం.

కుటుంబరావు బిగ్గరగా నవ్వుతూ "వేళాకోళానికన్న మాట. అదే నిజం అనుకున్నావేంటి కొంపతీసి" అన్నాడు.

"అబ్బే అదేం కాదు ఇవాళ కాంతమ్మకీ నాకూ మాటామాటా వచ్చింది" అంది దృష్టి నేలమీదకు మళ్ళించి.

"నిజంగా?"

"నేను పనిమనిషిని నెత్తికెక్కించుకుంటున్నానుట! ఆ కారణంగా అది బరితెగించిపోయి ఆవిడంటే లక్ష్యపెట్టటం లేదుట! ప్రతిపనికీ అణాలూ బేడలూ ఇచ్చి మప్పుతున్నానట! ఏవేవిటో నోటికొచ్చినట్టల్లా మాట్లాడింది నేనూ నాలుగూ అనేశాను" అంది పంకజం జరిగిందంతా కళ్ళముందు ప్రతిష్ఠించుకుంటూను

"అనుకున్నంతా అయిందన్నమాట" అన్నాడు కుటుంబరావు

"నిజానికి ఇందులో నా తప్పేవిటో మీరే చెప్పండి" అంది పంకజం

"నీ దృష్టిలోనూ నా దృష్టిలోనూ తప్పు కాదు."

"నాకు డబ్బూ ఉంది హృదయమూ ఉంది. ఇచ్చుకుంటాను. వాళ్ళెవరు అడగటానికి?"


నీకు డబ్బూ ఉంది ఔదార్యమూ ఉంది. అన్ని విషయాల్లోనూ వాటిని వినియోగించే వాక్కు మాత్రం పదిమందీ ఇవ్వరు." అన్నాడు కుటుంబరావు.

"అదేవిటి? మీరూ అలాగే అంటారేవిటండీ! వాళ్ళెవరు మధ్యని?" అడిగింది పంకజం.

"వాళ్ళెవరో ఇందాక బోధపడలా?"

"అందరూ కాంతమ్మలాంటివాళ్ళే అవుతారా?"

"ఇటువంటి విషయాల్లో అందరూ ఒకటే! లోకం పోకడే అంత!"




లాల్‌బాగ్‌లో జయచామరాజ్ ఒడయార్ శిలాప్రతిమ

(బెంగుళూరు)

ఫొటో: దశిక రామలింగేశ్వరరావు—మద్రాసు.

ఇప్పుడు తను చేసిన పొరబాటు అర్థం అయింది పంకజానికి; తాను ఆదరించకూడని మనుషులూ, వాళ్ళపట్ల మెలగవలసిన విధానాలూ ఎవరో, ఏవో ఈ ప్రపంచంలో తాను గమనించాల్సినవి చాలా వున్నాయని. ఆశ్చర్యంగా ముక్కుమీద వేలు వేసుకొని తల అడ్డంగా ఊపింది పంకజం. ★



సీరియల్

"శారద"

12

భద్రయ్యగారి స్థితి, శారీరకంగా దిగజారకపోయినప్పటికీ మానసికంగా దారుణంగా మారిపోయింది. సదా ఆయన్ని ఒకటే దిగులు గుండెల్లో తొలుస్తోంది. యౌవనవతి ఐన తన భార్య ఏమనుకుంటుంది తననుగురించి? పెళ్ళయిన నెలకల్లా మంచ మెక్కినంత పనయి, ఎందుకూ కొరగాకుండా పోయారే అని అది అనుకుంటే విచిత్రమేమిటి? ఆమె ఆత్మక్షోభ ఎవరితో చెప్పుకుంటుంది? తనతో సరిగ్గా మాట్లాడనన్నా మాట్లాడదాయె. కొంచెం కులాసాగా ఉండటానికి సినిమాలూ అవీ ఉపయోగ పడుతున్నప్పటికీ, భార్యాభర్తలసంబంధం కల్పించగల ఆనందాలకి దూరమైనాక ఇంకేముంది?

ఒకనాడు పద్మ మధ్యాన్నంపూట తన ఆడబిడ్డ, సవతి కొడుకూ నిద్రపోతున్న సమయంలో, మెల్లిగా భర్త దగ్గరకి వచ్చి కూచుంది; ఆమె కళ్ళల్లో నీళ్లు నిండివున్నాయి.

భద్రయ్యగారు కంగారైపోయాడు. మంచంపక్కనే కూచున్న భార్య తల నిమురుతూ, "ఎందుకూ? ఎందుకట్లా కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నావు? అసలే నాకు దిగులుతో ప్రాణం కడబట్టింది. నువ్వు ఇంకా అట్లా ఏడ్చి నన్ను మరింత వేధించకు. చెప్పు" అన్నాడు.

పద్మ, "మా అమ్మనీ నాన్ననీ చూడాలని వుందండి. ఒకసారి మావూరు వెళ్ళివస్తాను" అంది వెక్కుతూ.

దీనికోసం ఆవిడ అంతసేపు వెక్కటం అనవసరం. కాని ఆమె ఆంతర్యం వేరేవుంది. దాని కింత ఉపోద్ఘాతం వుంటేనే గాని కుదరదని ఆమె అభిప్రాయం.

"దీనికి ఇంత కళ్ళనీళ్ళు పెట్టుకోవాలా పిచ్చిదానా! పొద్దున్నే బండికి వెళ్దువుగాని" అన్నాడు భద్రయ్యగారు ఓదార్పుగా.

పద్మ "తోడుగా మీరు రారూ?" అంది; ఆమె ఉద్దేశం ఏమిటో తెలుసుకోలేని భద్రయ్యగారు; పెదాలనించి ఈమాట లంది.

"నే నెట్లావస్తాను? అబ్బాయి తీసుకెళ్ళి వొదిలిపెట్టి వస్తాడులే. వరేనా? ఏడవకు. నామాట విను." అని భద్రయ్యగారు ఆమె గడ్డం పట్టుకున్నాడు.

పద్మ కళ్లు వికసించాయి. "మీరూ రండి. నాలుగురోజులుండి వద్దాం" అంది. కాని భద్రయ్యగారు అంగీకరించలేదు. ఆయన శరీరస్థితి ఎటూ పోవటానికి వీలుగా లేదని డాక్టర్ చెప్పాడు. పద్మ కోరికా అదే! భాస్కర్రావును తన పుట్టింటికి తీసుకెళ్లితే... ఆ పల్లెటూరిలో బ్రహ్మాండమైన గెండంతస్తుల లోగిలి; ఎటు చూసినా, సాయంత్రం ఆరు గంటల తర్వాత మనుష్యుల పొడంటూ ఎటూ కనపడని ఆ పల్లె!! భేషుగ్గా వుంటుంది!...

బండెక్కేవరకూ భాస్కర్రావుకి తను ఆమెతో ఆ నాలుగు రోజులూ ఆ వూళ్ళోనే వుండాలని తెలియదు. రైలెక్కి కూచోంగానే పద్మ, అదివరకల్లా కొంచెం సిగ్గు అభినయిస్తున్నదల్లా, అది మానేసి చాలా స్వతంత్రంగా ఎన్నో విషయాలు గురించి ధారాళంగా ఉత్సాహంగా మాట్లాడసాగింది. తన పుట్టింటిని గురించి చెప్పేటప్పుడల్లా ఆమె ముఖంలో కొత్తకాంతులు మెరిసిపోవటం చూశాడు భాస్కర్రావు పుట్టిల్లంటే ప్రతి ఆడదానికీ ఎంతో ఇష్టం అనుకున్నాడు. సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో రైలు దిగి బాపట్లనించి ఆ పల్లెకి, వొంటెద్దుబండి కట్టించుకున్నారు వాళ్ళిద్దరూ. చీకట్లు వ్యాపిస్తున్నాయి. దూరంగా ఎక్కణ్ణించో సముద్రపుగాలి చల్లగా వీస్తోంది. గతుకులరోడ్డు బండిని ఎత్తి కుదిపేస్తోంది. అందులో ఒంటెద్దుబండేమో అతినిదానంగా పోతోంది. అట్లాపోతే రాత్రి పదిగంటలకు ఇల్లుచేరినా చేరినట్టే!

బండి నిదానంగా 'ఏం తొందరలే' అన్నట్టు నడుస్తోంది. ఎముకల పోగులావున్న ఆ ఎద్దు మేత తిని ఎన్నాళ్ళయిందో అన్నట్టుంది. భాస్కర్రావు బండి చివర కూర్చున్నాడు రోడ్డువేపు తిరిగి. పద్మ అతనికి అవతల కూర్చుని మౌనంగా చీకట్లలోకి చూస్తోంది. క్షితిజం నల్లబడుతోంది క్రమంగా రోడ్డు కిరువైపులా బీటలువారిన మాగాణి భూమి బావురుమంటోంది; అక్కడొకటి అక్కడొకటి తుమ్మచెట్లు దెయ్యాల్లా తలలూపుతున్నాయి. ఉద్రేకంలో కళ్ళు మూతలుపడ్డవారిని మైకం కమ్మినట్టు చీకట్లు పెనుభూతాల్లా ప్రపంచాన్ని నలువేపులనుంచి ఆవరిస్తున్నాయి. దూరంగా ఎక్కడో, తూర్పువేపున దీపాలు మిణుకురు పురుగుల్లాగు మెరుస్తున్నాయి. పద్మ మనస్సులో ప్రతిమూలా తనకొచ్చిన ఈ అవకాశం, దీని మననంలో వచ్చిన సంతోషంతో నిండిపోయింది. ఆమె యావచ్ఛక్తీ ఒకే ఆలోచనమీద

కేం. దీక్ష్యతమైవుంది వసంతకాలపు వాతావరణంలో ఏకాంతంగా భాస్కరరావుతో కలిసి ప్రయాణం చేస్తున్నందుకు ఆమె యౌవన రక్తం ఉడుకెత్తి గంతులు వేస్తోంది.

భాస్కరరావు నిదానంగా ఆలోచనలను నెమరు వేసుకుంటున్నాడు. ఈ పనికిమాలిన పల్లెలో వంటరిగా నాలుగురోజులు వుండటం ఎలాగో అతనికి బోధపడలేదు! నాన్న నాలుగురోజులూ వుండి పిన్నిని వెంటబెట్టుకుని రమ్మన్నాడు. పల్లెలో నిశ్శబ్దం నిరామయమైన వాతావరణం, కమ్మని దంపుడుబియ్యపు అన్నం, అప్పటికప్పుడు కోసుకొచ్చిన కూరలు, పచ్చళ్ళు, సువాసనలకు పేరుపొందిన నెయ్యి—ఇవన్నీ బాగానే వుంటాయి. కాని బస్తీ అలవాట్లు అంత తొందరగా వొదులుతాయా! ఉదయం లేవగానే కాఫీ కావాలి. ఆ పల్లెలో ఉంటుందో ఉండదో, పిన్నిని కొన్ని వివరాలు అడగడం అవసరం అక్కడికి వెళ్ళాక ఉక్కిరిబిక్కిరి కావటం కన్నా ఇప్పుడే అన్నీ తెలుసుకుని సర్దుకోవటం మంచిది.

"పిన్నీ!" అని పిల్చాడతను పక్కవాటుగా తిరిగి, చీకట్లో ఆమె వేపు చూడడానికి వ్యర్థప్రయత్నం చేస్తూ.

"ఏం? ఏం కావాలి?" అంది పద్మ, అతనివైపు తిరిగి, అతని కుడిచేతి వేళ్ళమీద తన చెయ్యి మెల్లిగా ఆనించి. వెచ్చగా ఉందామె చెయ్యి.

"మీ వూళ్లో కాఫీ దొరుకుతుందా?..." అని అడుగుతూ భాస్కరరావు జేబులోనించి సిగరెట్టుతీసి వెలిగించాడు. కమ్మని సిగరెట్ పొగ గాలిలో కలిసి పద్మకు మైకం కలిగిస్తోంది. "ఏమిటీ కాఫీయా? మా నాన్న రెండుపూటలా కాఫీ తాగందే ఉండలేడు. అమ్మకూడా అంతే. బాపట్లనుంచి వారం వారం— కాఫీపొడి పంచదార తెస్తూ ఉంటాడు" అంది భాస్కరరావు మొహంకేసి చూస్తూ. పొగ లోపలికి పీల్చినప్పుడల్లా సిగరెట్టు నిప్పు తళతళ మెరుస్తూ అతని మొహాన్ని వింత కాంతులతో వెలిగిస్తోంది. భాస్కరరావు పద్మ భావాన్ని ఏమాత్రం అర్థంచేసుకోటానికైనా ప్రయత్నించటంలేదు. బంధి అన్న తర్వాత చేతులూ అవీ తగలటం అతి సహజమని అతని భావం.

"అయితే కాఫీ దొరుకుతుందన్నమాట. ఫరవాలేదు" అన్నాడు.

"దిగులుపడ్డావన్నమాట. భాస్కరం! నే నొక్కమాట అడుగుతాను చెబుతావూ కోప్పడకుండా!" అంది పద్మ అకస్మాత్తుగా.

"ఏమిటది పిన్నీ, కోపం దేనికి? అడుగు- తెలిస్తే చెబుతాను."

"నువ్వు చదువుకుంటున్నావు కదూ?" ప్రశ్నకి పునాది గట్టిగా వేసుకుంటోందామె.

"ఇదేం ప్రశ్న పిన్నీ! చిన్నప్పటించీ చదువుకుంటున్నాను." నవ్వాడు భాస్కరం అమాయికంగా.

"మీబోటివాళ్ళందరూ చదువుకుంటున్నందుకు ఫలితం ఏమిటో చెబుతావా?"

"ఫలితమా!...పిన్నీ? గుమాస్తాపని చెయ్యటానికి వుపయోగించే విజ్ఞానార్జన అంతే."

"శెభాష్!" నాటకంలో మల్లే అంది పద్మ. ఆమెకున్న ఉత్సాహంలో ఆమాట అప్రయత్నంగా వచ్చేసింది. "అంతేనన్నమాట. అంతకన్న మీ వివేకాన్ని పెంపొందించేందుకు మీ చదువు వినియోగించదా?"

"ఏమిటి పిన్నీ; కొత్తగా అడుగుతున్నావు పొడుపు కథలాగా?"

"పొడుపు కథే మరి! ఏభైఏళ్ళవాడికి ఇరవైఏళ్లు నిండని అమ్మాయి నిచ్చి పెళ్ళిచేయటం సంభవిస్తూవుంటే, నీబోటివాళ్ళు చూస్తూ వూరుకోడం, పొడుపుకథ కాక మరేమిటి?"



"ఏభైఏళ్లవాడికి ఇరవైఏళ్లు నిండని అమ్మాయినిచ్చి పెళ్ళి చేయటం సంభవిస్తూవుంటే నీబోటివాళ్లు చూస్తూ వూరుకోడం పొడుపు కథ కాక మరేమిటి?"

భాస్కరరావుకి నెత్తిమీద పిడుగులు ఉరుముతున్నట్టనిపించింది. అతనెన్నడు చూడని ప్రశ్న ఇది. దీనికి సమాధానం చెప్ప వల్సిరావటం కేవలం దురదృష్టం. ఏమవాలో కూడా తోచలే దతనికి.

ఊపిరి సలపని నిశ్శబ్దంలో ఐదు నిమిషాలు గడిచిపోయాయి.

ఆమె తన నేగాకుండా, చదువుకున్న వారందర్నీ, చదువుకుంటున్న వారందర్నీ సవాలు చేసింది. ఇంకెవరైనా జవాబు చెప్పగలరేమోగాని తానేమి చెప్పగలడు? భాస్కరం దట్టంగా ముసురుకుంటున్న చీకట్లోకి చూశాడు.

"నా చదువు దీనికేమీ జవాబివ్వలేదుపిన్నీ!...అయినా, ఇలాంటి పెళ్ళికి నా మనస్సు బొత్తిగా అంగీకరించదు; కాని నా అంగీకారంతో నిమిత్తంలేని పెళ్ళికి నేనుగాని, నా చదువుగాని ఎట్లా బాధ్యత వహిస్తాము?" గొణుగుతూ అన్నాడు.

పద్మ కొంటెగా పకపకా నవ్వింది. విషయం సీరియస్‌గా పరిణమించి, అతని హృదయం గాయపడితే ప్రయోజనం ఏమిటి? "నిజమేలే. జరిగిపోయిందానికి ఎవరూ బాధ్యత వహించరు. కాని, ఆ తర్వాతయినా దానికి కొంత ఉపశాంతి కలిగించటం ధర్మం కాదా?" అన్నదామె, ఉపదేశికురాలివలే గొంతుమార్చి.

వెయ్యి మెరుపులు మెరిసినట్టయింది భాస్కరానికి...దీని అర్థం ఏమిటి?...ఏమంటున్న దీయువతి? అతని ఇంద్రియశక్తులన్నీ అతితీక్షణంగా పదును పెటినట్టు పని చెయ్యసాగాయి.

ఆమె ఇంకా చెప్పుకుపోతోంది. "అబ్బాయి, విధి, ఖర్మ అంటే నాకెలాంటి నమ్మకమూ లేకుండా ఉండేది పెళ్ళికి ముందు. కాని ఈ పెళ్లయిన తంతూ ఆ తొందర చూస్తే, వాటిని

మంచీ-చెడూ

నమ్మాల్సి వచ్చింది. దాని వెంబడే మరోనమ్మకంకూడా ప్రబలింది. ఆవిధిని మరోవిధంగా ఎదుర్కోవచ్చని!" ఆమె వేళ్ళస్పర్శ, భాస్కరానికి ఇప్పుడు ఏదో కొత్తగా కన్పిస్తోంది. అతనివొళ్లు జలదరించింది. చప్పున వేళ్లు పైకి లాక్కుని మరో సిగరెట్టు వెలిగించాడు.

పద్మ తన ప్రవృత్తిని చప్పున మార్చుకుంది. ఇది సందర్భం కాదు. ఇంటికి వెళ్ళాక కాని అతనిమీద తన యావచ్ఛక్తినీ ప్రయోగించకూడదు. మెదలకండా, అతన్నేమీ పలకరించకుండా కూర్చుంది.

భాస్కర్రావు ఆలోచనలు ఒక కొత్త పంథాలో మేల్కొన్నాయి. మానవత్వం ఏమాత్రం వున్నా, ఈతరుణ వయస్కురాలికి జవాబు చెప్పడం అసంభవం. ఇప్పుడు పరిహారమివ్వగల తప్పా ఇది? దిద్దుకోటానికి వీలయిన పొరపాటా! భారతీయ నాగరికతకే మూలమైన వివాహసంస్థను,—అది ఎంత తప్పయితే మాత్రం—తిరిగి సరిచెయ్యటానికి వీలా? పిన్ని ఆలోచన ఏమై వుంటుంది? సూచనలు చూస్తే ప్రమాదానికి దారిదీసేట్టున్నాయి ... అతని గుండెలు ఝల్లుమన్నాయి. మంచి వయస్సులో వుంది ఆమె. శుష్కమైననీతుల్ని పదిమందిలో భయంవల్లో, సిగ్గుచేతో ఆదరించినట్టు అభినయిస్తే అభినయించవచ్చుగాక, అంతరాంతరంలో ఆమె వ్యతిరేకించి, తిరగబడి, తిరుగుబాటును చేతల్లో నిరూపించటానికి పూనుకుంటే! సంతృప్తిచెందనిచోట దైహికవాంఛలు దారుణఫలితాలకు దారి తీయటం అతను చదివాడు, విన్నాడు.

భాస్కర్రావు ఆలోచించటం మానేశాడు. ఈ ఆలోచనలతో కణతల నరాలు పొంగి పగిలిపోతా యనిపిస్తోంది అతనికి.

బండి ఆవిధంగా, మూడు గంటలసేపు ప్రయాణంచేసి, ప్రయాణంచేసి ఇద్దరివళ్ళూ హూనంచేసి రాత్రి ఎనిమిది ముప్పావుకి లంకపల్లిగ్రామం చేరుకుంది. లంకపల్లిలో రెండోందల గడప వుంటుంది. చుట్టూ కృష్ణకాలవలకింద సాగయ్యే మాగాణి; సిరిసంపదలకు లోటులేని గ్రామం. బండి గ్రామం ప్రవేశించేసరికే అంతా చీకటిగా, నిశ్శబ్దంగా వుంది. వెంకటయ్యగారిల్లు తూర్పు వేపున వుంది; తూర్పు వాకిలి గల బ్రహ్మాండమైన లోగిలి ఆయింటి యజమానులకి చాలా పొలం వుంది. వారందరూ తెనాలిలో ఎరువులబేరం చేస్తూ అక్కడే వుండిపోయి, తమ పల్లెటి నివాసంలో ఎవరైనా దీపంపెట్టేవారుంటే చాలని దాన్ని వెంకటయ్యగారికిచ్చారు. పై అంతస్తులో పూర్తి పాలగచ్చు చేసినవి రెండుగదులున్నాయి. కింద అంతస్తు నాలుగుగదులు, పెద్దహాలు, చుట్టూ కావల్సినంత మెల్లా. దొడ్లో భావి. బాపట్లతాలూకాలో భావుల్లో నీళ్లు మూరెడు చేదకే అందుతాయి.

భాస్కర్రావు బండిదిగి బాడుగ ఇచ్చాడు. పద్మ అంత చీకట్లోనూ అతిపరిచయంవల్లగాబోలు చకచకా లోపలికి నడిచి వెళ్ళింది, భాస్కర్రావుకి దారిమాపుతూ. ముందు పొడుగాటి గొంది వుంది. అది దాటి లోపలికి పోతేగాని ఇంట్లోకి ప్రవేశించటం జరగదు. భాస్కర్రావు కొంచెం జాగ్రత్తగా నడుస్తూ ఆమెను అనుసరించాడు. అతనికి ఇల్లూ, యీ చీకట్లు, ఏ ఆటంకమూ లేకుండా హోరుగా వీస్తున్న ఆగాలి, మిణుకుమిణుకుమంటున్న కిరసనాయిలు బుడ్డిదీపాల గుడ్డికాంతి, వింతగా, యత్కించిత్ నిరుత్సాహజనకంగా వున్నాయి. సందుదాటి హాల్లోకి ప్రవేశించాడు. పద్మ "అమ్మా" అని కేకేసింది. భాస్కర్రావు చుట్టూ చూశాడు. బాగా విశాలమైన అంత హాల్లోనూ ఒక్కటే చిన్న బెడ్ రూంలైటు అతి మందమైన కాంతితో వెలుగుతూ, వెల్తురు చిలకరించడానికి పాపం - శ్రమ పడుతోంది.

పద్మ తల్లి కూతురు వచ్చిన సంతోషంలో ఎంతో ఉత్సాహంగా భాస్కర్రావుకి కాళ్లు కడుక్కోడానికి నీళ్ళు తెచ్చి ఇచ్చింది. కుశలప్రశ్నలు వేసింది ఊపిరాడనీయకుండా. ఇంతలో వెంకటయ్యగారూ వచ్చాడు దొడ్లోనుంచి; ఆయనవంతు ఆయన అడగవల్సినవి అడిగాడు. మొత్తంమీద ఆ కుటుంబం అంటే భాస్కర్రావుకి మొదటి పరిచయంలోనే సదభిప్రాయం ఏర్పడిపోయింది. అతనంటే వాళ్లకూ అటువంటి అభిప్రాయమే కలిగింది. పద్మ తల్లి భాస్కర్రావుకి వేన్నీళ్లతోడి దొడ్లో పెట్టివచ్చి "స్నానం చేసిరా నాయనా, ఈలోగా వంటయిపోతుంది" అన్నది, చాలా ఆదరంగా. వెంకటయ్యగారు దారిమాపగా ఆయన్ననుసరించాడు భాస్కర్రావు.

పద్మ, ఆమెతల్లి వంటింట్లో ఏకాంతంగా కూచోగానే సంభాషణ ప్రారంభమైంది; ముసలామె పొయ్యిమీద తవ్వ గిన్నెపడేసి బియ్యం ఏరటానికి కూచుంది; పద్మకూడా బియ్యం ఏరుతూ, "ఈ అబ్బాయి పెళ్ళిరోజుకి రాలేదు. ఆ మర్నాడే వచ్చాడు...చాలా మంచివాడే అమ్మా!" అంది వుప్పొంగే హృదయంతో.

పద్మ తల్లి, "అంతా తండ్రినోట్లోనుంచి వూడిపడ్డట్లున్నాడు అబ్బాయి. చదువుకుంటున్నాడు గదూ?" అని అడిగింది. ఆమె పేరు, వరలక్ష్మమ్మగారు. మాయ మర్మ మెరుగని పెద్దముత్తైదువ; కల్లాకపటం తెలియని తల్లి. ప్రతివాళ్ళని ఆదరించే ఆనాటి తెలుగుదేశపు తల్లులకు ఈనాటి ప్రతినిధి.

పద్మ చాలా వుషారుగా, "అవునమ్మా, మద్రాస్‌లో చదువుతున్నాడట. ఎవళ్లతోనూ అనవసరంగా ఒక్కముక్కకూడా మాట్లాడడు. ఏదో వారంరోజు లుండి పోదామనిపించింది. వచ్చేశాను. ఈవారం ఆ అబ్బాయీఇక్కడేవుంటాడు—సరేనా" అంది గారాబంగా.

వరలక్ష్మమ్మగారు, "అదేమిటే అమ్మా! పదిరోజులన్నా వుండకుండానా?...నువ్వు పొయ్యి మంటచేసి బియ్యం కడిగి ఎసట్లో పొయ్యి; నేను గౌరమ్మగారింటికి పోయి పెరుగు పోయించుకువస్తా." అంటూ లేచింది. పద్మ, "సరేలేమ్మా. గౌరమ్మగారింటికి వెళ్తున్నావుగదూ, వాళ్ళ చిన్నమ్మాయి విమలతో చెప్పు నేను వచ్చానని" అంది, తన స్నేహితురాల్ని కలుసుకోవాలనే కుతూహలంతో.

"చెబుతాలే. అదీ రోజూ వచ్చి 'ఎప్పుడొస్తుంది మీ అమ్మాయి—పెద్దమ్మా' అని నా ప్రాణం తీస్తున్నది. ఈయేడు దానికి పెళ్లిచేస్తారట." అంటూ వరలక్ష్మమ్మగారు పెరుగు తేవటానికి వెళ్లింది, సత్తెప్పాలా పట్టుకొని.

వంట పూర్తిఅయ్యేవరకు భాస్కర్రావు వెంకటయ్యగారూ స్నానం ముగించి వసారాలో పిచ్చాపాటి మాట్లాడుకుంటూ కూర్చున్నారు. పెరుగు పోయించుకువచ్చి, విస్తళ్ళు వేసింది వరలక్ష్మమ్మగారు—కూతురుకీ, భాస్కర్రావుకీ. వెంకటయ్యగారు సాయంత్రం 7 గంటలకే భోంచేశాడు. కమ్మని పల్లెటూరి నెయ్యి, కందిపచ్చడి, పప్పుపులుసూ, తోడుపెరుగు బస్తీవాళ్ళకి అమృతంలాగుంటాయి. సారం చచ్చిన మరబియ్యానికీ, నీళ్ళవంటి మజ్జిగకూ, దుర్వాసనకు పేరుగల బెజవాడనేతికి అలవాటయిన భాస్కర్రావు జిహ్వకి అమృతంకన్న మిన్నగా వున్నాయి. ఆనాటి పదార్థాలు దానికి తోడు వరలక్ష్మమ్మగారి అపారమైన దయ, ఆదరణ అతనికి మరింత ఆనందాన్నిచ్చాయి. ఒక వంక పద్మ ఇంకోముద్ద తినమని అతన్ని కొసరుతునే వున్నది. వేడివేడి

నీళ్లు పోసుకుని, కమ్మని భోజనం కడుపునిండా తిన్నాక వొంటెద్దు బండి ప్రయాణంలో అలిసిపోయిన అతని ప్రాణానికి హాయి అనిపించింది. నరాలన్నీ విశ్రాంతిని కోరుతున్నాయి. ఆ చలగాలిలో నక్షత్రాలవేపు చూస్తూ పడుకొంటే ప్రాణం ఎటుపోతుందో!

భోజనాలైనాక భాస్కరరావుకి మేడమీద వసారాలో మంచం వేసింది పద్మ. తనకు గదిలో అమ్మదగ్గిర పక్క వేసుకుంది. వెంకటయ్యగారు కిందనే పడుకున్నాడు. పద్మ పక్క వేస్తున్నపుడు ఆమెని భాస్కరరావు అడిగాడు నములలేకా మింగలేక, "సిగరెట్లు గుకొణం తీసిపుంటుందా" అని. "రెండిళ్ళ అవతల కోమటింటిలో దొరుకుతాయి. నాన్నా నువ్వు వెళ్లిరండి" అంటూ పద్మ తండ్రిని కేకేసి చెప్పింది.

భాస్కరరావు సిగరెట్లు ముగించి వసారాలో పడుకున్నాడు. ఆ కొంత చల్లగా సద్దు గొరగళి పరశిస్తువుంది. మధ్య మధ్య నక్షత్రాలు మిలమిలా మెరుస్తున్నాయి ఎక్కడా ఏ శబ్దమూ వినిపించడంలేదు. అతని మనస్సుకూడా అతి నిర్మలంగా వుంది. బడలికవల్లనూ, చల్లగాలి ప్రోత్సాహంవల్లనూ అతడు కొద్ది క్షణాలలోనే గాఢనిద్రలో పడిపోయాడు. పద్మ, అతనికి నాలుగు గజాల దూరంలో పాలగమ్ము వేసిన ఆ పురాతనమైన గదిలో తల్లి పక్కలో పడుకుని నిద్రపట్టక, గోడలవేపూ కప్పువేపూ కళ్ళు మిటకరించి చూస్తోంది.. తన భర్తే ఈ భాస్కరరావు వంటి వాడైతే!!.. భాస్కరరావే ఐతే, తన బతుకు ఎంతో ఆనందంతో నిండి వెలిగిపోయేది కాదా!...ఇలాంటి రాత్రులు జీవితంలో తిరిగిరమ్మంటే వస్తాయా? వసంతకాలాలూ, చలిరాత్రులు, వర్షపురోజులూ ఏటేటా వస్తునే వుంటాయి. వస్తాయి. ప్రకృతి ధర్మం ఒక్కలాగే వుంటోంది శతాబ్దాల తరబడి. కాని వ్యక్తి జీవితంలో అనుభవనీయమైన రాత్రులు కొన్నే! అవి ఇట్లా, మానవకల్పితమైన నీతులకు కట్టుబాట్లకూ లోబడి వ్యర్థం కావాల్సిందేనా? పద్మ తల్లివైపు చూసింది. ఆమె ఎప్పుడో గాఢ సుషుప్తిలో మునిగిపోయింది గదితలుపు వోరగా మాత్రమే వేసివుంది. తనకు ధైర్యమే వుండాలిగాని, భాస్కరరావుకీ తనకీ మధ్య ఏ అడ్డూ లేదు నిజానికి

అయితే ఇలాంటి తలపులలోనే ఆమె అంతరాత్మలో సంఘర్షణ ప్రారంభమౌతుంది; ఒక తప్పు సవరించుకోడానికి ఇంకోతప్పు చెయ్యటం భావ్యమా? ఆమెలోని తృష్ణల బలిమికన్న స్త్రీయ ప్రతిష్ఠ లోకుల అభిప్రాయాలను గురించిన భయాలు ఒకొక్కప్పుడు ఎక్కువ జౌతున్నాయి. అటువంటప్పుడే ఆమె భయంతో కంపించిపోయ్యేది ఎక్కడలేని దౌర్బల్యమూ ఆవహించేది ఆమెను. ఐనా, ఆమె గంటగంటన్నరసేపు ఈ రకమైన సంఘర్షణలో పడి కొట్టుకుంది; పాశవికమైన ప్రోద్బలాలే సహజంగా గెలిచాయి. ఆమెలో చెలరేగిన ఆ వాద ప్రతివాదాలలో అంతరాత్మ ప్రబోధం సాంఘిక ప్రమాణాలు, నైతికవిలువలు అణగారిపోయాయి. కామతృష్ణ గెలిచింది. ఆమె మెల్లిగా లేచింది తొగినదానికిమల్లె తూలుతూ గదిదాటి వసారాలోకి వచ్చింది. వసారా చూరుకు అవతల భాస్కరరావు, వొళ్లు తెలియని నిద్రలో వున్నాడు. ఆమె మెల్లిగా ఆ చీకట్లో అడుగుమీద అడుగు వేసుకుంటూ అతడి మంచం దగ్గిరకొచ్చి నిల్చుంది. చీకట్లో ఎవరూ చూడ్డంలేదూ, అంటే ఎవరికైనా ముందు మొండిధైర్యం వస్తుంది—నిజమే కాని ఆ ధైర్యం, చిల్లిగిన్నెలో నిలువనినీరులాగా క్షణక్షణానికీ క్షీణించిపోతూవుంటుంది. పద్మ, భాస్కరరావుతల్పంవైపు తొంగిచూస్తూ నిల్చుంది, తన యావచ్ఛక్తినీ కూడదీసుకుని ఆమెన ఏం చెయ్యాలో, ఎట్లా అతన్ని పలకరించాలో, ఎవరైనా చూస్తే ఏమనుకుంటారో, అనే భయాలూ దిగుళ్లూ ఆమెను ఒక్కసారిగా భయంకర పిశాచాలవలె ఆవహించాయి ఆమెమనస్సు దారుణమైన భయంలో గిజగిజ కొట్టుకోసాగింది కాంతిలు చెప్పుగు గీసుకుంటున్నాయా అన్నట్టున్నాయి.

ఆమె నాసికా పుటాలనుంచి వెలువడి వేడి నిశ్వాసాలు భాస్కరరావు మొహంమీద వడివడిగా సోకుతున్నాయి అతను కుడి వేపునుంచి ఎడం వేపుకి దొర్లాడు పద్మ గుబుక్కునలేచి తన గది దగ్గరికి వచ్చేసింది భాస్కరం నిద్రమగతలోనే కలవరిస్తున్నాడు ఏదో—పద్మ ధైర్యం హరించిపోయింది. కాళ్లు చేతులు చల్లబడిపోయాయి స్త్రీ సహజమైన బలహీనత, ఒక్కసారిగా పైకి వచ్చింది. ఆమె రక్తంలో జీర్ణించిపోయిన్న సాంఘిక ధర్మాల సారం వక్కరింతగా తొంగిచూసింది నరాలు తెపన కోలాహలం చల్లబడిపోయింది. ఆమె తన అధైర్యానికి తనను తాను తిట్టుకుంటూ బరువుగా అడుగులేస్తూ వెళ్ళి తల్లి పక్కలో పడుకుంది.

[ఇంకావుంది].

బొమ్మా-బొరుసూ

వీరుబొట్ల
సత్యనారాయణమూర్తి

"ఎందుకండీ పిలిచారుట" అన్నాడు తొమ్మిదేళ్ల క్రిష్ణమూర్తి లోపలికి వొస్తూ.

"నీకో సాయం పెడతాను. నాకో చిన్న పని చేసిపెడతావూ" అంది శ్యామల క్రిష్ణమూర్తిని దగ్గిరికి తీసుకుంటూ.

"ముందు పెడితే..."

"ముందే పెడతానోయ్"

"అలాగే చేసిపెడతాను" అంటూ బుజా లెగరేశాడు క్రిష్ణమూర్తి.

శ్యామల బీరువాతీసి సీసాలో వున్న బిస్కట్లు తీసి క్రిష్ణమూర్తికి పెట్టింది. క్రిష్ణమూర్తి బిస్కట్లు ఆబగాతింటూ "ఎంత మంచివారండీ మీరు. మీకో పాపాయి లేదుగాని వుంటే ఎంత గారంగా పెంచేవారో. మా అమ్మ చూడండీ. ఎప్పుడూ కొట్టడమే. ఎప్పుడేనా తింటానికి అడిగితే కంయ్‌బొంయ్‌మని కుక్కలా కరవడానికి వొస్తుంది"

"తప్పు నాయనా! మీ అమ్మ నలా అనకూడదు. మీఅమ్మ ఎంతో మంచిది. మీ అమ్మకి నీమీద ఎంత ప్రేమని. మా యింటికొచ్చినప్పుడు ఎప్పుడూ నీగురించే నీమంచితనాన్ని గురించే చెబుతారు. మీనాన్నగారు కూడా నిన్ను పెద్ద చదువులు చదివించి బుద్ధిమంతుణ్ణి చెయ్యాలని చూస్తున్నారు" అంది శ్యామల అతని నుదురునీ బుగ్గలనూ తన లేతవేళ్లతో పుణుకుతూ.

"ఏం పెద్ద చదువులోగాని మా అమ్మ మాత్రం నేను రాత్రి పదింటిదాకా చదివితేగాని ఊరుకోదు. చీపురుకట్ట తీస్తుంది"

"మరి మొగపిల్లాడు చదువుకో వొద్దుటోయ్! చదువుకుంటే ఎంతైనా లాభం వుంది"

"క్రిష్ణమూర్తి శ్యామలను గౌరవంగా చూస్తూ ఆమెదగ్గిరిగా కూచుని బిస్కట్లు తింటూనే ఉన్నాడు. కొన్ని సెకన్ల నిశ్శబ్దం తరవాత శ్యామల "క్రిష్ణమూర్తీ నిన్నొకటడుగుతాను చెప్తావా"

"ఓ"అంటూ బుర్రఊపాడు క్రిష్ణమూర్తి.

"మీ నాన్నగారికీ మీ అమ్మగారికీ ఎప్పుడన్నా దెబ్బలాటలు వొస్తాయా? మీ నాన్నగారు ఎప్పుడైనా మీ అమ్మని కొడతారా?"

శ్యామల ఈమాట అని కింది పెదవి కొరుక్కుంది. క్రిష్ణమూర్తి ఆశ్చర్యంగా చూస్తూ "ఏమో నాకు తెలీదండి. మా అమ్మమాత్రం పుట్టింటికి వెళ్లనంటే" పట్నంవాసన విడిచి వెళ్లలేవేం? పుట్టింది పల్లెటూళ్లోనేగా "అంటారు" అన్నాడు అమాయికంగా.

శ్యామల కళ్లు చెమర్చాయి. అయినా చెమ్మగిలిన కళ్ళతోనే నవ్వుతూ డ్రాయరు సొరుగుతీసి ఒక వుత్తరం ఒక అర్ధరూపాయి కానూ ఇచ్చింది. ఒక కాగితం యిచ్చింది.

క్రిష్ణమూర్తివంక తిరిగి "ఈ వుత్తరాన్ని రిజిస్టర్ చేయించాలోయ్. ఈ చిన్న కాయితంమీద ఎడ్రస్ రాశాను. ఒక కోక పెట్టి కవరుకొను. దానిమీద ఈ ఎడ్రస్ తెలుగులోనే రాయి. కవరు అంటించిం తరవాత పోస్టుమాస్టరుగారికి ఆరణాలిచ్చి రిజిస్టర్ చెయ్యమను."

"అలాగేనండీ అంటూ జారిపోతూన్న హాఫ్ ఫేంటును పైకి లాగుకుంటూ వెళ్లిపోయాడు క్రిష్ణమూర్తి.

శ్యామల క్రిష్ణమూర్తి వెళ్ళిపోయాక అనదనుకున్న పెద్దపని తీరినట్టు బరువుగా ఊపిరి వొదిలింది.

* * *

రాత్రి పదకొండవుతుంది. చిక్కగా వుంది చీకటి. గది కిటికీదగ్గిర కూచుని శ్యామల నిశ్శబ్దంగా ఏడుస్తోంది మాటిమాటికీ పమిటికొంగుతో కాటుక కళ్ళు తుడుచుకుంటూ. పక్కింటి కృష్ణవేణిగారి క్రిష్ణమూర్తి గంటదాకా చదువుతోనే వున్నాడు. ఆ కుర్రాడి గురించి తలపోస్తూ తన స్థితిని చూసి ఏడుస్తూ అలానే కూచుంది.

అరగంట కొట్టింది గడియారం.

శ్యామల ఆవలిస్తూ లేచింది. తలుపుతట్టిన ధ్వని వినవొచ్చింది. నిశ్శబ్దంగా శ్యామల తలుపుతీసింది. నారాయణరావు లోపలికి వొచ్చాడు. షాక్సూ బూటూ తనే విప్పుకున్నాడు. కోటుకూడా తనే విప్పుకుని కోట్ హేంగర్‌కి తగిలించాడు.

శ్యామల ధర్మాస్ ఫ్లాస్క్ తెచ్చి బల్లమీద పెట్టింది కాఫీతాగాడు. ఇంతలో వొంటింటిలోకి వెళ్లింది శ్యామల. బయటికొచ్చి నడవలో కూచుంది. పదినిమషాలు సిగరెట్ తాగుతూ పేపరు చదివి వొంటింటో కెళ్లి భోంచేసి చక్కా వొచ్చాడు.

శ్యామల మడత మంచంమీద పడుకుని దుప్పటి మడతల్లోంచి గదిలోని చీకట్లోకి చూసింది. సింహపైకన్ను పన్నెండుంబావు చూపుతోంది.

మెల్లిగా కళ్లు ఎడంవైపు తిప్పింది. నారాయణరావు నిద్దరపోతున్నాడు. నిశ్శబ్దంగా నడిచివెళ్లి అతనికాళ్లుపట్టడం మొదలెట్టింది. నారాయణరావు కిమ్మనలేదు.

ఒంటిగంట అయింది. శ్యామల రెప్పలు నిద్రాభరాన్ని సహించలేక పోతున్నాయి. లేచింది. కిటికీదగ్గిరికెళ్లి నుంచుని శూన్యంలోకి చూసింది.

"నారాయణరావ్ గారూ"అంటూ రెండుమూడుసార్లు తలుపు దృఢంగా తట్టుతూ వొక వ్యక్తి కేక వేస్తున్నాడు.

నారాయణరావుకి మెలుకువ రాలేదు.

ఆలోచనల్లో మునిగిపోయిన శ్యామల ఉలిక్కిపడింది. వెళ్ళి తలుపుతీసింది.

"మాకేనా టెలిగ్రాం" ఆశ్చర్యంగా అడిగింది కంఠస్వరంలో భయం కనబరుస్తూ.

"అవునండి"

శ్యామల గుండెలు వేగంగా కొట్టుకోడం మొదలెట్టాయి. లోపలికివెళ్లి శరీరంమీద చెయ్యివేస్తూ లేపింది.

కోపంగాకళ్లువిప్పి "ఏమిటిది"అన్నాడు నుదురు చిట్లిస్తూ.

ఉబుకుతోన్న కన్నీళ్ళని అపుకుంటూ "మీకు టెలిగ్రాం వొచ్చింది" అంది కంఠస్వరంలో గాద్గద్యం కనబరుస్తూ.

తటాలున లేచి నారాయణరావు టెలిగ్రాం పుచ్చుకున్నాడు. చెవుల్లో చెవులు పెట్టుకుని వినడానికి సిద్ధంగా వుంది శ్యామల. కళ్ళలో ఆతురత కనపడుతోంది.

నారాయణరావు ముఖం నలుపుదనం వహించింది. కళ్ళలో నీళ్లు గిర్రున తిరిగాయి. "ఏమిటి?" అంది అతని కళ్లల్లోకి భయంగా చూస్తూ.

'ఊ! ఏం లేదు. సామాను సర్దు. నేను వూరి కెళ్లాలి అర్జెంటుగా" అని మూలిగాడు.

"ఎవరికీ అపాయం లేదుగదా"

"లేదు"

అకస్మాత్తుగావచ్చిన అల్లుడు గారికి కొంటె బావమరిది వీధి వాకిట్లోనే ఎదురైనాడు.

"ఏమోయ్! నేనీపూట వస్తానని మీ అక్కయ్య అనుకొంటోందా?"

"ఆ!"

"నీకెలా తెలుసు?"

"అందుకనేగా మా అక్కయ్య పొద్దునే పక్కవూరికి ప్రయాణమై వెళ్ళిపోయింది!"

"ఎక్కడికెళ్లాలి"

"అవన్నీ నీ కెందుకు?"

శ్యామల కింది పెదవి మీదికెత్తకుండా సామాను సర్దింది. నారాయణరావు సైకిలు రిక్షాలో సామాను వేసి వెళ్ళిపోతోంటే గడియారం రెండున్నర కొట్టింది

* * *

కాఫీకప్పు బల్లమీద పెడుతూ "శ్రీనివాసు లేడూ" అన్నాడు నారాయణరావు.

"ఏం? ఎక్కడికెళ్ళాడు?"

"ఏమో నాకేం తెలీదు. అర్జెంటు పనుందిట. కట్టుగుడ్డల్తోనే మీవూరు వెళ్ళావని ఆఫీస్‌బోయ్‌తో కబురంపారు.

"శారదా శ్రీనివాసు ఇట్లాంటివాడు అవుతాడని నేను కలలోకూడా అనుకోలేదు" సిగరెట్ ముట్టిస్తూ అన్నాడు నారాయణరావు.

"నేనుమాత్రం అనుకున్నానురా అన్నయ్యా. ఆయనని కట్టుకున్న తర్వాత వొక్కరోజూ సుఖంలేదనుకో. ఆఫీసులో ఆయనకి పాడుస్నేహితులు దొరికారు. డబ్బు అనవసరంగా ఖర్చుపెట్టేస్తారు. ఇంటో అవసరానికి ఒహ వొస్తువైనా వుండదు. రాత్రిళ్లు ఒక్కొక్కప్పుడు ఇంటికేరారు. అర్ధరాత్రీ అపరాత్రీ వొచ్చి నన్ను చావబాత్తారు. ఒక్కొక్కప్పుడు అసలే మాటలే ఆడరు. నా వొంటిమీద వొస్తువులన్నీ వొలిచేశారు. ఒకవారం రోజుల్లో అద్దరిభూమి రెండెకరాలూ అమ్మేశానంటున్నారు. నా నెక్లెస్ వొకటి తాకట్టుపెట్టారు. వారంనించి మా యిద్దరికీ మాటల్లేవు. నువ్వేనా వొచ్చి నా విషయాలు చక్కదిద్దుతావని టెలిగ్రాం పక్కింటి సోమనాథంగారి కుర్రాడు గోపాలంచేత యిప్పించాను."

చెబుతున్నంతసేపూ శారద వెక్కివెక్కి ఏడ్చింది. నారాయణరావు గుడ్లప్పగించి మాస్తోనే వున్నాడు. ఆ పదినిమిషాలు అతనిలో చైతన్యంలేదు. మనస్సు ఎక్కడో పనిచేస్తోంది. ఎమ్యూజ్‌మెంట్ పార్కులో నూరు రూపాయలు తగలెయ్యడం టౌన్‌హాలులో ప్లీడరు శ్రీరామమూర్తితో కలిసి యాభైరూపాయిలు వోడిపోవడం శ్యామల జాజిమొగ్గల నెక్లెస్ రాత్రికి రాత్రి బీరువాలోంచి తీసి అమ్మెయ్యడం ఇవన్నీ గుర్తుకు వొచ్చాయి.

క్షమాపణ పూర్వకంగా శారదయొక్క నల్లటి కాంతివంతమైన కళ్లల్లోకి చూస్తూ "శారదా నువ్వేమీ కంగారుపడకు. నీ సంసారం చక్కబరుస్తాను. కాని నన్ను మాత్రం నువ్వు క్షమించాలి. నీ స్నేహితురాలు శ్యామలని చాలా అన్యాయం చేస్తున్నాను..."

పావుగంట గడిచింది. శారద నారాయణరావులు ఆర్ద్రనేత్రాల్ని తుడుచుకున్నారు. రెండు నిమిషాలు నిశ్శబ్దం.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ "శారదా శ్రీనివాసం మా యింటికి వెళ్ళుంటాడని నాకు అనిపిస్తోంది."

శారద కనులలో ఆశ్చర్యం తొణికిసలాడింది.

"ఏం లేదు. ఊరికే నాకలా కనపడుతోంది"

ఇద్దరూ మౌనంగా కూచున్నారు.

తలుపు ఎవ్వరో తట్టారు. శారద తలుపు తీసింది. శ్యామలా శ్రీనివాసం లోపలికి వొచ్చారు.

పది నిముషాలు వాళ్ల జీవితాల్ని మార్చుకునేటట్టు వాళ్లు తీర్మానించుకున్నారు. ఈ ఏడాది రెండు కాపరాల్లోని భర్తల ప్రవర్తనకూ చింతించారు. తమ జీవితాధ్యాయంలోని రెండవ పుటలో విచారపు నీడలు ఉండరాదనుకున్నారు.

పరస్పరాలింగనాలైనాయి. శ్రీనివాసం ఉడికించేటట్టు "నీకో వొస్తువు తెచ్చాను" అన్నాడు శారదవెంపు తిరిగి.

ఉడికించి ఉడికించి నెక్లెస్ పైకితీశాడు శ్రీనివాసం. "తాకట్టు విడిపించారా" అన్నది కళ్ళలో మెరుపుతీగలు పాకగా.

"ఒరేయ్ శ్రీనివాసం నీ స్నేహితురాలు శ్యామల సంసారాన్ని చక్కదిద్దేవ్ సరేగాని దానికో ఉపకారం చెయ్యాలిరా."

ప్రశ్నార్థకంగా రెప్పల అడుగునించి చూశాడు శ్రీనివాసం.

"నీ బేంక్ చెక్‌బుక్ తియ్. శ్యామలకో నెక్లెస్ నే కొనివ్వాలి."

శ్యామల నీలపు కళ్లు మెరిశాయి.

శారదవైపు తిరిగి "చెక్‌బుక్ తీసుకురా శారదా. తర్వాత స్ట్రాంగ్ కాఫీ తయారు చెయ్యి. మనం నలుగురం షాపింగుకు పోవాలి ఇవాళ"

శారద బుగ్గలు సొట్టలు పడేట్టు నవ్వుతో "ఉత్త షాపింగేనా షో చూడొద్దూ."

శ్యామల అందుకుంటూ "మన సంసారపు షోలు చాలదూ" అంది ముసిముసి నవ్వులు ముఖంమీద పరుచుకుంటూ.

★



నళినీదళగత జలమతితరళమ్



—ఫొటో: బి. రంగనాథన్, మద్రాసు.

బొమ్మరిల్లు

పిల్లి శకునం

శ్రీనివాస కాశ్యప

అనగనగనగా
ఒకవూళ్లో—
అతి చాదస్తపు
మనిషే నాయన
ఉన్నా డొకడూ
చాతా నాయన!
ఆయన రోజూ
అక్షయ పాత్రకు
ఆవూ - రేవూ
వెళ్తాడూ!
దొరికినదానితో
తృప్తిని చెందీ
సంసారం సా
గిస్తున్నాడూ!

* * *

ఒకరోజాయన
గుమ్మం దాటగ
పిల్లి ఒక్కటీ
ఎదురయ్యిందీ
పిల్లి శకునమూ ?!
పీడనుకుంటూ
భయంభయంగా
బయల్దేరాడూ!

* * *

ఆతడు యేదో
ఆలోచిస్తూ—
జొన్న చేనుకడ
కొచ్చాడు!
అచ్చట ఆయన
మిత్రు డొకాయన
చిరకాలమునకు
కలిశాడూ!
ఇద్దరు అచ్చట
ముచ్చట తీరగ
"దాసోహం, ప్రతి
దాసోహాలతో"
ప్రపంచమ్మునే
మరచారూ!
జొన్న చేను బహు
చిన్నదవటమున



నలిగిపోయె "ఈ
దాసోహాల"కు!!

* *

పక్కన కలుపును
శుభ్రం చేసే—
బక్కరైతు ఇది
చూశాడూ!
వచ్చి వచ్చి నా
చేనుకె తెచ్చెను
ముప్పని ఆతడు
తలచాడూ!
ఎంత సేపయిన
స్నేహితు లిద్దరు
ఆగునట్లతడి
కగుపడ లేదు!
వీరి ప్రవర్తన
చూడచూడగా
అతడికి కోపం
అధికం కాగా
కర్ర నొక్కటీ
చేతబట్టుకొని
వీపులమీదను
రెండేశాడూ!!

* * *

దెబ్బతో తెలివి
కలిగి స్నేహితులు
చెరోదారి పరు
గెత్తారూ!

* * *

చాతా నాయన
చాలాదూరం
పోయి వెనుకకు
చూశాడూ!
పిల్లిశకునమును
తలచుచు ఆతడు
వీపు తడువుకొని
ఏడ్చాడూ!!

* * *

అతి చాదస్తం
అన్నివిధాలా
ఆరోగ్యం కా
దబ్బా యీ!
ఏదయినా -
మోతాదు మించితే
కష్టం - నష్టం
కలిసొస్తాయీ!



కర్పూర ద్వీపయాత్ర

(బొమ్మరిల్లు సీరియల్)

నోరి నరసింహశాస్త్రి

25

అట్లా తన పెంపుడుతల్లి మామిడిచెట్టుమీద ఒంటరిగా విడిచిపోగానే కోకిలపిల్లవాడికి ముందు భయం వేసింది. ఒంటరిపాటుకు అలవాటుపడనివాళ్ల భయ మది.

అంతలో ఆకలి వేసింది. మామిడి ఇగుళ్లు మెక్కినాడు. భుక్తాయాసంతో ఒక్క కునుకు తీసినాడు. త్వరలోనే మెలకువ వచ్చింది.

మెలకువ రాగానే కాకమ్మ తనమీద చూపిన ప్రేమ తలచుకు తలచుకుని ఊరికే ఏడవ మొదలు పెట్టినాడు.

మునుపు గట్టిగా ఏడుద్దామన్నా భయమే, కాకులు పొడిచిపోతవని. ఇప్పుడు మనసారా ఏడవసాగి నాడు. పొంగివస్తున్న ప్రేమా దుఃఖమూ స్వేచ్ఛ రాగానే నిర్భయంగా వెళ్ళబుచ్చుకుంటున్నాడు.

చిత్రం చూడండి! ఇప్పుడు వాడు తన సొంతగొంతుతో, కాకుల గొంతును అనుకరించవలెననే ప్రయత్నంకూడా చేయకుండా, నిర్భయంగా, స్వతంత్రంగా ఏడవడం మొదలుపెట్టాడు. ఆ ఏడుపు అడవి అంతా కమ్మగా ప్రతిధ్వనించింది. ఏమని?

"కూ ఊ ఉ! కూ ఊ ఉ! కూ ఊ ఉ!"

పంచమ స్వరము వనమంతా మారుమోగింది. ఎట్లా? వాల్మీకి మహాకవి చేసిన రామరామ జప నాదం వల్లనే మధుర మధురాక్షరంగా మోగింది. దానితో ఆ వనం బూరటిల్లిపోయింది.

కోకిల పిల్లవాడికే ఆశ్చర్యమయింది. ఆ ఏడుపులోనే ఒకవిధమైన తృప్తీ ఆనందమూ కలిగినై. కొంచెము గర్వముకూడా వాటితో కలిసింది.

అంతలో వాడికి మరెవరోకూడా తనవలెనే దూరాన కుహూకుహూకుహూ మంటూన్నట్లు తోచింది. కాస్తసేపు తన అరుపు చాలించి ఆలకించాడు.

నిజంగానే ఇంకెవరో తనవలెనే కూకూనాదం చేస్తున్నారు.

నిజంగానా? లోకమంతా కాకులల్లే కాకా అనరు కాబోలు!

నే నసలు కాకినేనా? పాపము, నన్నంత ఆపేక్షతో సాకిన కాకమ్మ మా కన్నతల్లేనా?

కాక, కాకులు తీర్పు చెప్పినట్లుగా నేను కోకిలనా? కోకిలలన్నీ కుహూకుహూ మంటవి కాబోలు. నా కిది జబ్బు కాదా? కాకుల గోల మధ్య నా గొంతు అపస్వరంగా వినిపించింది. ఇప్పు డిక్కడ ఒంటరిగా ఇట్లా కూస్తుంటే ఎంతహాయిగా ఉన్నది! అవతల నావలెనే ఎవరో కూస్తున్నది? ఎంత తియ్యగా ఉన్నది!— అదికూడా పాపము, దీనస్వరంతో ఏడుస్తున్నట్లున్నది. అదీ నావలె కాకులమధ్య పడ్డ కోకిల కాబోలు!

★ కర్పూర ద్వీప యాత్ర ★

—ఈవిధంగా అనుకుంటున్నాడు కోకిల యువకుడు!

నిజంగూడా అంతే. పూర్వ గాయకుడి భార్యకూడా నరకంలోనుంచి విడిపడి, మరొక కోకిలమ్మ కడుపులో పడి, గుడ్డయి ఇంకొక గూడెంలో కాకి గూట్లో దొంగతనంగా పెరిగి, వీడివలెనే పెంపుడు కాకమ్మ గారాబంవల్ల ఇంకో మామిడిచెట్టుమీదికి కొనప్రాణాలతో చేరుకొని ఒంటరిగా రాగాలు తీస్తున్నది.

కోకిలా కోకిలమ్మా ఒకరి గొంతు ఒకరు విన్నారు. సాటి కోకిల అవతల ఉన్నదని తెలుసుకొని ఇద్దరూ ఒక్కసారే కుహూకుహూమంటూ రివ్వున ఎగురుతూ బయల్దేరినారు.

ఆ రెండు అడవులూ కలిసే సింహాచలం కొండమీద ఆ జంట కలుసుకున్నది. ఎన్నాళ్ళనాడో వేరై మళ్లీ కలసిన సావాసగాళ్లు చూచుకొనేట్లే ఆప్యాయంగా చూచుకొన్నవి. ముక్కూ ముక్కూ రాచుకున్నై. రెక్కలూ రెక్కలూ కలుపుకున్నై. మెడతో మెడ కీలించినై. గొంతూ గొంతూ కలిపినై. స్వరమూ నాదమూ వలె ఆ రెండూ ఏకమై ఆనందించినై!

26

తెలుగుగడ్డకే కాక దక్షిణాపథానికే నడిబొడ్డు శ్రీశైలము! భరత ఖండానికే అది నాభిస్థాన మని చెప్ప గూడను. అక్కడ మల్లికార్జున స్వామి భ్రమరాంబికతో వెలసి భక్తుల కోరికలు తీరుస్తూ ఉన్నాడు.

శ్రీశైల పాదాలవద్ద కృష్ణవేణమ్మ ఉత్తర వాహినిగా ప్రవహిస్తూ స్నానంచేసేవారి పాపాలన్నీ కడిగివేస్తూ ఉన్నది. దాన్నే అక్కడ పాతాళగంగ అంటారు.

అక్కడ కొండల చాలులో ఎన్నో శిఖరాలు ఉన్నవి. అన్నిటిలో ఎత్తయినది శిఖరము. ఆ శిఖ

రముమీద శంకరుడు శిఖరేశ్వరుడనే పేరుతో వెలసినాడు. అదే ఏమి? ఆ చాలులో ప్రతి పర్వతశిఖరం మీద అనేక నామాలతో శంకరుడు వెలసినాడు. హాటకేశ్వరము మొదలైన వెన్నైనా ఉన్నవి. పాతాళగంగలో లింగాలగట్టు అనే చోట గులకరాళ్ళవలె నీళ్ళలో తళతళలాడే రాళ్ళన్ని అన్ని లింగమూర్తులే. అక్కడే ఏమి? శ్రీశైలంమీద రాళ్లన్నీ లింగమూర్తులే. ఆ కొండే ఒక మహాశివలింగ మనుకోండి.

అక్కడ ఉండే చెంచులే ప్రమథ గణము. అక్కడి చెట్లు కల్పవృక్షాలు. అక్కడ వుండే కుమారులే కుమారస్వాములు. పాతాళగంగ పక్కన పెరిగే రెల్లే కుమారస్వామి పుట్టిన శరవణము. అక్కడ తిరిగే నెమిళ్లే కుమారస్వామి వాహనాలు.

పూర్వము రాజైన పిల్లవాడు ఇప్పు డక్కడ పోతు నెమలిగా పుట్టాడు. వెనక కర్పూర ద్వీపానికి వచ్చిన పడవమీదికి ఎగిరినప్పుడు ఆతడు పూనిన ఆకారమే అచ్చంగా!

అంత గొప్ప నెమలి ఈలోకంలో మును పెప్పుడూ పుట్టలేదు. అక్కడ ఉన్న చెట్లలోకల్లా పెద్దచెట్టు చితారు కొమ్మమీద కూచుంటే దాని తోకఈకలు నేలమీద జీరాడుతుంటవి.

వర్షాకాలంలో మేఘాలు దడదడలాడుతూ ఉరుముతూఉంటే అది ఉత్సాహంతో క్రేంకారంచేస్తూ పురి విప్పి నాట్యం చేస్తుంది. అది చూచి దూరాన పాతాళగంగకు స్నానానికి వచ్చిన శివభక్తులు 'కుమారస్వామి వాహన మదుగో!' అంటూ నేలమీద సాగిలబడి దండాలు పెట్టుతూఉంటారు. వనంలో ఉన్న ఆడ నెమిళ్లన్నీ మోహం పట్టలేక దానికి పాదాక్రాంత మవుతుంటవి. వాటిలో పాత రాణి కూడా ఒకటి.

స్త్రీజాతికి సామాన్యంగా ఉండే రూపవైభవము నెమిలిజాతిలో లేదు. ఆడ నెమిలి తోక చిన్నది. పింఛం విప్పి ఆడనే లేదు. దర్జా అంతా మగ నెమిలిదే!

ఆ మయూరరాజు ఒకనాడు ఆకాశంలో మేఘాలు చూచి ఆనందంతో పింఛం విప్పి నాట్యం చేస్తున్నాడు. సరిగ్గా అప్పుడే ఆకాశాన తొందర తొందరగా హంసల పిండొకటి పోతున్నది.

అందులో ముందు పోతున్న రాజహంసకు మయూరరాజు కనపడ్డాడు. ఆ వైభవము చూసి పరమహంస మురిసిపోయినాడు. చూడ ముచ్చటై కొండనెత్తముమీద వాలినాడు. అతని వెంటనే హంసల పిండంతా దిగి నెత్తంమీద వాలింది.

రాజహంస రెక్కలూ మెడా ఒళ్ళూ అంతా స్వచ్ఛమైన పాలరంగు; ముక్కూ పాదాలుమాత్రము సిందూరంవంటి ఎరుపు. రాజహంసను చూడగానే మయూరరాజుకూ ముచ్చటైనది ఆపేక్ష కలిగింది.

పైన కమ్ముతున్న మబ్బులవంక ముక్కుతో చూపుతూ రాజహంస వాటి బాధ తప్పించుకోడానికి తనతోపాటు మానస సరోవరానికి రమ్మంటున్నట్లు హంసనాదం చేస్తున్నది.

నెమిలికి పాపము హంసభాష అర్థం కాలేదు. పైగా హంస మబ్బువంక చూపడం నెమిలి అపార్థం చేసుకున్నది. ఎవరి ఇష్టా యిష్టాలనుబట్టి వాళ్ళ భావ ఉంటుంది. రెక్కలమీద వర్షపు చినుకు పడితే హంస ఎగరలేదు. దానికి వర్షమంటే భయము. నెమిలికి వర్షధారలంటే ఉత్సాహము!

హంస మేఘాలవంక చూపుతుంటే, 'ఎంత హాయిగా వస్తున్నవో చూడు!' అని అంటున్నదనుకొని నెమలి ఆనందంతో క్రేంకారం సాగించింది పైగా ఆ క్రేంకారము మేఘాలను బాగా వర్షించమని ఆహ్వానం చేస్తున్నట్లున్నది. ఆ ధ్వని శ్రీశైల పర్వతపంక్తి అంతటా ప్రతిధ్వనించి ఆకాశమంటి పైనఉన్న మబ్బులను తూట్లు చేసినట్లుంది. చిటపట చినుకులు సాగినై.

రెక్కలమీద చినుకులు పడగానే రాజహంస గాభరాపడుతూ రెక్కలు విదిలించుకుంటూ హంసనాదంచేస్తూ పైకి లేచింది. దానితోపాటు హంసలపిండంతా లేచింది. వాటిలో కొన్నిటికి ముక్కులూ కాళ్లూ కూడా తెలుపే. కొన్నిటికి ముక్కులూ కాళ్ళూ బూడిదరంగువి, మరికొన్నిటికి నల్లటివి—అన్నిటికి ఒళ్లు తెలుపే.

తనతోకూడా మయూరరాజును రమ్మని అరుస్తూ రాజహంస ఈశాన్యంగా సాగిపోయింది. నెమిలి

★ కర్పూర ద్వీప యాత్ర ★

రాజుకు అర్థం కాకపోయినా వ్యామోహం చేత హంసల పిండు వెంట అదికూడా బయలు దేరింది. దాని వెంట అక్కడి నెమిళ్ళన్నీ బయలు దేరినై.

అయితే హంసలతో పాటు నెమిళ్లు ఎగరగలవా? కాస్తదూరం పోగానే వాటికి ఒళ్లు బరువయింది. అవతలి కొండనెత్తంమీదికి చేరుకోవడమే వాటికి బ్రహ్మప్రళయం ఐనట్లయింది

హంసలు చూపుమేర దాటిపోయినవి. వాటి స్వచ్ఛమైన అందమే ధ్యానించుకొంటూ మయూర రాజు సాటి నెమిళ్లతో రాతిమీదినుంచి రాతిమీదికి ఎగురుకుంటూ పాతాళగంగకు చేరుకున్నాడు.

27

హంసపిండు పోయిపోయి గోదావరి చేరుకున్నది. గోదావరి దాటింది. అక్కడ భక్తులను రక్షించడానికి శ్రీరామభద్రుడు వెలసిన భద్రశైలం చేరుకున్నై. భద్రశైల మన్నా శ్రీశైల మన్నా అర్థం ఒకటే. దానికి దగ్గరగానే శ్రీరామచంద్రమూర్తి సీతాలక్ష్మణులతో చాలాకాలం నివాసంచేసిన పంచవటీ పర్ణశాలా ఉన్నవి.

సీతామహాదేవి అక్కడ ఉండగానే, ఆ తల్లికి పొద్దుపోక, చిలకలను పిలిచి వాటికి రామా రామా అనడం నేర్పింది. అప్పటినుంచే చిలకలకు మన తెలుగుదేశంలో రామచిలక లనే పేరు వచ్చింది—మరే భాషలోనూ ఆ పేరు లేదు తెలుసా!

తర్వాతనే, ఆ సీతమ్మ తల్లినే—రావణాసురుడే - ఎత్తుకుపోతేనే—ఆవిడ ఎటు పోయిందీ తెలియక రాముడు పిచ్చివాడివలె వెదుకుతున్నాడు. అప్పు డక్కడి చిలకలు, "రామా రా, మా రామా రా, మా—" అంటూ రాముణ్ణి రకరకాల అర్థాలతో పిలుస్తూ సీత నెత్తుకుపోయిన దారి చూపినై. మా అంటే సీతా మహాలక్ష్మి అని మీకు తెలుసుగా! అవి చూపిన దారినే పోయి శ్రీరాముడు రావణాసురుణ్ణి చంపి సీతను తెచ్చాడు.

ఈవిధంగా రామచిలకలు తమ తెలుగుపేరు సార్థకం చేసుకొన్నాయి. అందుకనే ఇప్పటికీ రామచిలకలు పంచవటిని పర్ణశాలను భద్రాద్రిని తమ జన్మభూమినివలె ఆపేక్షగా చూచుకుంటై.

పూర్వం కోశాధిపతిగా ఉన్నవాడు ప్రస్తుత మిక్కడ చిలకలరాజైనాడు. అతడు పంచరంగుల రామచిలకగా కళ్లు మిరుమిట్లు కొలిపేట్లుగా ఉన్నాడు. అతని భార్య సాదా రామచిలకగానే పచ్చటి ఒళ్ళూ ఎర్రటి ముక్కుతో ఉండిపోయింది. దాని మెడమీద నల్లటిచార ఒకటి ఉన్నది. వెనక, పాప మది తనకంత ఇష్టం లేకపోయినా, పెనిమిటి మాటకు కట్టుబడి తన నాలుక కోసి రాణీగారికి పంపించింది కాదూ! అప్పుడు నాలుక కోసుకోబోతుంటే చెయ్యి కాస్త వణికి కత్తి మెడకాయకు తగిలి గాటుపడ్డది. ఆ గాటు గుర్తు నల్లగా ఇంతకాలమైనా పోలేదు.

చిలకరాజుకూ రాజహంసకూ ఒకరిని చూస్తే ఒకరికి ఆపేక్ష పుట్టుకువచ్చింది. ఒకటి హంసనాదం చేస్తే ఒకటి రామనాదం చేసింది. ఆ రెండింటిభాషా ఒక్క మూలనాదముయొక్క రెండు రూపాలని వాటి కేం తెలుసు!—ఎంత మంచివయినా పక్షులాయె మరి!

వాటిభాష ఒకదానిదొకటి అర్థంచేసుకోలేకపోయినా ప్రేమచూపుల అంతరార్థం గ్రహించుకున్నవి.

రాజహంస నాదంచేస్తూ ఆకాశమార్గాన బయలు దేరగా చిలుకరాజుకూడా తన చిలకల దండుతో రామదండుతో వలె—వెంట బయలు దేరింది.

చిలకలు కూడా దేశాటనంచేసే జాతివే. ఐనా అవి హంసలు ఎగిరినంత ఎత్తుకు ఎగరనూ లేవు, అంతదూరము పోనూ లేవు. చిలకలు వెనకపడ్డవి.

[ఇంకా వుంది]

మోసపోయిన మొనగాడు

ఎం. యస్. చెన్నూరి

గంట గంటన్నరనించి యెదురు తెన్నులు కాస్తూ, ప్లాట్ ఫారం మీద పడిగాపులు పడుతోన్న ప్రయాణీకులు, అల్లంత దూరాన-రైలుపట్టాలమీద రణగొణధ్వని చేసుకుంటూ, పొగలుకక్కుతూ భూతానికిమల్లే పరుగిడుతోన్న ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ కనిపించేసరికి, కంగారుగా, మూటాముల్లే సర్దుకుని పిలపిలా లేచారు. క్షణంలో రైలు స్టేషన్ చేరుకోవడం, ప్లాట్ ఫారం ప్రయాణీకులతో కిటకిట లాడిపోవడం జరిగిపోయింది.

చోటు కోసం, పెట్టే బేడా కూలీల నెత్తికెక్కించి, అడ్డు తగిలే వాళ్ళని తప్పించుకుంటూ, పెట్టె పెట్టెకీ గంతులేసేవాళ్లూ - పెట్టే బేడా నెత్తి నెట్టుకునే, అడ్డు తగిలే వాళ్ళని తొక్కపెట్టున క్రింద పడదోస్తూ, తమ మనుషుల్ని కేకలేసుకుంటూ, ఆ చివరినించి యీ చివరికి కంగారుగా పరుగులు తీసే వాళ్లూ - ప్లాట్ ఫారంమీద నానా హంగామా పడుతోంటే, రైలు పెట్టెల్లో సుఖాసీనులయిన ప్రయాణీకులు తమాషా చూస్తూ, గేటు దగ్గర కాపలాపెట్టి, యెవర్నీ తమ పెట్టెలో కాలుబెట్టనీకండా శ్రద్ధ తీసుకుంటున్నారు. మరి కొందరు ప్రబుద్ధులు, కాస్త బుర్ర వుపయోగించి, తలుపులు తెరవడానికి వీలు కాకండా పెట్టేబేడా తలుపుల వెనకాల సర్ది, బిఛాణాలు పరుచుకొంటున్నారు.

ప్లాట్ ఫారంమీది ప్రయాణీకులు, విసిగి వేసారి, రెచ్చిపోయి, పంచెలు ఎగ్గట్టి, దట్టీలు బిగించి, పెట్టే బేడా కిటికీల్లోంచి లోపలికి గిరాటేసి, తామూ అమాంతం యెగిరి యెవడి నెత్తినో గంతేసి, మల్లయుద్ధానికి సిద్ధమవుతున్నారు.

ఇహ, నాబోటి 'దద్దమ్మగాళ్లు' సాహసించలేక గుడ్లప్పజెప్పి చూస్తూ నుంచోడంకంటే యేమీ చెయ్యలేని స్థితిలో వున్నారు.

గార్డు విజిలూ - ఇంజన్ కూతా- వొకదాని వెంబడొకటి వినిపించినయ్. రైలు కదలడానికి కొన్ని క్షణాలకంటే ఆట్టే వ్యవధి లేదు. నాకీ బండ్లో ప్రయాణం చేసే యోగం లేదన్న విషయం దృఢం చేసుకుని, నిస్పృహతో అలా చూస్తూ నుంచుండిపోయాను.

నా యెదురుపెట్టెలోని పెద్దమనిషి యింతసేపూ నన్ను గమనిస్తూ వున్నాడల్లే వుంది. నా నిస్సహాయతకి జాలిపడి, నావేపు అదోలా చూచి, తలుపు కొద్దిగా తెరిచి, మరో ప్రాణి కంటబడకుండా లోపలికి రమ్మన్నట్టు తల వూపాడు. ప్రవాహంలో కొట్టుకుపోయే దౌర్భాగ్యుడికి గడ్డిపోచ వూత దొరికినట్టయింది. అతగాడికి కృతజ్ఞత తెలిపి, శరీరాన్ని లోపలికి చేరవేశాను.

"అలా నిరుత్సాహ పడిపోతే యెలా బాబూ! ఎంత కష్టమయిన పనయినా సరే ప్రయత్నించడం మానవధర్మం. జయాపజయాలు మన చేతుల్లో లేవనుకో—"

"నిజమే. కాని, యేంవిటీ సర్కసు ఫీట్లు?"

"ప్రజల్లో సభ్యత లేనప్పుడు యేం చేస్తాం? - మర్యాదస్తులికి కాలం గాదు" బరువుగా నిట్టూర్పు విడిచాడు.

"కూచో బాబూ! - కూచో..." తను పరుచుకున్న పక్కచుట్టని కాస్త మడిచి చోటు చేశాడు. బ్రతుకుజీవుడా అని చతికిలబడ్డాను బల్లమీద.

"ఏవూరెళ్లాలి బాబూ?"

"మద్రాసండి."

"వ్యాపారమా?"

"మరేనండి."

"నేనూ మద్రాసే. కోర్టుపని మీద వెళుతున్నా. రెండు మూడు రోజుల్లో పని పూర్తవొచ్చు."



దొంగవేషాలు

ఫోటో: ఎం. ఫణిభూషణరావు (విజయవాడ)

మోసపోయిన మొనగాడు

"అలాగా?"

*　　*　　*

ఎక్స్‌ప్రెస్ స్పీడుపోసుకుని, 'గీ' పెడుతూ, బాణాసికి మల్లే దూసుకుపోతోంది.

మా సంభాషణ కూడా జోరుగానే సాగిపోతోంది. స్వవిషయాల్లోంచి రాజకీయాల్లోకి - రాజకీయాల్లోంచి సినీ జగత్తులోకీ - సినీ జగత్తులోంచి క్రాస్‌వర్డ్సు ప్రపంచంలోకీ గంతులేస్తోంది.

అతడు మాట్లాడుతోంటే ప్రపంచంలో అతనికి తెలీని విషయమంటూ లేదేమో ననిపించింది. వయసులో పెద్దవాడయినా భావాల్లో నవయువకుడు. అంచేతే అంత శీఘ్రకాలంలోనే మా ఇద్దరి మధ్యా అంత సన్నిహిత మైత్రి యేర్పడగలిగింది.

బండి గూడూరు స్టేషన్ చేరుకుంది. ఇద్దరం బండిదిగి, ఇండియన్ రెఫ్రెష్‌మెంటు రూముకి నడిచాం. కాఫీ పుచ్చుకుందుకు పాంటు జేబులో చెయ్యి వేశాను కడుపులో గతుక్కుమంది. కంగారుగా జేబులు తడుముకోవడం గమనించి- "ఏం బాబూ, ఏవిటి వెతుకుతున్నారు?" అని ఆతురతగా ప్రశ్నించాడతడు. పర్సు పోయిందని చెప్పాను.

"ఏవిటి? పర్సు పోయిందా?" అని, గుడ్లు తేలవేసి నుంచుండిపోయాడు పాపం!

నాతోబాటు అతడూ కాఫీ పుచ్చుకోకుండానే కంపార్టుమెంటుకి నడిచాడు. నా బ్యాగూ, కూచున్న సీటూ, పరిసరాలూ అంతా గాలించేశాం కాని లాభం లేకపోయింది.

"ఏం బాబూ! పర్సులో యేమాత్రం వుంటుందేమిటి?" అని సానుభూతిగా వాకబు చేస్తోంటే యేం చెప్పాలో తెలీక తికమకపడ్డాను.

పర్సులో మహా వుంటే రెండు మూడు రూపాయ లుంటుందేమో! అదృష్టవశాత్తు టికెట్టు కూడా చొక్కా జేబులోనే వుంది. కాని, పర్సులో రెండో మూడో వుంటుందని యెలా చెప్పను? ఉద్యోగార్జనకోసం వెళుతున్నానని చెప్పకోను సిగ్గుపడి వ్యాపారంమీద వెళుతున్నానని బొంకానాయె. అలాంటి

వాడివద్ద రెండో మూడో వుండడమేవిఁటి? - పోయింది యెలాగూ రాదుకదా! రెండో మూడో అని చెప్పి, అనవసరంగా వారిదృష్టిలో నా విలువని తగ్గించుకోవడమెందుకు?—


"ఆఁ - ఏముంటుందిలెండి! ఓ వందా పైచిలుకు. అంతే - అవసరమయినప్పుడు యింటికి వైరిచ్చి టి యం.ఓ. తెప్పించుకోవడం అలవాటు. వూళ్ళు తిరిగేవాళ్ళం. మా దగ్గర పెద్ద మొత్తాలుంటే యింకేమేనా వుందా?— అదయినా యేదో చేతికర్చులిగ్గాను తెచ్చుకున్నాను" అని ఓ అబద్ధం ఆడేశాను.

"అదేవిఁటి బాబూ! వందంటే మాత్రం యీ రోజుల్లో వూరికే వొస్తుందా? అష్టకష్టాలు పడితే తప్ప పచ్చకాయితం కళ్ళక్కానిపించడం లేదు" అని అంటూ, జేబులోంచి పర్సు తీశాడు.

"మీవాళ్ళకి టెలిగ్రాం యివ్వడానికయినా నీవద్ద డబ్బెక్కడిది? యెందుకేనా మంచిది. ఇది నీవద్ద వుంచుకో బాబూ! మరేం అనుకోకు. టి.యం.ఓ. వొస్తే నాకు పంపిద్దువు గాని" అని, ఓ పాతిక రూపాయలు నా చేతిలో పెడుతోంటే, నా కళ్లు గిర్రున తిరిగిపోయాయి.

రైలు ప్రయాణంలో తలవని తలంపుగా పరిచయమైన ఓ అపరిచిత వ్యక్తి నమ్మి నా చేతుల్లో పాతిక రూపాయలు పెడుతున్నాడంటే నా కెందుకో పుచ్చుకునేందుకు భయమేసింది.

"మరేం ఫరవాలేదు. మొహమాటపడకు. కష్టాలు అందరికీ వొస్తాయి. అధైర్యపడితే యెలా? - పుచ్చుకో బాబూ. టి. యం. ఓ. రాగానే నాకు పంపుతావుగా. అడ్రసు రాసిస్తాను" అని అంటూ పాతిక రూపాయలు నా జేబులో పడేసి, ఓ కాయితంలో తన అడ్రసు రాసి నా చేతి కిచ్చాడు.



"పెళ్లిచూపులు" అను తెలుగుప్రహసనమును ప్రదర్శించిన ఆంధ్రవిద్యార్థిబృందము శ్రీ శారదా ప్రాథమికోన్నతపాఠశాల (మాంబళం, మద్రాసు)
(మద్రాసు పోలీసుకమీషనరు శ్రీ యస్. పార్థసారథిఅయ్యంగారు, బి.యే., యం.యల్.గారి అధ్యక్షతను 10-4-54 న జరిగిన పాఠశాల వార్షికోత్సవసందర్భములో) ముఖ్యపాత్ర "అభిధానులు" మధ్యనిల్చున్న డి. యు. యస్. ప్రసాద్.

★ మోసపోయిన మోసగాడు ★

నిజానికి, నిరుద్యోగ సమస్యతో పీక్కు-చస్తూ నిస్సహాయ స్థితిలో వున్న నన్ను, మద్రాసులో ఏదో ఖాళీ వుందనీ, వెంటనే బయలుదేరి రమ్మనీ, ఓ స్నేహితుడు ఉత్తరం రాయగా, రైలు చార్జీలకుగాను, నిజం చెప్పి ఓ పది రూపాయలు పరుపత్యం పుట్టించుకోలేని నాకు, ఓ అపరిచితవ్యక్తి అయాచితంగా పాతిక రూపాయలు బలవంతాన సాయం చేస్తున్నాడంటే, ఇదంతా 'అసత్యం' మహిమేనని తేలిగ్గా అర్థమైపోయింది.

న్యాయంతో సాధించ లేనివి మోసంతో యెంత సులభంగా సాధించగలమో బోధపడింది.

బండి సెంట్రల్ చేరుకోవడం, పరస్పరం సెలవు పుచ్చుకుని, విడిపోవడం జరిగింది. ఇంతలో నా కోసం స్టేషన్ దాకా వొచ్చిన స్నేహితుడు యెదురయ్యాడు. ఇద్దరం యింటిదారిపట్టాం. దార్లో జరిగిందంతా పూసగుచ్చినట్టు వాడితో చెప్పాను.

"అదేంట్రా? అలా కక్కూర్తి పడిపోయావ్? యెవరో అపరిచిత వ్యక్తి ఇస్తే తీసుకోవడమే ఆ డబ్బు వెంటనే పంపించేసెయ్. నీ కావలిస్తే నన్నడగడానికి నామోషేవిటి?" అని చీవాట్లు పెట్టాడు.

ఎలాగూ వారు యిల్లు చేరడానికి, రెండు మూడు రోజు లవుతుంది. అలాగే సోమవారం యం. ఓ. చేస్తాలెమ్మని వాడికి నచ్చజెప్పాను. ఆ డబ్బు అతగాడికి యం. ఓ. చేసేవరకూ నాకు నిద్ర పట్టలేదు.

ఆరోజు ఆఫీసునించి యింటికి రాగానే నాపేర యెక్కణ్ణించో, ఓ వుత్తరం వొచ్చిందని మావాడు వుత్తరం చేతబెట్టాడు.

ఉత్తరం ఆమూలాగ్రం చదివిం తరువాత దాన్ని రాసింది ట్రెయిన్‌లో కనిపించి, సాయం చేసిన పెద్దమనిషే నని అర్థమయింది.

ఆ వుత్తరంలో యిలా వుంది:

"డియర్ ప్రసాద్,

నా జీవితంలో యెంతమందినో మోసంచేశాను. ఎందరి పర్సులో కొట్టేశాను. కాని యెన్నడూ ఇలా మోసపోలేదు. నా జీవితంలో ఇదే మొదటిసారి—బహుశా, ఆఖరి సారికూడాను. నీవు వ్యాపారరీత్యా మద్రాసు వెళుతున్నానంటే నిజమే నని నమ్మాను. తప్పకుండా నీ పర్సులో పెద్ద మొత్తమే ఉంటుం దనుకొన్నాను. నిన్ను మాటల్లో దింపి నీకు తెలీకండా, నీ పర్సు కాస్తా కొట్టేశాను.

పర్సులో వందరూపాయలుందని నీవంటే నిజమేనని నమ్మాను. నీకు సాయంచేస్తున్నట్టు నటిస్తూ పాతిక రూపాయలు నీచేత బెట్టాను.

తీరా, నిన్ను వొదలించుకుని, పర్సు తీసి చూచుకునేవరకూ నీవు చేసిన మోసం గుర్తించలేకపోయాను.

నీ స్నేహితుడు, నీకు రాసిన వుత్తరం, నీ పర్సులో చూచిం తరువాత మనసు స్తిమితపడింది. ఓ నిరుద్యోగికి, ఓ పది రోజులపాటు దిగుల్లేకండా గడిచిపోయేలా సాయపడ్డందుకు నాకు సంతోషంగానే వుంది

గొప్పవాళ్ళ పర్సులు కొట్టేయడమన్నా - పేదలికి సాయపడ్డమన్నా నాకు సరదా.

మరేమీ అనుకోకు?

ఇట్లు

—"పిక్‌పాకెట్ హైదారాన్,"

పోలీసు డిపార్టుమెంటు, ఇంటలిజెంట్ శాఖలో పనిచేస్తోన్న నా మిత్రుడు, వుత్తరం పూర్తిచేసి,—"అమ్మోయ్! పిక్‌పాకెట్ హైదారావే?" - అని అదరిపడ్డాడు.

హైదారావంటే పోలీసుశాఖకే హడల్ కాబోలు!

ఉత్తరం చేరిన నాలుగయిదు రోజులికి యం. ఓ. కూడా తిరిగి వొచ్చేసింది, ఆ యడ్రసులో అలాంటి వ్యక్తి యెవరూ లేరని. ★

మేష్టారు : ఈ క్లాసులో అడ్డగాడిద ఎవడు వుంటే, వాడల్లా లేచి నిల్చోండి.

(చాలాసేపటివరకు క్లాసులో ఎవరూ లేవలేదు. కొద్దిక్షణాలు గడిచాక, సన్నగా గేడివానంలా వున్న కుర్రాడొకడు లేచి నిలబడ్డాడు.)

మేష్టారు : ఏం? నువ్వు అడ్డగాడిదవా?

కుర్రాడు : అది కాదండీ! మీరొక్కరే నిలబడివుంటేనూ, మీకు తోడుగా అయినా వుంటుందని లేచి నిల్చున్నాను. అంతే!



4. చుక్కల మధ్య తోకచుక్క.

అప్పుడప్పుడు ఉన్నట్టుండి ఆకాశంలో ఎక్కడో ఒకచోట తోకచుక్క కనిపిస్తూ ఉంటుంది. తోకచుక్కను చాలమంది చూసే ఉంటారు. కాని సాధారణంగా తోకచుక్కలు ఎప్పుడో గాని మన దృష్టిపథంలోకి రావు. ఇవి వచ్చినప్పుడు ఎవరో ఒక గొప్ప వ్యక్తి చచ్చిపోతాడనీ, అందుచేత ఇవి అపశకునాలనీ కొందరు నమ్ముతారు.


అసలు తోకచుక్క అంటే ఏమిటి? చూట్టానికి నక్షత్రాల పదార్థంతో తయారుచేసిన చీపురుకట్టలాగా కనిపిస్తుంది. కాని అది నిజానికి తోక కలిగిన ఒక పెద్ద ఉల్క. ఉల్కలు మీకందరికీ తెలుసు. అప్పుడప్పుడు ఆకాశంలో అతివేగంగా దూసుకుపోయి చివరికి మాయమయ్యే తెల్లటి పదార్థాలు చూసి మనం "అదుగో నక్షత్రం రాలింది" అనుకుంటాము. దాన్ని నక్షత్రం అనగూడదు, ఉల్క అనాలి.

తోకచుక్క కూడా అటువంటి ఉల్కే. కాని చాలా పెద్దది. సూర్యగోళంనుండి విడివడి అతివేగంగా ఆకాశంలోకి దూసుకుపోతుంది. అలా విడివడి మన కొకసారి కనిపించిన తోకచుక్క మన చూపుమేర దాటిపోయి, తిరిగితిరిగి మళ్ళీ ఎన్నేళ్ళకో మనకి కనిపించుతుంది. కొన్ని తోకచుక్కలు తిరిగి రావడానికి కొన్ని వేలు, లక్షల ఏళ్లు కూడా పట్టవచ్చు. ఇప్పటికి మన సూర్యుడులోంచి ఇటువంటివి 1,20,000 తోకచుక్కలు విడివడ్డాయని శాస్త్రజ్ఞులు అంచనావేశారు.

తోకచుక్క తలభాగంలో ఏదో గట్టి పదార్థమే ఉందనీ, ఈ పదార్థం అతి వేడివల్ల వాయుపదార్థంగా మారిపోయి, తోకలాగ వెనక్కి వ్యాపిస్తుందనీ శాస్త్రజ్ఞులంటారు. ఒక్కొక్కసారి ఒక తోక పోయి ఇంకో తోక వస్తుంది. ఆరు తోకలు మార్చిన తోకచుక్క కూడా ఒకటి ఉందట.

తోకచుక్కలోని గట్టిపదార్థం ఎప్పటికప్పుడు వాయుపదార్థంగా మారిపోతూ ఉంటుంది కనుక ఎప్పటికో అప్పటికి అది పూర్తిగా వాయువుగా మారి అసలు కనిపించకుండా పోవాలిగదా. శాస్త్రజ్ఞులీవిషయంలో ఇంకా ఏమీ సిద్ధాంతం చెయ్యలేదు.

పట్టపగలు ప్రపంచంకేసి, మనుషులకేసి చూస్తుంటే సృష్టి ఎంత విచిత్రమైనదని, అగాధమైనదనీ అనిపిస్తుందో, రాత్రిళ్లు ఆకాశం కేసి చూస్తున్నా అంత విచిత్రంగానూ, అగాధంగానూ సృష్టి కనిపిస్తుంది. ★



శునకజాతిలో మానవలక్షణం

అప్పటికి నాకు బాగా చిన్నతనం. మా తమ్ముడూ నేను కలిసి ఒక కుక్కని పెంచేవాళ్లం. మా అమ్మా, నాన్నా వద్దంటున్నా వినక కుక్కకి రోజూ పాలుపోస్తూ, అన్నంపెడుతూ ఎంతో ప్రేమగా చూసేవాళ్లం. ఆ కుక్క మొదట్లో చాలా చురుగ్గా, హుషారుగా ఎగురుతూ, గెంతుతూ ఉండేది. మేము బళ్ళోకి పోయే టైముకి తనుకూడా మా వెంట బయల్దేరేది. మేముబళ్లో ఉన్నంతసేపూ అదికూడా అక్కడే ఉండి నిద్రపోయి, సాయంత్రం మాతోపాటు ఇంటికివచ్చేది.

ఇలా ఉండగా దానికి ఎలా పుట్టిందో, ఎవరు నేర్పిపెట్టారో, దానంతట దానికే కలిగిందో, ఏమోగాని ఒక దుర్బుద్ధికలిగింది. మాతో రోజూ బడికిరావడం ఇష్టం పోయినట్లుంది. రోజూ బడికివెళ్లడంలోని ఇబ్బందులు మనుషులకైతే తెలుస్తాయి గాని కుక్కకికూడా ఎలా తెలిసిందో ఆశ్చర్యం. అందుచేత ఏంచేసిందంటే, హఠాత్తుగా చెవుడువచ్చినట్లు నటించడం మొదలెట్టింది. మేము బళ్ళోకి వెళ్లేటప్పుడు "జానీ, జానీ" అని పిలిచేవాళ్లం. కాని అది తనకేమీ వినబడనట్లే కాళ్లు బారజాపుకుని పడుకునేది. దగ్గిరికివెళ్లి "జానీ"అని బిగ్గిరిగా అరిచినా నరే తన్ను కాదన్నట్లు కళ్లుమూసుకుని పడుకునేది.

మాకు చాలా విచారం కలిగింది, మేమెంతో ప్రేమగా పెంచే కుక్కకి చెవుడు పట్టుకుందని. చివరికి దానిమానాన దాన్నివదిలేసి మేము బడికి వెళ్లిపోయేవాళ్లం. అది హాయిగా పాలుతాగి అన్నం తిని, రోజంతా పడుకునేది. దాని పద్ధతిచూస్తే, అది ఒక టైంటేబిలు కూడా తయారు చేసుకుని దాని ప్రకారం నడుచుకుంటున్నట్లు మాకు కనిపించింది. రోజుకి పదహారు గంటలు నిద్రపోవడం, ఆరు గంటలు విశ్రాంతి తీసుకోవడం. రెండుగంటలసేపు తిండితినడం.

ఈ టైంటేబిలు మూడునాలుగు రోజులు జయప్రదంగా నడిచింది. మాకు ఏంచేయాలో తోచలేదు.

(రంగస్థలం- కాలేజి హాస్టల్.)

ఒక విద్యార్థి: ఏం బ్రదర్! అస్తమానం నీ నోట్లోనుంచి 'వెధవ' 'వెధవ' అనివినిపిస్తోంది. కొంప తీసి నన్ను కాదుకదా?

రెండో విద్యార్థి: పోరా వెధవ! ఈచుట్టుపట్ల నువ్వుతప్ప, ఎవరూ లేరా?

* * *

అన్నాయ్: ఒరేయ్! కిష్టాయ్. నువ్వొక పెద్ద గాడిద విరా...అన్నట్లు అడ్డగాడిదంటే ఏమిటో తెలుసా?

తమ్మాయ్: ఆ! తెలుసు! గాడిదకి అన్నాయ్.

* * *

"ఏరా! మిత్రమా! నీ పెళ్లి రోజు నీకు మహా ఆనందంగా వుందివుకదూ?"

"ఆనందమా! ఆనంద సార వశ్యమా! ఆ ఆనంద పార వశ్యం పట్టలేక మా ఆవిడికి పంచెలచాపు యిచ్చి, మా మామగారి బుగ్గగిల్లాను కాదుటోయ్!"

చెవుడు పట్టుకుని మత్తుగా, సోమరిగా తయారైందేమో అని మాకు దిగులు పట్టుకుంది. అయితే మా దిగులు ఆట్టేరోజులుండలేదు.

ఎందుకంటే, ఒక చిన్నచిత్రం కనిపెట్టాము. అంతవరకూ నిద్ర పోతూవున్నదల్లా మాకుక్క, తనకి అన్నం తీసుకురావడం ఇట్టే కని పెట్టి లేచి నిలబడేది. అన్నం పళ్లెం తీసుకువస్తున్న అలికిడి ఏమాత్ర మయినా, వెంటనే తోకాడించుతూ ఎదురుచూసేది. ఇదిచూసి మాకు అనుమానం తట్టింది, దీనికి నిజంగా చెవుడురాలేదని, బద్ధకం బలిసి ఊరికే నటిస్తోందనీ. దీని దొంగ చెవుడు వదలగొట్టడం ఎలాగా అని మేము ఆలోచించాము. ఎంత ఆలోచించినా ఏమీతోచలేదు.

చివరికొక మంచి ఉపాయం తట్టింది. మా యింట్లో ఒక మూల ఒక చీకటిగది ఉంది. ఆ గది ఛాయల కెవరూ సాధారణంగా రారు. బయటిశబ్దాలు అక్కడికి వినిపించవు. ఆ గదిలో మాకుక్కని కట్టివేశాము. అన్నం అవీ అక్కడికే తీసుకువెళ్లి నిశ్శబ్దంగా పెట్టే వాళ్లం. నేనూ మా తమ్ముడు ఆ గదిలోకి వచ్చినప్పుడు మాట్లాడుతున్నట్టు నటించేవాళ్లంగాని నిజంగా మాట్లాడే వాళ్లంకాదు. "జానీ!" అని పిలిచినట్టు నోరు తెరిచేవాళ్ళం. కాని నిజంగా పిలిచే వాళ్ళంకాదు, జానీ ఇదిచూసి హడిలిపోయింది, మేము నిజంగా మాట్లాడుతున్నప్పటికీ తనకు వినిపించడంలేదని. దాంతో, తనకు నిజంగా చెవుడుపుట్టినట్లు బెంగ కలిగింది. దాని మనస్సులో భయం మాకు తెలిసి లోపల నవ్వుకున్నాము. తనకు చెవుడు వచ్చిందనే బెంగతో అది తిండీ, నిద్రా మానేసి కళ్ళంబడి నీళ్లుకారుస్తూ మూలపడుకునేది.

రెండుమూడురోజులు ఇలాగే చేశాం. జానీ బెంగతో సగమై పోయింది. అప్పుడు పాపం దాని మీద మాకు జాలికలిగింది. ఒక రోజున నేనూ, మా తమ్ముడూ దాన్ని గొలుసువిప్పి హాల్లోకి నడిపించుకువచ్చాము. బిగ్గరిగా మాట్లాడుకున్నాము. మా మాటలు జానీకి వినిపించాయి. తనకి చెవుడు పోయిందని సంతోషంతో తోకాడిస్తూ, గంతులువేసింది. "జానీ!" అనగానే దగ్గిరికివచ్చింది. "బడికి పోదాంపద" అనగానే దారితీసింది.

ఇక ఆ నాటినుంచీ జానీ చెవుడు వగైరా దొంగవేషాలు వేయడం మానివేసి ఎప్పటిలాగే చురుగ్గా, చలాకీగా తిరగ నారంభించింది.

చూశారా, మా కుక్క దొంగ చెవుడు ఎలా పోగొట్టామో. ఇటువంటి జంతులక్షణాలు మానవ కోటిలో కూడా కనిపించినప్పుడు ఇలాంటిశాస్త్రే చేస్తే రోగం కుదిరి తీరుతుంది.

("పంచ్" లోని కథకు మార్పులతో అనుసరణ: సామగానం సరస్వతీదేవి)

ఆవకాయ సూత్రం

వి. భాగేశ్వరరావు

మండువేసంగి. ఆ చెవిగాడ్పులు ఈ చెవికి కొడ్తున్నాయి. రోహిణీ కార్తెకు రోళ్లు బ్రద్దలయ్యే రోజులు. రోడ్లమీద క్రొత్త ఆవకాయ పెచ్చులు, మామిడిపండ్ల తొక్కలు, ఎంగిలి ఆకులు, అక్కడక్కడ అడ్డగాడిదలు కన్పట్టే కాలం. వేరేకాపురం పెట్టినకోడళ్ళు ఆలస్యంగా ఆవకాయలు పెట్టేరోజులు.

రామక్రిష్ణ ఎం. ఎస్సి! పాసయ్యి మారేజి మంచిదనే రోజులు కనుక తనతో చదువుకున్న శ్యామలను వివాహం చేసుకున్నాడు. శ్యామల బి. ఎస్సి. పాసయింది. రామక్రిష్ణకి పట్టణంలో ఉద్యోగం కాగానే, వేరేకాపురంఅంటేఉపరిసన్యాసమని తెలియక పట్టణంలో ఓయిల్లు తీసుకొని భార్యతో కాపురం పెట్టేడు.

ఎం. ఎస్‌సి. లు, బియస్‌సి. లు అంటే పాసయ్యేరేగాని ఒకరికీ సంసారం దిద్దుకోవడం యిసుమంతైనా తెలీదు పాపం. ఇంతకూ వారితప్పేమీలేదు లెండి. ఆడపిల్లలకు చదువు కావాలీ అంటె ఆంగ్లం నేర్పించి, అంట్లు అంటే ఏమిటో, ఆవకాయఅంటే ఏమిటో తెలియకుండా చేసిన తల్లితండ్రుల్ని అనాలి యింతకు.

ఈనూతన కాపురస్థులు యిరుగుపొరుగువారు ఆవకాయ పెట్టుకోవడం చూసి తామూ ఆవకాయ పెట్టాలనే ఆలోచనలో పడ్డారు. కాని దాని సమాచారమేమి తెలీదు. ఏమైతేనేం, ఏదోవిధంగా మామిడికాయలు సంపాదించి అడ్డదిడ్డంగా కోసి వాట్లో కారం కూరి కుండల్లో కూలేశారు. కుండలు పట్టకపోవడం వల్ల కుండలమీదకూడ పేర్చి, బట్టలు మూశారు.

మరునాడు తెల్లవారకుండా ఆవకాయ చూద్దామని భార్యాభర్తలు తలుపుతీసుకొని గదిలోనికి పోయేటప్పటికి ఏముంది మహాఘోరం! రాత్రి కుండలమీద అడుగు ఎత్తుగా పేర్చిన కాయలు ఇప్పుడు అడుగు లోతునకు పోయాయి. ఇంత ఆప్యాయంగా పెట్టిన ఆవకాయ ఎవరో దొంగిలించారనుకున్నారు.

ఎమ్. ఎస్సీ. ప్యాసయిన రామకృష్ణ వెంటనే పోలీసులకు ఫోను చేసేడు. పోలీసువారు సిద్ధం. “ఏమండీ ఏమిటి హడావిడి? రాత్రి ఆవకాయ ఎత్తుకపోయారా? అహాః మీరు ఎన్నికాయలు పెట్టారో, ఇప్పుడు ఎన్నిఉన్నాయో చూసి ఎన్నిపోయేయో ఓ పత్రం రాసి యివ్వండి” అన్నారు సబ్ యిన్స్పెక్టరుగారు. అంతా లెక్కపెట్టగా, పెట్టినకాయలు పెట్టినట్లేఉన్నాయి. పోలీసువారు అది అంతా తమ ప్రభావం అంటూ, తాము వచ్చే జాడ తెలిసి దొంగ తిరిగి అక్కడ



విహాయస విహారం
ఫొటో: కె. నాగలింగేశ్వరరావు, (ఏలూరు)

"నాన్నా ! నువ్వు ఏవూళ్లో పుట్టావు ?"

"విశాఖపట్నంలో"

"అమ్మ?"

"బెజవాడలో"

"నేను ?"

"కర్నూలులో"

"ఐతే—మరి మనం ముగ్గురు ఒకచోట ఎట్లా చేరాం నాన్నా ?" * * *

"రాత్రి పిడుగులు పడుతున్నప్పుడు విన్నావా?"

"లేదు రా ? రాత్రి పడ్డాయా?"

"పడటమేమిటే? ఆకాశమే విరిగి మీద పడుతున్నదా అన్నంత చప్పుడుఅయితేను !"

"అలాగా ! అలాంటప్పుడు నన్ను లేపలేదేం – నాకు అసలే పిడుగులు పడుతుంటే నిద్ర కూడా పట్టదు."

ఉంచి పోయాడని డబాయించి పోయారు.

"అరే! కాయలన్నీ ఉన్నాయి! నిన్న రాత్రి కుండపైకి ఉన్న కాయలు అప్పుడే తెల్లవారేలోగా లోనకు దించుకొనిపోవడానికి కారణం," అంటూ శ్యామలా రామకృష్ణ లిద్దరు పూర్వం తాము చదివిన పుస్తకాలు తిరగ మరగ వేసి బూజులుదులపటం మొదలుపెట్టారు. చటాలున శ్యామల పరుగున వచ్చి "ఏమండోయ్! తెలిసింది! తెలిసింది! తెలిసింది!" అని కేకలు మొదలు పెట్టింది".

"ఇంకేముంది మనం యీయిల్లు వదిలిపోవాలి" అంటూ కుర్చీలో కూలబడింది. "ఆఁ ఆఁఆఁ" అంటూ కంగారుగా గంతులేస్తున్నారు భర్తగారు. "నిన్న బంగాళాఖాతంలో డిప్రెషన్ కనబడిందట. అందుచేత తుఫాను రావచ్చని రేడియోలో చెప్పేడు." అని శ్యామల తిరిగి మొదలుపెట్టింది. "అలాగే ఆవకాయ కుండల్లో డిప్రెషన్ వచ్చింది. తుఫాను తప్పదు" అంటూ తన పెద్ద చదువుల తెలివిని పెదవుల నుండి విడుదల చేసింది.

ఈలోగా రామకృష్ణ క్రిందా మీదా పడి ఏనాటిదో "ఆర్కిమెడీసు సూత్రం జ్ఞప్తికి రావటం వల్ల "తుఫానుగాదు నీ బుర్ర కాదు" అంటూ సగర్వంగా మొదలు పెట్టాడు. "అసలు అది ఆవకాయ సూత్రం అంటారు" అన్నాడు అధిక బుద్ధిమంతుడు అమితంగా చదువుకోవడంవల్ల.

విభ్రాంతితో "అదేమండి, మీరెల్లాగా రెండు ఆకులు ఎక్కువ చదువుకొన్నారు. రీసెర్చిలా ఉంది చెప్పండి" అంది శ్యామల. అనడమే తడవుగా మొదలు పెట్టాడు రామకృష్ణ. "రాత్రివేళ కుండల నిండా కారం కూరిన కాయలు, కుండల మీదవరకుకూడా కూరేస్తే రాత్రివేళ కుండలు వ్యాకోచించును. అట్లు వ్యాకోచించిన కుండల వైశాల్యము, దొంగలు ఎత్తుకపోయారనుకొనబడు కాయలు ఆక్రమించు దానికి సమానము అని మన ఆర్కిమెడీసు ఏదో చెప్పాడు.

అంటూ దండలు చరుచుకొంటూ ఏదో గ్యాస్ కొట్టాడు రామకృష్ణ. వారి తెలివితేటలు వారే మెచ్చుకోవాలి పాపం. ఇంతకూ అది ఆవకాయ కుండల్లో తుఫానో లేక ఆవకాయసూత్రమో చదువరులకే విశదము.

★




హారిశ్చంద్ర పిక్చర్సవారి హిందీ "ధర్మపత్ని" లో యశోధర కట్జూ.



రౌడీల దుండగానికి గురి అయిన మగువంక సకరుణ నేత్రాలతో చూస్తున్నది
నవయుగవారి "జ్యోతి"లో జి. వరలక్ష్మి, శ్రీరామమూర్తి.

* * *

పెళ్ళయి చాలనాళ్ళయినా ఉమకు ఇంకా సిగ్గువదలలేదు. "జ్యోతి"లో రామచంద్రకాశ్యప, సావిత్రి.



"జ్యోతి" సమీక్ష

నిర్మాతలు: నవయుగ పిక్చర్సు.
డైరెక్షన్: శ్రీధర్, తిలక్.
మాటలు: సుంకర, కొడవటిగంటి కుటుంబరావు.
పాటలు: సుంకర, కొండేపూడి.
మ్యూజిక్: పెండ్యాల.
కామెరా: శ్రీధర్, బి. జె. రెడ్డి.
నటీనటులు: జి. వరలక్ష్మి, శ్రీరామమూర్తి, రామచంద్ర కాశ్యప, సావిత్రి, మిక్కిలినేని, పెరుమాళ్లు, శివరావు, కుటుంబరావు, కుమారి ఉషారాణి, సి. హేమలతాదేవి మున్నగువారు.

చాలాకాలం క్రిందట ప్రారంభమై, అనేకమైన ఒడుదుడుకుల మధ్య నిర్మాణం పూర్తికావించబడిన నవయుగ పిక్చర్సు వారి సాంఘిక చిత్రం "జ్యోతి" ఎట్టకేలకు విడుదలైంది. క్రిందటి నెల 27 వ తేదీన వాహినీలో కొందరు పత్రికా విలేఖరులకు ఈ చిత్రం చూపించింది. ఏడాది, ఏడాదిన్నర క్రిందటే ఈ చిత్రం తయారై, విడుదలై ఉంటే నిర్మాణవ్యయం బాగా తగ్గి ఉండడమే కాక, కథలోని క్రొత్తదనం ప్రజలను బాగా ఆకర్షించగలిగి ఉండేది. ఈలోగా అనేక చిత్రాలు దీనికి కొంత సన్నిహితంగా ఉన్నవి విడుదలవడం జరిగింది.

"జ్యోతి"లో కథావస్తువు చాలా తృప్తికరంగా ఉన్నది. అభ్యుదయకరమైన, ప్రబోధాత్మకమైన కథావస్తువును తీసుకుని సంఘానికి ఉత్తేజం కలిగించే చిత్రం తీయడానికి నిర్మాతలు ప్రయత్నించారు. చాలమంది చేతులు పడకుండా, సమర్థమైన దర్శకత్వంతో తయారయివుంటే "జ్యోతి" ఆదర్శప్రాయమైన చిత్రం అయిఉండేది

జ్యోతి రామయ్య అనే పేద రైతు కుమార్తె ఇంకా అవివాహిత. చదువుకున్నది. నూతన భావాలు కలిగినది ఆస్తి, కులం, పరువు ప్రతిష్ఠలు ఇవి ముఖ్యం కావనీ, ఆత్మవిశ్వాసం కలిగి స్వతంత్రంగా బ్రతకగలగడం కంటె కావలసిందిలేదనీ నమ్ముతుంది. తమ పేదతనాన్ని గురించి ఇంట్లో మిషను పెట్టి బట్టలుకుట్టి తనకూ తండ్రికీ సరిపడిన డబ్బు సంపాదిస్తూ ఉంటుంది. తండ్రి రామయ్య "పరువుపోయినాక బతికేం వచ్చేం" అనే రకం. అతడు మిషను పని మానమని చెప్పి చూస్తాడు జ్యోతి వినదు. పెళ్లి చేసేస్తేనైనా మానుతుందేమోనని, బావమరది గరటయ్య కొడుకైన రంగడికిచ్చి పెళ్లిచేయబోతాడు. రంగడు పట్టి వెకిలీ, వెర్రివెంగళాయి. వాణ్ణి పెళ్ళాడడానికి జ్యోతి సమ్మతించదు. తండ్రి కోపగించి జ్యోతిని ఇల్లు వెళ్ళగొడతాడు. ఆమె మధు అనే పొరుగింటి రైతు యువకుని సహాయంతోను, తనవద్ద రాత్రిళ్లు పాఠాలు చదువుకునే పేదపిల్లల తోడ్పాటుతోనూ వేరే పాక వేసుకుని ఒంటరిగా జీవించనారంభిస్తుంది. తన్ను విడిచి వెళ్ళిందనే కోపంతో తండ్రి ఆమె కుట్టుమిషన్ను పగలగొడతాడు. జ్యోతి చేత్తోనే పగలు బట్టలుకుడుతూ, రాత్రిళ్లు పాఠాలు చెబుతూంటుంది.

ఆ వూళ్ళోనే కనకయ్య అనే ధనవంతుడున్నాడు. అతనికి వాసు అని ఒక కొడుకున్నాడు. అతడు పట్నంలో బి. ఎల్. చదువుతూ సెలవులకు స్వగ్రామంవచ్చి జ్యోతి నడుపుతున్న నైట్ స్కూలు చూస్తాడు. ఈ స్కూలేమీ బాగాలేదని, కొత్తయిల్లు కట్టించి అందులో స్కూలు పెడితే బాగుంటుందనీ జ్యోతితో చెప్పి ఒప్పిస్తాడు. కనకయ్య కొడుకు మాట తీసెయ్యలేక ధనసహాయం చేస్తాడు. కొత్తస్కూలు తయారవుతుంది. స్కూలు జ్యోతికి అప్పగించి వాసు పట్నం వెళ్ళిపోతాడు. కాని కనకయ్యకు తమ ఊళ్లో స్కూలుండడం గిట్టలేదు. దాన్ని నాశనం చెయ్యాలనే దుర్బుద్ధితో ట్రెయినింగు అయిన ఇద్దరు కొత్తపంతుళ్ళను నియమించి జ్యోతిని తప్పుకోమంటాడు. ఆమె స్కూలు నుండి తొలగిపోగానే పిల్లలుకూడా చాల మంది ఆమెతోపాటు వచ్చేస్తారు. ఆమె వారికోరికపై తిరిగి తన పాకలో స్కూలు పెడుతుంది. పెద్ద స్కూలు గొడ్లసావడి అవుతుంది.

వాసు పట్నంనుంచి తిరిగివస్తాడు. తండ్రి అతనితో జ్యోతే స్కూలు నాశనానికి కారణమని చెబుతాడు. వాసు ఆమాటలు నమ్మి, ఊళ్లో బహిరంగ సభ ఏర్పాటుచేసి జ్యోతిని నిందిస్తాడు. జ్యోతి అంటే అభిమానం కలిగిన గ్రామస్థులు, ముఖ్యంగా జ్యోతికి ఇన్నాళ్ళూ అండగా ఉన్న మధు స్కూలు నాశనానికి జ్యోతి కారణం కాదనీ, కనకయ్యేననీ వాదిస్తారు. ఇది తన అవమానంగా భావించి వాసు సభలోంచి వెళ్లిపోతాడు. తనకూ, తనకొడుక్కీ జరిగిన పరాభవానికి కనకయ్య కోపగించి, తనపొలం కౌలుకుతీసుకున్న మధును పొలంవిడిచి పొమ్మంటాడు, మధు పోనంటాడు. మర్నాడు రాత్రి మధును కనకయ్య రౌడీలచేత కొట్టిస్తాడు. ఇంతలో గ్రామస్థులు వచ్చి మధును రక్షించి, కనకయ్యనూ రౌడీలను పట్టుకుని పోలీసుల కప్పగిస్తారు. వాసు తన తండ్రి కుతంత్రం, జ్యోతి ఆదర్శప్రవర్తనా, మధు మంచితనం గ్రహించి పశ్చాత్తాప పడతాడు. అదివరకే పశ్చాత్తప్తుడైఉన్న రామయ్య తన కుమార్తె జ్యోతిని మధుకిచ్చి వివాహం చేస్తాడు. వాసు కట్టించిన స్కూలులోనే జ్యోతి తిరిగి చేరి గ్రామాన్ని తన ఆశయాల కనుగుణంగా నడిపిస్తూంటుంది.

కథలో ఇన్ని పాత్రలున్నా, నిర్దుష్టంగా, సజీవంగా సృష్టించబడిన పాత్ర ఒక్క జ్యోతే. ఆదర్శప్రాయమైనదైనా ఆమె పాత్ర నేలవిడిచి సాముచేసే రకంగా కాక, సహజంగా చిత్రించబడింది. స్త్రీకి తన జీవితం తాను నిర్ణయించుకోవడంలో స్వాతంత్ర్యం ఉండాలని ఆమె నమ్మకం. పట్టుదలతో, మనోనిగ్రహంతో ఆ పెను పరిస్థితులను ఎదుర్కొంటుంది. కాలానికి మరీ ఎదురీదకుండా ఏ సామాన్యస్త్రీ అయినా అందుకోదగిన ఆదర్శాలతో ఆమె తన కాళ్ళపై తాను నిలబడుతుంది

ఈపాత్రముందు మిగతా పాత్రలు పేలవంగా ఉన్నాయి తండ్రి రామయ్య ప్రవర్తన అర్థరహితంగా ఉన్నది. చూస్తూ చూస్తూ ఒక్కగాని ఒక్క కూతురును వెకిలి వెధవకు కట్టబెట్ట జూస్తాడు. కూతురు ఒప్పుకోనందున ఆమెను పశువును తోలినట్టు ఇంట్లోనుంచి తోలేస్తాడు. అవివాహిత అయిన కూతురుపట్ల ఏ తండ్రీ ఇలా ప్రవర్తించడు. అంత రాక్షసంగా ప్రవర్తించిన వాడు మళ్లీ నీరు కారిపోయి, కొంతకాలానికి కూతుర్ని తిరిగి రమ్మంటాడు.

షావుకారు కనకయ్య ఆఖరులో పట్టుబడినప్పుడు అతడు అనేక దుర్మార్గాలు చేసినట్టు జ్యోతి ఆరోపిస్తుంది ఈ ఆరోపణకు ఆధారాలు అంతకుముందు ఏమీ చూపించలేదు. (చిత్రంలో మరికొన్ని అంశాలు



ఆనందావారి ''మేలుకొలుపు''లో జి. వరలక్ష్మి.

ఇలాగే వాచా చెప్పించబడ్డాయి గాని చూపించబడలేదు)

రంగడిపాత్ర రంగంమీదికి వచ్చినప్పుడల్లా చాలా చిరాకు కలుగుతుంది. వినోదం కలిగించని ఈ వెకిలి పాత్రను తీసేస్తే నష్టం లేదు. వాసుభార్యయైన ఉమపాత్ర కథలో అలంకార ప్రాయంగా ఉండే తప్ప, నిర్వహించిన దేమీ లేదు. నూత్న భావాలు కల జ్యోతికి వ్యతిరేకమైన పాత్రగా, పాతభావాలకు ప్రతినిధిగా ఈమెను ఉపయోగిస్తే కథ రక్తికట్టేది. వాసు పాత్రలో కూడా ఔచిత్యం కనిపించలేదు: చదువుకున్నవాడూ, సహృదయుడూ అయినప్పటికీ అతను బహిరంగసభలో జ్యోతిని నీచురాలికిందకట్టి మాట్లాడతాడు. జ్యోతికీ మధుకీ రహస్యసంబంధాన్ని ఊహించే నీచతకు పాల్పడతాడు.


చిత్రం మొదటి సగంలో కథ చాలా మందకొడిగా సాగుతుంది. పాత్రలను ప్రవేశపెట్టడానికి చాలా సేపు పట్టడమే కాక అది 'ఎమెచూరిష్'గా జరిగింది.

ఎన్ని లోపాలున్నా ఒక్క సుగుణం పేర్కొనాలి. మన చిత్రాలతో పోల్చిచూస్తే ఇందులో 'మెలోడ్రామా' చాలా తక్కువ. జ్యోతి స్కూలునుండి తొలగిపోయినప్పుడు పిల్లలంతా ఏడ్చే దృశ్యం లాంటివి కొన్ని 'అతి'గా ఉన్నట్టు కనిపించినా మిగతాచోట్ల అత్యుక్తిదోషం ఎక్కువ కనబడదు. జ్యోతిగా జి. వరలక్ష్మి చాలా సమర్థతతో నటించింది. వాసుగా రామచంద్ర కాశ్యప, మధుగా శ్రీరామమూర్తి బాగా నటించారు. పాటలరచన బాగున్నది. సంగీతం శ్రావ్యంగా ఉన్నది. బేబీరాణి, బేబీ వాణి, చేసిన నాట్యం, పిల్లలు ప్రదర్శించిన ప్రబోధాత్మకమైన గేయనాటిక ఆహ్లాదకరంగా ఉన్నాయి.

చక్కని అభ్యుదయ కథావస్తువుతో, స్త్రీ లోకానికి మార్గదర్శకంగా నిర్మించబడిన ఈ చిత్రం ఆంధ్రులందరూ చూచి ఆనందించదగిన చిత్రం.

అమెరికన్ సైనికుల జీవితం
(From Here To Eternity)

పెర్ల్ హార్బర్ పై జపాన్ దండయాత్రకు ముందు హోవాయ్ దీవులలోని అమెరికన్ బారక్సులో సైనికుల జీవితాన్ని గురించి జేమ్స్. జోన్స రచించిన నవల ఆధారంగా ఈ చిత్రాన్ని కొలంబియా పిక్చర్స్‌వారు నిర్మించారు. గుహ్యమైన ఆ జీవితాన్ని ముఖ్యంగా నాలుగు తరహాల వ్యక్తులను చిత్రించి సాగక భాగాలను వ్యక్తం చెయ్యడం గ్రంథకర్త ఆశయం. అయితే అసలు నవలలో పాత్రలకీ, ఈ చిత్రంలో పాత్రలకీ వ్యత్యాసం ఉన్నదట. అంతే కాదు సైనిక జీవితానికే అక్కడి శిక్షణకూ పూర్తిగా అలవడనివారిని ఎటువంటి చిత్రహింసలకు గురిచేసి లొంగదీస్తారో గ్రంథంలో వివరించబడిన ఘట్టాలు సినిమాలో చేర్చ



గతమాసం కీర్తిశేషులైన మేకప్‌మాన్ మంగయ్యగారు.

అమెరికన్ సైనికుల జీవితం

బడలేదు; సరిగదా విధ్యుక్తధర్మం తెలియక స్వార్థమే పరమాశయంగా పెట్టుకొన్న ఒక కెప్టెన్ ప్రమోషన్ ఎలా సాధించాడో నవలలో వివరించబడితే అతడిచేత పై అధికారులు బలవంతాన రాజీనామా పెట్టించినట్లు సినిమాలో చూపబడింది. సినిమాలో తీసుకురాబడిన మార్పులు యథార్థ పరిస్థితులకు భిన్నంగా ఉండడాన్ని బట్టీ, ఈ చిత్రానికి ఎనిమిది ఎకాడమీ ఎవార్డులు రావడాన్ని బట్టీచూస్తే, అమెరికన్ సైనికుల జీవితాన్ని అత్యంత వాంఛనీయమైనదిగానే చిత్రించడంలోని ఆంతర్యం బోధపడుతుంది. పూర్వపు ఎకాడమీ ఎవార్డులకీ ఇప్పటి ఎవార్డులకీ పోలిక లేదనిపిస్తుంది. చిత్రంలో ఆట్టే కనబడకపోయినా ఫ్రాంక్ సినాట్రా, డోనారీడ్‌లకు ఎవార్డు లివ్వబడ్డాయి. బారక్స్ మనుష్యులలో పాత్రవైవిధ్యం చూపడానికి పనికి వచ్చినా అంత ప్రధానం కాని ఈ పాత్రలకు ఎవార్డు లివ్వబడ్డాయి.

సైనిక జీవితానికి అమాయికంగా అలవడినా పై అధికారుల అధికార దుర్వినియోగానికి గురైన మాజియో (ఫ్రాంక్ సినాట్రా) అర్థంలేని నియమాలను పాటించడంకంటె సైనికునిగా ఉత్తమాదర్శాలతో ఎలా జీవించాలో తెలిసిన ప్రైవేట్ ప్రూవిట్ (మాంట్ గామరి క్లిఫ్ట్), కెప్టెన్ భార్య కరన్ (డిబోరా కెర్) ప్రేమలో పడి ఆమె ఎంత ఉద్బోధించినా ఆఫీసరు హోదా తెచ్చుకోడాని కిష్టపడక సార్జెంట్‌గానే ఉండిపోవడంవల్ల తన దేశానికి సేవ చెయ్యవచ్చుననుకునే సార్జెంట్ వార్డెన్ (బర్ట్ లంకాస్టర్) వీరి పాత్రలను చిత్రించడమే ఈ చిత్రం ప్రధానాశయం. 1953 లో ఉత్తమ చిత్రంగా ఎంచబడింది డైరెక్టర్‌కీ తదితరులకీ మొత్తం ఎనిమిది ఎకాడెమీ ఎవార్డులు వచ్చాయి.

ఈ చిత్రం మొన్న 25 వ తేదీన న్యూ ఎల్ఫిన్‌స్టన్‌లో పత్రికలవారికి చూపబడినది. ★

★ సినిమా వార్తలు ★

విజయావారు "మిస్సమ్మ" అనే సాంఘిక చిత్రాన్ని బహుశా ఈ నెలలో ప్రారంభించనున్నారని తెలుస్తోంది. చక్రపాణిగారు స్క్రిప్టు వ్రాసిన ఈ చిత్రానికి ప్రసాద్ గారు దర్శకత్వం వహిస్తారు. పాటలు నాగేంద్రరావుగారు వ్రాశారు. సంగీతం రాజేశ్వరరావుగారు సమకూరుస్తారు. నాగేశ్వరరావు, ఎన్. టి. రామారావు, ఎస్. వి. రంగారావు, రేలంగి, రమణారెడ్డి, భానుమతి, సావిత్రి, ఋష్యేంద్రమణి మున్నగు ప్రముఖులు నటిస్తారట.

* * *

విక్రమ్ ప్రొడక్షన్స్‌వారి "[illegible] గోపి"లో నాగయ్య, రేలంగి, నరసింహారావు, జి. వర

లక్ష్మి, జమున, ప్రభావతి, మాస్టర్ వెంకటేశ్వర్ మున్నగువారు నటించనున్నారు. సంభాషణలు కొవ్వలి, పాటలు అనిసెట్టి, సంగీతం విశ్వనాథం, రామమూర్తిగార్లు సమకూరుస్తున్నారు. ఆర్టు గంగా; అసోసియేట్ డైరెక్టరు ఇ. ఎస్. ఎన్. మూర్తి; దర్శకత్వం, ఫొటోగ్రఫీ బి. ఎస్. రంగా. స్టూడియో రేవతి.

* * *

నేషనల్ ఆర్ట్ థియేటర్ వారు ద్వితీయ చిత్రంగా తీయదలచిన అల్లూరి సీతారామరాజుకథను ప్రస్తుతం వాయిదా వేసి మరొక సాంఘిక కథ నేదైనా తీయదలచినట్లు తెలుస్తోంది.

* * *

ప్రేమనాథ్ నిర్మించిన "ప్రిజనర్ ఆఫ్ గోల్కొండ" వలెనే సెన్సార్ అధికారుల ఆగ్రహానికి గురిఅయిన మరొక చిత్రం ఫిల్మిస్తాన్ వారి "నాస్తిక్". ఈ చిత్రంలో నాయకుడు మొదట నాస్తికుడై ఉండి తరవాత భగవంతుడిలో విశ్వాసం కలవాడవుతాడు. చివరలో ఆస్తికత్వం జయించినప్పటికీ, ఈ చిత్రం హిందూ ప్రేక్షకులకు ఆగ్రహం కలిగించేదిగా ఉందని సెన్సార్లు భావించి, దాన్ని పూర్తిగా తిరస్కరించారు. ★


చిత్రపరిశ్రమ నిజంగా సార్థక నామం కలిగిన పరిశ్రమ ఇంత చిత్రమైన పరిశ్రమ మరొకటి లేదనిపిస్తుంది. తెరమీద మనంచూసే చిత్రం వేరు; స్టూడియోలో, కొద్ది అడుగుల ఫిల్మ్‌కోసం, రెప్పపాటులో కనిపించి మాయమయ్యే దృశ్యంకోసం గంటలకొద్ది కాలాన్ని వ్యయంచేసి డైరెక్టరు, ఆర్టిస్టులు, టెక్నీషియన్లు నానా యాతనా పడే అనుభవం వేరు. తను అనుకున్నది ఆర్టిస్టులు గ్రహించకపోతే డైరెక్టరు హుంకరిస్తాడు. గంటలతరబడి రంగుపూసుకుని ముఖాలు బిగుసుకుపోతున్న ఆర్టిస్టులు కనీసం లోపలైనా విసుక్కుంటారు. వీళ్లందరిమీదా నిస్సహాయంగా ఉడికి పోతూంటారు టెక్నీషియన్లు.

ఎంతో ఉబలాటంతో సినిమాషూటింగ్ చూడాలని వెళ్ళిన కొత్తవాళ్ళ సంగతి చెప్పనే అక్కర్లేదు. షూటింగ్ అంటే చాలా గ్లామరస్‌గా ఉంటుందనీ, ఇంద్రలోకంలో రంభాదిలో త్తమల నాట్యదృశ్యానికి పోల్చదగిన అమూల్యానుభవ మేదో తగులుతుందనీ ఆశించి వెడతారు. ఒక అరగంటసేపు కాసుక్కూచున్న తరవాత బోధపడుతుంది, సినిమాషూటింగ్ కనీసం చూడాలన్నా ఎంత ఓపిక కావాలో.


ఇంతమంది ఇంతకాలం ఇంత యాతనపడి తీసిన చిత్రం భవితవ్యాన్ని ప్రేక్షకులు విడుదలైన మొదటిరాత్రి తేల్చి వేస్తారు. అయితే 'సక్సెస్' లేకపోతే 'ఫ్లాప్'. వస్తే లక్షలు వస్తాయి. పోతే లక్షలు పోతాయి అందుకే ఇది అక్షరాలా చిత్రపరిశ్రమ.

* * *

ఆరోజు ఆదివారం. అశ్వరాజ్ వారి "అన్నదాత" ఔట్‌డోర్ షూటింగ్ పల్లావరంలో ముమ్మరంగా జరుగుతోంది. చిన్న చిన్న గుట్టల మధ్య ఖాళీ ప్రదేశాన్ని ఎంచుకున్నారు. ఒక గుట్టమీద మసీదు ఉన్నది. మసీదునిండా చాలమంది ముస్లిం యాత్రికులున్నారు. గుట్ట దిగువభాగాన షూటింగ్ జరుగుతోంది. యూనిట్ వారు తమతో తీసుకువచ్చిన నలభై, యాభైమంది కాక ఇంకా ఎందరో వేలంవెర్రిగా చూట్టానికి వచ్చారు. మేము వెళ్ళేసరికి, నాగేశ్వరరావు, అంజలీదేవి ఒక చెట్టుకింద కారులో విశ్రాంతిగా కూర్చున్నారు. వారిద్దర్నీ మరో ప్రపంచపు మనుషుల్ని చూసినట్టు వింతగా చూస్తూ పిల్లలు గుమిగూడారు. డైరెక్టరు వేదాంతం రాఘవయ్యగారు 'షాట్' ఏర్పాట్లు చేయిస్తున్నారు. కామెరామాన్ నాగేశ్వరరావు మసీదు మెట్లమీద కెమెరా ఉంచి ఒక ఆర్చిగుండా లాంగ్ షాట్‌కు సిద్ధమవుతున్నారు. జాతకాల జమిందారు వేషంలో డా|| శివరామకృష్ణయ్య, దేవాలయం పూజారి వేషంలో దొరస్వామి, దివాన్ వేషంలో మహంకాళి వెంకయ్య ఒక 'కోన్'లో కూర్చుని ఉన్నారు. నిర్మాత గోపాలరావుగారు, కవి కృష్ణశర్మగారు కొంచెం దూరంలో దాహార్తులకోసం మజ్జిగ కలుపుతున్నారు. అంతా కోలాహలంగా ఉన్నది. ఎండ అతి తీక్షంగా ఉండడం



అశ్వరాజ వారి "అన్నదాత" ఔట్‌డోర్ షూటింగ్ దృశ్యాలు:
పల్లావరంలో లొకేషన్ దృశ్యం.



కామెరావద్ద నుంచున్న డైరెక్టరు
వేదాంతం రాఘవయ్యగారు.

చేత ప్రతివాడూ స్వేదప్రవాహంలో ఈదులాడుతున్నారు.

శాంత (అంజలీదేవి) శీలాన్ని భర్త (నాగేశ్వరరావు) శంకించి ఆమెను విడిచి వెళ్ళిపోతాడు. అత్తె నెదుర్కొంటూ శాంత చంటిపిల్లతో, ముసలితల్లి (రాజరత్నం) తో వగస్తూ ఉంటుంది. దూరంలో భర్త మాదిరే ఒకరు కన్పిస్తారు. ఆదుర్దాతో శాంత అతనివైపు పరుగెత్తుతుంది. శాంత తల్లి ముసలిది కావడంవల్ల వెనకనుంచి వచ్చే ఒక లారీ క్రిందపడి మరణిస్తుంది. ఆ లారీ జాతకాల పిచ్చిగల జమీందారు గారిది. ఆ జమీందారు గారు దేవాలయం నుంచి 'కార్'లో తిరిగి వస్తూ ముసలి మనిషి మరణం చూసి చింతిస్తాడు. శాంత తల్లిశవం దగ్గిర చతికిలపడి ఏడుస్తూ ఉంటుంది. శవానికి అంత్యక్రియలు చేయించమనీ, దిక్కులేని శాంతను దివాణానికి పంపించమనీ జమీందారు సేవకులను ఆజ్ఞాపిస్తాడు. ఈ దృశ్యం, ఇంకా మరికొన్ని దృశ్యాలు ఆరోజున తీశారు.

ఔట్‌డోర్ షూటింగ్‌లో చాలా




లారీకింద పడి తల్లి మరణించగా ఏడుస్తున్న శాంతను జాతకాల జమీందారు ఓదారుస్తున్నాడు: అంజలీదేవి, డా॥ శివరామకృష్ణయ్య, దొరస్వామి మున్నగువారు.

ఇబ్బందులున్నాయి సూర్యుడు ఉంటే అతి తీక్షణంగా ఉంటాడు లేకపోతే మబ్బులచాటున దాక్కుంటాడు మళ్ళీ ఆయనగారు, బయటికివచ్చేదాకా అంతా ఎదురుచూస్తూ కూచోవాలి "ఆ, వచ్చాడు, వచ్చాడు" అనుకుని, కామెరా రెడీ చేసుకుని 'స్టార్ట్' చేయబోయే సమయానికి మళ్లీ ఇంకో నలమబ్బువచ్చి సూర్యుణ్ణి లాక్కుపోతుంది ఇదీ వరస

గుడ్డిమనిషి లారీకిందపడి మరణించే దృశ్యానికి ఇలానే అంతరాయం వచ్చింది అప్పటికే ఒంటిగంటన్నర దాటింది నెత్తి మాడుతోంది ముఖవైఖరులు మాస్తే అందరికీ ఆకలి దంచివేస్తున్నట్లుంది ఒక్క వేదాంతం రాఘవయ్యగారే ఇటువంటి ఈతిబాధలకు అతీతులవలె కనిపించారు. కాని మబ్బుల పుణ్యమా అని ఎండిపోయింది. లేకపోతే బహుశా షూటింగ్ ఇంకా కొనసాగించే వారేమో.

తరవాత మసీదు ఆవరణలో, మఱ్ఱిచెట్ల చల్లని నీడలలో, ఎటుమాసినా మైళ్లకొద్దీ విస్తరించిన విశాల ప్రకృతి మధ్య భోజనాలు చేస్తుంటే ప్రాణానికి ఎంతహాయిగా ఉందో చెప్పలేను. (ఎస్సార్)



భోజనాలదగ్గిర అంజలీదేవి, నిర్మాత కె. గోపాలరావు, వేదాంతం రాఘవయ్య, నాగేశ్వరరావు (టోపీతో), సి. సీతారాం (పూర్ణాపిక్చర్సు) మున్నగువారు.

★ పిలవని పేరంటం ★

(11-వ పేజీ తరువాయి)

పురాణం ఎత్తుకొని సోది చెబుతుంది. పోనీ అవిడన్నా కాఫీ తాగుతుందా ? ఆచార మంటుందో ఏమో ... ? వితంతువు కదా ఏమంటుం దేమో?

ఇక ఉండబట్టలేక, "కాస్త కాఫీ తాగుతారా? బామ్మగారూ!" అని అడిగింది.

"ఇస్తే వద్దంటానా? నా కలాంటి వెర్రి లేంలేవే తల్లీ! ఇస్తే వద్దనడం నా కీజన్మలో చాతగాదు. కాస్త పంచదార చురుగ్గా తగిలితే ఆ కాఫీ దోషం పూర్తిగా పోతుంది."

కాంతారాణి నవ్వుకొంటూ లోపలికి పారితీసింది. ఇప్పుడు మాట్లాడేందు కెవరూ లేకపోవడంతో నే నోట్లో నే గొణుక్కోవడం మొదలు పెట్టింది. ఆ మాట్లాడే దేమిటో పాలిక చివర్నుంచి, ఆ పలుకు లెలా తెగి పడి పోతున్నాయో, ఆవిడకే అర్థంగాదు.

"ఏమిటండో మామ్మగారూ! అప్పుడే గొణుగుడు మొదలు పెట్టారూ? ఏం జరిగిందేమిటి?" - అంది సుబ్బలక్ష్మి వంటింట్లోంచి సావిట్లోకి అడుగు పెడుతూ.

"గొణుగుడు లేంగాని ... అమ్మాయీ ! రాజారావు నీతో అచ్చటగా ముచ్చటగా ఉంటున్నాడా? నీతో సరసంగా మాట్లాడుతాడా? తోడికోడలు బాగా చూస్తోందా? .. ఏదో పెద్దదాన్ని అడిగానంటే, నీ మంచికోసమే, అనుకో!"

సుబ్బలక్ష్మికి మనసు పట్టలేనంత నవ్వొచ్చింది. ఈ అడగడంలో అంతరార్థమేమిటి? కడుపులో ఎలాంటి ఉద్దేశ్యం పెట్టుకొని అడిగినట్టు? తనేమైనాఅంటే, అది కాంతారాణి చెవుల్లో ఊదడానికా? ఏమో? రత్తమ్మ ఎలాంటి హృదయ వేదనతో అందో తనకి నీడగా జాడగా కనిపిస్తోంది. ఇలాంటి మూర్ఖమ్మన్యులకి పెడసరంగా నే సమాధానం చెప్పాలి.

పెద్దవాళ్లమంటే పిచ్చిలో ఇదో రకం! ఏదో 'ఔ' నూ, కాదంటే తీరిపోయి. . కాని సుబ్బలక్ష్మిమాత్రం, "ఆ అలాగుటండీ! నాకు తెలిసేతెలీదు తోడికోడలు నన్ను బాగా చూడాలని! ఇక మాఆయనన్నారూ? మీ రెరగ రేమిటి? ఒక అచ్చటా ముచ్చటా? ఒక సినిమావా ? ఓ నాటకమా ? రోజూ గదిలో కీచులాటే" -

"నేననుకొంటూ నేవున్నాను ఈకాంతారాణి అంతకంటె ఉద్ధరిస్తుందనుకున్నానుటే చిట్టితల్లీ! ఇంకా నువ్వు చిన్న పిల్లవి. అమాయకురాల్ని చేసి ఆడిస్తోందన్న మాట!...మీ అమ్మనీ నాన్ననీ నే బాగా ఎరుగుదున్నే! అందుకే ఈ తాపత్రయం పడుతున్నానే నీకోసం! ఐతే, ఎందు కిక్కడుండటం? వేరే కాపురం పెట్టుకోపోయారూ? వేరే వుంటే ఈపీడ వదుల్తుందిగాదుటే"

"అలాగే ఆలోచిస్తున్నాం త్వరలో ఇక్కణ్ణుంచి దయచేస్తే నే గాని వదల్దు... నేనెంత చెప్పినా, మీ మనవడు వింటారా? మీరే ఆకాస్త ఉపకారం చేసిపోండి"

"అతురాలా ఉన్న మాటన్నావే అమ్మాయీ ! నా కిలాంటి విషయాల్లో చెప్పక్కర్లేదే తల్లీ! వెళ్తూ, వెళ్తూ ఆమాత్రం ఉపకారం చేయలేనూ?" అంది.

* * *

"ఐతే అవి డెందు కొచ్చినట్టూ? ఏంపని మీద? ఏంఅవసరం?"

రాజారావు గుక్క తిప్పుకోకుండా అన్నాడు.

"పోనీరా! ఏదో పెద్దముండ! ఓమాటు చూచిపోవడానికి వచ్చి ఉంటుంది! చిన్నప్పటి చనువుబట్టి ఏదో చుట్టం చూపుగా వచ్చింది! మరో రొండురోజులుండి వెళ్ళిపోతుంది" - అన్నాడు రామరాజు ఆమె రాకలో గొప్ప విశేషం లేదన్నట్టు, ఏం ప్రమాదం లేదన్నట్టు.

"అలా వెళ్లిపోతే విచిత్ర మేదు. నిక్షేపం లాంటి కొంపలో నిప్పెట్టాలని చూస్తోంది.

జూనియర్ డాక్టర్: కొత్తగా వచ్చిన రోగి కేసు చిత్రంగా వుందండీ! తను ఒకణ్ణి కాదు - యిద్ద రంటాడు.

సీనియర్ డాక్టరు: ఏం సలహా యిచ్చారు?

జూ. డా. . ఏమీ తోచ లేదండి.

సీ. డా : దాని కేముందీ; రెండో వాణ్ణి వెంటపడి తరిమెయ్యమని ఆరోగికే చెప్పండి!

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు ఈ క్రింది అంశాలను గమనించ ప్రార్థన.

ప్రచురించని వానిని త్రిప్పిపంపగోరే వారు బుక్ పోస్టుకు అవసరమైన స్టాంపులను, రచనలూ, చిత్రాలూ, ఫొటోలతోనే చేర్చిపంపాలి

బుక్ పోస్టుకు అణా స్టాంపుకు తక్కువ కాకుండా పంపాలి.

రచనలను కాయితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిపంపాలి.

ఫొటోలు కనీసం కార్డు సైజులో వుండాలి. నెగటివ్ లు స్వీకరించబడవు.

చిత్రాలు ఇండియన్ ఇంకుతో వేసిపంపాలి రంగుల చిత్రాలు స్వీకరించబడవు.

ప్రచురణ విషయాన్ని వెంటనే తెలియచెయ్యడం కష్టం.

నిరాకరించబడిన రచనలను త్రిప్పి పంపడానికి మాకు కనీసం ఒక మాసమైనా వ్యవధి అవసరం. ఫొటోలు, చిత్రాల విషయంలో యింకా ఎక్కువ వ్యవధి కావలసివుంటుంది.

ప్రచురించే వానిని గురించి ప్రచురించే ముందు మాత్రమే తెలియపరచగలము.

మాకు పంపిన రచనలను, ఫొటోలను, చిత్రాలను గురించి మా కార్యాలయం నుంచి ఎట్టిదైన సమాచారమూ అందనిదే, వాటి ప్రతులను యితర పత్రికలకు పంపవద్దని ప్రార్థన.

రచయితలూ, చిత్రకారులూ, సహృదయంతో సహకరించగలరని విశ్వసిస్తున్నాము.

—సంపాదకుడు.

తెల్లవారుఝామున మూడు గంటలప్పుడు డాక్టరుగారింట్లో టెలిఫోన్ మోగింది. మంచి నిద్రలో వున్న డాక్టరుగారు మెలకువ తెచ్చుకొని లేచివచ్చి రిసీవర్ ఎత్తి చెవులో పెట్టుకొన్నాడు.

"డాక్టరుగారూ! నిద్రపట్టటం లేదండీ" అని ఒక గొంతుక ఆయన చెవుల్లో గొణిగింది.

"అల్లాగా! అయితే టెలిఫోన్ అలాగే పట్టుకునివుండండి; - జోలపాట పాడతాను!"

తంపులమారి! ఇక్కడి వక్కడా, అక్కడి విక్కడా చేరేసి .. వాళ్లకీ వీళ్లకీమధ్య రాయబారం నడిపి తగూలాడుకుంటే చూడాలని ఏడుస్తోంది "ఇలాంటి వాళ్లని మెడబట్టుకు గెంటెయ్యాలి" - సుబ్బలక్ష్మి రాజారావు మాటల్ని అందుకొంటూ, "వచ్చిన మొదట్లోనే మమ్మల్ని విడిపొమ్మని సలహా యిచ్చింది. ఈ రెండుమూడు రోజుల్లోనే ఎంత నిప్పు రాజబెట్టిందనుకొంటున్నారు? కాంతక్కయ్యతో, తియ్యగా మాట్లాడుతూ, మీ ఆయన ఎప్పుడూ ఆ సుబ్బలక్ష్మి మీదే కళ్ళు పారేసి చూస్తాడేవే అందిట!"

ఈమాటలకి కాంతారాణి, రామరాజు పగలబడి నవ్వుకున్నారు

"ఈవిడతో హాస్య కాలక్షేపం బాగానే వుందే! ఇదివరలో ఇంత సందడీ వడీ లేదు. ఎప్పుడూ మందకొడిగా ఉండేది! రత్తమ్మగారొచ్చి మనలో చైతన్యాన్ని మేల్కొల్పారు"

ఈ నవ్వులకీ, మాటలకీ రాజారావు వళ్లు మండుతోంది

"ఇంకా నయం! ఈవిడ మాటలు వింటే కొంపలు గుండమౌతాయి. నిన్న రాత్రి చాటుగా పిలిచి, సుబ్బలక్ష్మికి ఈయింట్లో ఉండడం ఇష్టం లేదుట! వేరే ఉండాలని ఉందిట! అందుకని ఈవిడ రాయబారం నడుపుతోందిట!. ఆమయిన్ని నాలుగు చీవాట్లు వేద్దామనుకొన్నా" -

"అంతదాకా వచ్చిందా ఈవిడతతంగం?"

"ఇదేనేమిటి! ఇలాంటివి లక్షలు! ... ఎందుకూ? ఎవళ్లదగ్గర వాళ్ల మాటలాడి నెగ్గదామని చూస్తోందండీ"

సుబ్బలక్ష్మి మాటలకి కొరకొరలాడుతూ, "ఏదీ ఎక్కడుంది? పిలువూ" అన్నాడు రాజారావు

"ఏరోయ్ రాజూ! అనవసరంగా ఆవిడ మీద చెయ్యి చేసుకోకు ... ఎందుకొచ్చిన అప్రతిష్ఠ" -

"లోపల గుర్రుపెట్టి నిద్ర పోతోంది" -

"బాగా మదించింది తినీ .." రాజారావు లోపలికి వెళ్ళాడు

ఇవతల రామరాజూ, కాంతారాణీ, సుబ్బలక్ష్మీ ఊపిరి బిగబట్టుకూర్చున్నారు. కాబోయే సంఘటన ఊహించుకొంటూ, వచ్చేనవ్వు నాపుకొంటూ.

రాజారావు అన్నంతపనీ చేశాడు.

ఇవతలికి తీసుకొచ్చి, "ఏం రత్తమ్మగారూ! కడుపునిండా తిని కళ్ళనిండా నిద్రపోయారా?. ఐతే, ఇక్కడికి మీరేం పనిమీద వచ్చినట్టు?"

రత్తమ్మగారు ఆవలిస్తూనే, సగం కునికిపాట్లు పడుతూ జోగుతూ,

"ఉండరా రాజూ! శుభ్రమైన నిద్ర చెడగొట్టేశావు. అయ్యో! రామ! పెద్దముండనిలా కష్టపెడితే ఎట్లారా! రేపు నీ కొడుకు నెత్తుకొని, ఆడించాలా? ఎందుకొచ్చావంటావా? మిమ్మల్ని చూసి పోవడానికి! అయ్యోరాత! లేకపోతే నేనెందుకురా ఇక్కడికి రావడం?" -

రత్తమ్మ కిప్పటికి, రాజారావు కళ్ళలోంచి చూస్తే వేడియావులికి నెమ్మదిగా నిద్ర తెల్లవారింది

"ఐతే నువ్వొచ్చి ఉద్ధరించేదేమిటిక్కడ? వాళ్ళకీ వీళ్ళకీ తంపులు పెట్టడానికా? చిన్నప్పట్నుంచీ నీ పాడుబుద్ధి పోనిచ్చుకున్నావా? వచ్చి, రెండుమూడురోజులైందో లేదో అప్పుడే నిక్షేపంలాంటి సంసారంలో నిప్పులు పొయ్యడానికి చూస్తున్నావా?"

"అయ్యోకర్మ!. చూశారా! చూశారా? న్యాయంలేదూ? దేవుడులేడూ? వీడి పొగరు పొగబెట్ట! ముప్పయ్యేళ్లు అగ్నిహోత్రంలో బతికినదాన్ని. నన్నేలాంటి మాటలంటున్నాడో! పురుగులుబట్టి చస్తారు! మీ సంసారాలకి నేనేం పీడనయ్యాన్రా!"

"నువ్వుచేసిందేమిటి? నిన్నరాత్రి పిలిచి విడిపొండని చెపుతావా?"

"అందులో తప్పేవుంది? ఇంతకంటె మహాకబుర్లు చెప్పినవాళ్లే విడిపొయ్యారు! అన్నదమ్ములైనందుకు విడిపోవాల్సిందేరా! పొత్తు కుదరకపోతే, ఏంచేస్తారు?...చిన్నప్పట్నుంచీ ఎంత గౌరవంగా బతికాను! ఆయనున్నంతకాలం పల్లెత్తుమాటనిపించుకున్నానా? . నాకేం భయమా? ఎదుటగుండానే అంటాను! నీపెళ్లాం ఓసబ్బు . దేవతలికి పంచాంగం చెబుతుంది... పెళ్ళాం మాట వినేవాడికి, అమృతమైనా చేదేనట" -

"ఇక్కడ మీ రొక్షణం ఉండడానికి వీల్లేదు. తక్షణం వెళ్ళిపోవాల్సిందే"

"వెళ్లక ఇక్కడ కాపురం చేస్తాననుకున్నావురా?" -

రామరాజు పర్సుతీసి, "ఇదిగోండి! బామ్మగారూ! రైలు ఖర్చులకుంచండి" అని ఐదురూపాయలనోటు అందించాడు

"నెయ్యేళ్లు వర్ధిల్లురా తండ్రి వర్ధిల్లు! ఈ వెర్రి రత్తమ్మని మర్చిపోకు" -

"రత్తమ్మ మూటా, పాత ట్రంకూ పట్టుకుని గుమ్మం దిగింది.

రాజారావుకళ్ళల్లో నిప్పులు చెరుగుతూ, "ఐదురూపాయ లెందుకురా దానికివ్వడం? మతిలేకపోతేగాని! ఇలాంటి చీడపురుగుల్ని నలిపి పారెయ్యాలి" -

సుబ్బలక్ష్మి కాంతారాణీ బరువుగా ఓ నిట్టూర్పు విడిచారు.

★

★ కుర్చీలో కూనిరాగం ★

(4-వ పేజీ తరువాయి)

కనుమలు అంతా పొగాకు తోటలుగా చేయడం, రెండు విశాఖపట్టానికి మంచి నీళ్ళ సముద్రం భీమునిపట్నానికి పాల సముద్రం తీసుకురావడం ఎవరూ ప్రణాళికలు వెయ్యకుండానే పొగాకు కంపెనీల ధర్మమా అని ఆంధ్రదేశంలో పొగాకు పంటే భారీ పంట అయి కూర్చొంది ఆమధ్య ఎప్పుడో భీమునిపట్నానికి ప్రభుత్వం ఆఫీసులు తెస్తామని విశ్వనాథం గారు జనాంతికంగా గొణిగేరు విశాఖపట్నానికి వేసవి రాజధాని తెచ్చారు బాగానే ఉంది. వేసవి రాజధానికన్నా ముఖ్యంగా విశాఖపట్నానికి కావలసినది మంచినీళు చెన్నపట్నంలో పదవులలో లేనప్పుడు మరే రాజకీయ వ్యవహారాలలో బిజీగా ఉండనప్పుడు విశాఖపట్నం షైర్ మన్ గా విశ్వనాథంగారు చాలాకాలం ఉన్నారు కనుక ఆఊరికి నీరు ఎంతముఖ్యంగా అవసరమో చెప్పక్కర్లేదు గిరీశంగారు చెప్పినట్టు మంచినీళ్ళ సముద్రం తెచ్చినా తేకపోయినా "ఎప్పుడు నెడతెగక పారు" వాటర్ సప్లయి ఏర్పాటు చేస్తే అదే పది

★ కాలక్షేపం ★

(3-వ పేజీ తరువాయి)

ఉంది. లోకుల కది వినియోగపడుట లేదని గాని, సలాము సాహెబుగారి ద్రవ్యంతో లోకులకు ఋణ ప్రదానాలు జరుగుట లేదని గాని వాదించలేము కాబట్టి ఆయన ద్రవ్యం లోక సంగ్రహార్థం బ్యాంకుద్వారా వినియోగపడుతూనే ఉంది వారి ద్రవ్యం సర్వమైన వ్యాపారరంగంలో అనేక వృత్తులకూ పరిశ్రమలకూ కొంగు బంగారమువలె, పండిన పెరటి కల్పకమువలె, దొడ్డికట్టిన వేల్పుగిడ్డి వలె, కాలకులనున్న తంగేటి జున్నువలె అక్కరకు వస్తోంది దేశంలో రకరకాల వస్తువులను ఉత్పత్తి చేసేవారికీ, పలురకాల పంటలు పండించేవారికీ, బ్యాంకువారు అప్పులిస్తారు అందువల ప్రజలకు కావలసిన పంట ఉత్పత్తి కాగలదు ప్రజలకు కావలసిన వస్తువులు ఉత్పత్తి కాగలవు కనుక, బ్యాంకులోనుంచి తియ్యకుండా స్థిరంగా సలాం సాహెబ్‌గారు తమ నగ డిపాజిట్లను ఉంచడమే వారు లోకానికి మేలొనర్చడం — అటు ఉత్తమ గుణ సద్గుణ లక్షణముల వడి పెక్కుగా డిపాజిట్లుగల బ్యాంకు యీ మహాత్ముని శంకుడని మెచ్చుకోవచ్చు

అయితే, తాను అనుభవించని ద్రవ్యం వినియోగం అయినట్లుగా నిర్ణయించడానికి వీలులేదు శాస్త్ర పరిశోధనలో కృషి చేసేటటువంటి మహాకోవిదుడు అనేక నూతన విషయాలను అనేక వింత శక్తులను కనిపెట్టగలడు కాని ఆ శాస్త్ర రహస్యములను ఎవరికీ బోధించకుండా దాచియుంచినట్లయితే అటువంటివాడు బ్రహ్మరాక్షసియైపుట్టగలడు. ఆ విద్యారహస్యము లోకసంగ్రహార్థం వినియోగించకపోయినట్లయితే, లోకానికి గాని, మరి కొందరు శిష్యులకు గాని వెల్లడించకపోయినట్లయితే, అటువంటవాడు శాస్త్రలోభి - విద్యాలోభి అంతకంటె ప్రమాదకరమైన మనిషి యింకొకడు ఉండడు. తన విద్యను ఇంకొకడు నేర్చుకొంటే, ఇంకొకడు తన జ్ఞానంలో భాగం పంచుకొంటే సహించలేనివానిని లోకం సహింపదు విద్యా ధనమును యితరులకు బోధించినకొద్దీ యితరులకు పంచి పెటినకొద్దీ, పంచి పెట్టనవాని విద్య అటువంటి బోధనాసాకంవల్ల వృద్ధిఅవుతూంటుంది ఆ మాట నిజమే కాని, తానుకనిపెట్టిన యంత్రతంత్ర మంత్రరహస్యములను యితరులకు బోధించుటవల్ల యితరులు ఆ శాస్త్రవిషయములను యింకా మథించి యింకా పరిశోధించవచ్చు. అందువల్ల ఆ విద్య వృద్ధియై వడ్డీకివడ్డీ పెరిగినటుగా పెరుగుతుంది ఈ గోజన అమెరికావారికి తెలిసినన్ని ఆటంబాంబు రహస్యాలు యింకెవ్వరికీ తెలియవని వారి అహంభావం ఈ ఆటంబాంబు పాండిత్యం తమకు ఉండడంవల్లనే ప్రపంచం అంతా తమకు గజగజలాడుతోంది అంటె నిజమో అనిజమో జగమెరుంగు అందువల్లనె అనేక దేశాలు వారి చుట్టూచేరి భజన చేస్తున్నవనే విషయం మనం తర్జన భర్జన చేయనక్కర లేదు కాని, జగమును గజగజలాడిస్తున్న బ్రహ్మరాక్షసి ప్రతిని భ్రమించడం; అటం బాంబు రహస్యములయందే సదా రమించడం; అందులో అందరికంటె మించడం; చూస్తే, లోకకంటక, ప్రపంచ విదారక, జగజ్జనని గర్భనిర్భేదక ఉదజనిబాంబులను ప్రయోగించడంమాత్రై, రాడుసంగానే ఉంది ప్రపంచబ్యాంకు అనే అంతర్జాతీయ బ్యాంకును ఏర్పాటు చేసిన అమెరికా వారు, అణుశక్తవిద్యా ధనమునుకూడా సర్వలోక సంగ్రహార్థమై వినియోగపడేటట్లుగా ఒక అంతర్జాతీయ శాస్త్రవేత్తల పరిషత్తుకు నివేదించడం ఉత్తమం. అణుశక్తి రహస్యాలను దాచిఉంచే అంతర్జాతీయశాస్త్ర విజ్ఞాన బ్యాంకును వారు ఏర్పాటుచేస్తే ఆ విద్యా ధనం లోకవినాశకరం కాదు అసురులు కావలసిన అమెరికావారు అసురులు కారు. అణుశక్తిని అవిరళంగా అన్ని దేశాల పండితులకు దానం చేస్యాలి మానవకోటియొక్క సౌఖ్యాభివృద్ధికి వినియోగించ చక్కగా అనుభవించాలి ఈ రెండూ చెయ్యకపోతే, యీ అణుశక్తి రహస్యం అనేది లోకనాశన హేతు వవుతుంది ★

కుర్చీలో కూనిరాగం

వేల (వేసవిరాజధానుల) ను కొంటూ ఉ అక్కడివాళ్ళు!

*　　*　　*

వేసవిరాజధానిలో మద్యనిషేధంగురించి ఇటో అటో తేలిపోతుందట ఈలోగా కాంగ్రెసు పెద్దల్కు ఎలుగెత్తి, ఇంగ్లీషులో చెప్పినట్టు ఇళ్ళ కప్పులమీంచి "నిషేధం ఉండాలి! ఉండాలి! ఉండాలి!" అని అభిభాషిస్తున్నారు. ఉద్ఘాటిస్తున్నారు. గాని మద్యనిషేధంమీద యాటంబాంబు లాంటిది పడ్డది ఈ వార్త చిత్తగించండి

"టోకియో, ఏప్రెలు 22—1945 లో హిరోషిమాలో యాటంబాంబు ప్రేల్చినప్పుడు రేడియో ధార్మికశక్తి ప్రసారితమై తీవ్రంగా దెబ్బతిన్న జాపనీయులలో ముగ్గురు జీవితంపై నిరాశచెంది ఆల్కహోల్ మితిమీరి సేవించగావారివ్యాధి క్రమక్రమేణా తగ్గినటు జాపనీస్ డాక్టర్ మిచియో యనమొటో నేడు యిక్కడ వెల్లడించాడు. రేడియో ధార్మికశక్తి తెచ్చే వ్యాధులన్నింటిని ఆల్కహోలు నిర్మూలించగలదని ఇందువల్ల విశ్వసించ వచ్చునట"

చూశారా మరి! పాశుపతాస్త్రాలు, బ్రహ్మాస్త్రాలు, నారాయణాస్త్రాలు మొదలైన వి ప్రయోగించాక, లోకాలు తల్లడిల్లిపోతూ ఉంటే మన దేవతలు ఆ అస్త్రాలకి విరుగుడు కనిపెట్టడానికే 'సుర' కనిపెట్టి ఉంటారు ప్రస్తుత అంతర్జాతీయ జాతీయ కష్టకిష్ట పరిస్థితులలో ఇండియా యాటం బాంబులని తయారు చేసుకోలేకపోతే పోయిందిగాని యాటం వ్యాధులకి విరుగుణ్ణి నిషేధించడం ఏంబాగుంది అయితే ఒకటిలెండి-యాటం బాంబుల్నికూడా నిషేధించాలని మనం అంటున్నాం కనుక దానివల్ల వచ్చే వ్యాధుల విరుగుణ్ణి కూడా నిషేధించాలంటాం అంటారు మనవాళ్ళు! అమెరికావాళ్ళు ఎలాగా ఆటంబాంబుని అంతకంటె ఘనమైన హైడ్రోజన్ బాంబుల్ని చెయ్యడం మానరుకాబట్టి వాటవల్ల వచ్చే సాధక బాధకాలకి మనం విరుగుడు తయారు చేసుకోడం మంచిదేమో పెద్దలు ఆలోచించడం మంచిది ★

ఊయ్యాలలో తుఫాను

(9-వ పేజీ తరువాయి)


నిద్దర్లో భయపడ్డావా నాన్నా!
భయం లదు బబ్బోరాక నాన్న
(పాడుతూ)
ఉయ్యాలా జంపాలా
ఊరుకోరబాలా
ఏడిస్తే నిన్నెవ్వా
రెత్తూకొనువారూ.
కొంపల రెండటవతుమా
కోనేరొకటుంది
కోనె రావలిగట్టున
కొమ్మలచెట్టుంది
కొమ్మలపై కూర్చున్నవి
కోయిలలెన్నో
ఒక కొమ్మకు వేలాడే
ఉయ్యాలొకటుంది.
గాలికి చెట్టూగేనూ
పూలూ కురిసేనూ
కొమ్మలపై ఉయ్యాలను
ఊపును చిరుగాలీ ॥ఉయ్యాలా॥ ★

విజ్ఞానవీధులు

"డాక్టర్"

183. భూమి వర్తుల మార్గంలో తిరిగితే?

"భూమి సూర్యుని చుట్టూ వృత్తమార్గములో కాక దీర్ఘవృత్తములో తిరుగుతున్నదంటారు. ఒకవేళ వృత్తమార్గములోనే తిరుగునట్లు సృష్టిలో ఏర్పాటు ఉండిన ఋతువులలో ఎట్టి మార్పులు వచ్చును?" అని ఏలూరు నుంచి బి. హరిహరనాగ గారు అడుగుతున్నారు.



ఒక దారపు గండు కొసల్ని 'అ' 'ఆ' అనే బిందువులదగ్గర కట్టవేసినట్టు నొక్కిపెట్టి, ఒక పెన్సిలుతో, ఆధారము 'అ ఇ ఆ' అన్న గీతలవలె వంగేట్టు 'ఇ' దగ్గర సాగతీసి పట్టుకుని, దారము జరగగలిగినంత దూరాన్ని పెన్సిలుతో గీసుగీస్తే పటములోని దీర్ఘవృత్తము ఏర్పడుతుంది 'అ' 'ఆ' అన్న బిందువులు ఒకదానిదగ్గరి ఇంకొకటి చేరుతున్నకొద్దీ దీర్ఘవృత్తము క్రమంగా వృత్తము అవుతుంది.

భూమి దీర్ఘవృత్తమార్గంలోనే సూర్యుడి చుట్టూ తిరుగుతోంది. 'అ' అన్నది సూర్యుడు. 'ఇ' అన్నది భూమి. దీర్ఘవృత్తములో తిరగడమువల్ల భూమి 1 అన్న స్థానములో ఉన్నప్పుడు, 2 అన్నచోట ఉన్నప్పటికంటె దగ్గర ఇందువల్ల ఉత్తరార్ధగోళపు వేసవి దక్షిణార్ధగోళపు వేసవి కంటె తీవ్రమైనది కావాలి ఇది వాస్తవముగా జరుగుతునే ఉంది. కాని ఉత్తరార్ధ గోళములో భూభాగము హెచ్చుగా ఉండుటవల్లనూ, దక్షిణార్ధ గోళములో సముద్రమే హెచ్చుగా ఉండుటవల్లనూ ఈ వేసవి – ఉష్ణ భేదము పైన చెప్పిన కారణము వల్లనే నా అన్న సందేహము కలుగుతుంది.

సూర్యుడినించి భూమికి చేరే వేడిమిని చతురపు అంగుళముకు ఎంత? అని ఉత్తరార్ధ గోళములోనూ దక్షిణార్ధ గోళములోనూ పరీక్షచేస్తే ఉత్తరార్ధ గోళములో ఎక్కువగా ఉండాలి. అదిన్నీ పర్యతాగ్రములలో పరిశీలిస్తే సరి. అయితే భూమి తిరిగే కక్ష్య అంత దీర్ఘమైన దీర్ఘవృత్తము కాదు. అందువల్ల ఈ భేదాలు అంత ఎక్కువగా కనపడవు.


అయినట్లయితే దీర్ఘవృత్తములో తిరగడానికీ వృత్తములో తిరగడానికీ గల భేదము ఏదీ తెలియదా? అని అడిగితే జవాబిది "బుధగ్రహముయొక్క గమనములో తెలుస్తుంది" అని.

బుధగ్రహము సూర్యునికి మిక్కిలి చేరువగా ఉన్న గ్రహము దీర్ఘవృత్తములో తిరిగే గ్రహమునకునూ సూర్యునికినీ కలిపే రేఖ సమానకాలములలో సమాన వైశాల్యాలు అలుకుతుంది. కనక సూర్యునికి చేరువగా వచ్చినప్పుడు బుధగ్రహము అతి జోరుగా తిరుగుతుందన్నమాట. అయిన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతము ప్రకారము వేగము హెచ్చినకొద్దీ ఒక వస్తువుయొక్క ద్రవ్యరాశి (*mass*) హెచ్చుతుంది. ఇందువల్ల బుధగ్రహముపై సూర్యునికి గల ఆకర్షణ శక్తి హెచ్చి, ఆ గ్రహమును అది వచ్చిన మార్గములో కాక మరియొక అంశ వృత్తమార్గములోనికి తిప్పి పంపుతుంది. ఇందువల్ల పటములో చుక్కచే సూచించిన సూర్యుడి చుట్టూ బుధగ్రహము అవలంబించే కక్ష్యయొక్క దూరపు కొన (పటములో ఇది 'కో' చే సూచించబడింది) 88 రోజులలో 'కో' నుంచి 'యొ'కి జరుగుతుంది ఇంకొక 88 రోజులలో 'రో' దగ్గరకి మారుతుంది. కాలక్రమాన్న పద్మదళాల అంగుని పట్టి తిరుగుతుందన్నమాట అయితే ఒక హెచ్చరిక! పటములో సులువుగా బోధపరిచే నిమిత్తము 'కో' 'యొ' 'రో' లు దూరదూరముగా చూపించబడ్డాయి. అసలు 'కో' 'యొ' ల్ని సూర్యుడితో కలిపే రేఖల మధ్యన ఉండే కోణము 'సూర్యకోణం' అనే జ్యోతిశ్శాస్త్రజ్ఞుని లెక్క ప్రకారము శతాబ్దానికి 43 సెకనుల మాత్రము అవుతుంది! (డిగ్రీలో 3600 వంతు ఒక సెకను) చిత్రమేమిటంటే ఈ 43 సెకనుల విలువని లెక్కవెయ్యా చేసినవాళ్ళు కనుక్కొన్నారు కూడాను.

భూమి సూర్యుని చుట్టూ తిరిగే కక్ష్య వృత్తముతో ఇంచుమించు సరిసమానమైన దీర్ఘవృత్తము. కనక వృత్తములో తిరిగినట్లేనన్నమాట ★

చిత్రప్రశ్నలు జవాబులు

—భూమిమీద ఏ ప్రదేశములోనూ సూర్యుడు ఏడాది పొడుగునా కనుపించడు. హనుమంతరావుగారు – [illegible] ఆరు నెలలు మాత్రమే ఉత్తర ధ్రువాని, ఆరు నెలలు దక్షిణధ్రువానికి (అంటే చుట్టూ ఉండే మండలములోను) కనిపిస్తాడు. చంద్రుడికి అవకాశము లేదు.



చిత్రప్రశ్నలకు జవాబులు

—వినముగాని పిచ్చుకగాని భూమ్యాకర్షణను అతిక్రమించి ఎగరగలుగుటకు, వాటి రెక్కల ఊపువల్లా, ప్రొపెల్లరు లాగుడువల్లా ఆవిర్భవించే (గాలియొక్క) పవనశక్తి భూమ్యాకర్షణశక్తికంటె బలమైనది కావడమే కారణము

—సూర్యగ్రహణం అమావాస్యనాడు గాని జరగదు కనక అమావాస్య, సూర్యగ్రహణమూ కలవడములో వింతలేదూ, ఘనతా లేదూ సూర్యగ్రహణము సోమవారమునాడు కాకపోతే ఏదో వారమునాడు జరుగుతుంది ఆ ఘనతలు మనము ఆరోపించుకున్నవే జ్యోతిశ్శాస్త్రరీత్యా దానికి ప్రత్యేకత ఏమీ లేదు

—సూర్యాస్తమయమైన తరువాత, క్రుంకిన సూర్యునిరశ్మి పడమరను ఉన్న మబ్బుల మీదపడి చెదురుతుంది. మబ్బులోని నీటి దూవిరికణాలూ, ధూళీ-, బొగ్గూ-కణాలు, తెల్లని సూర్యరశ్మిలోని నీలపు రంగూ, ఆకుపచ్చ రంగులను ఇటూ అటూ బాగా విరజిమ్మేసాయి కనక మబ్బుల నుంచి మనకు వచ్చే వెలుతురులోనుంచి పై రంగులు లోపించి, పసుపు, నారింజా, ఎరుపు వర్ణాలే కనబడతాయి ఇవి మబ్బుల రంగులు కానేకావు మబ్బునించి మనకి చేరడంలో వెలుతురుకు మిగిలిన రంగులు.

—కేటరాక్టు అనగా కంటిపాప వెనుక గల కటకము (*Eye lense*) తెల్లబడి పోవడము ఇది వయస్సువల్లనే జరగగలదు. కనక 40 సంవత్సరాలలోపువారికి రాకూడదు రాగా మేము వినలేదు

—ఉమ్మినీరు ఆహారములోని పిండి పదార్థముతో చేరి దాన్ని జీర్ణము చేస్తుంది నోటిగోడలలోనుండే నాళములు ఈ జీర్ణాహారాన్ని నెత్తురులోకి చేరుస్తాయి కనక ఆహారాన్ని బాగా నమలనిదే మింగివేయకూడదు

—సూర్యగ్రహణము పట్టినప్పుడు ఇత్తడి పళ్లెములో నీరు పోసి రోకలిని పళ్లెములో నిలబెట్టితే పడిపోకుండా ఉంటుందన్నమాట నిజము కాదు

—జంతువులలో ఆడ, మొగ (లింగ) భేదములున్నాయి వానపాములవంటి కొన్ని క్రిములలో ఆడ, మగ, నిర్మాణాలు ఒకే పురుగులో వుంటాయి అలాగే కొన్ని పూలలో ఆడ, మగ, భాగాలుంటాయి మరికొన్నిటిలో మగభాగాలే ఉంటాయి బొప్పాయి, తాడి చెట్లలో ఈ ఏర్పాటుంది

—భూమిమీదవలె తక్కిన గ్రహాలలో ప్రాణులున్నట్టుగా అనుమానపడవలసినదే కాని నిశ్చయమైన సాక్ష్యము లేదు

"ఏమయ్యా! నాదగ్గిర పది రూపాయలు చేబదులు తీసుకొన్నమాట అప్పుడే మరచిపోయావా?"

"లేదండీ. ఇంకా కొంత కాలం పట్టుతుంది!"


—సాముద్రికశాస్త్రము శాస్త్రము, అనడానికి వీలైనంతగా వృద్ధి అయినట్లు లేదు. బొటనవ్రేలినుండే రేఖని పైనించి దిగువకి లెక్కవెయ్యాలని కొందరూ, క్రిందనించి పైకి లెక్కవెయ్యాలని మరికొందరూను

—జాతకాలు చూసుకోడము దండుగ. స్వప్నములలో జరిగే పట్టాభిషేకాలు కూడా లెక్కకి తీసుకోవాలంటారు జ్యోతిష్కులు మా మిత్రులొకరికి రాజయోగము స్వప్నములో సఫలమైంది! మా పినతండ్రికి రాజయోగము ఈ జన్మలో సఫలము కావడానికి వీలులేక ఆయనే పెళ్ళిపోయినాడు అంటే వచ్చే జన్మలో జరగబోయే యోగాలు కూడా ఈ జన్మయొక్క జాతకంలో వుంటాయి!


—'ఎగిరే పళ్లెములు' నిజతత్వము ఇంకా తెలియలేదు మొన్న మొన్ననే ఒక శాస్త్రజ్ఞుడు ఇవి అంగారక గ్రహవాసుల గస్తీ సాధనాలన్నాడు. భూమికి అంగారక గ్రహము దగ్గరగా వచ్చినప్పుడు ఇవి ఎక్కువగా వస్తున్నాయట ఒకటి భూలోకవాసులు వెంట తరిమితే ఇవి అదృశ్యమైపోతున్నాయట రెండు మనమే అంగారక గ్రహాన్ని పరిశీలించాలంటే మనవారు సరిగ్గా ఇంతే చెయ్యాలి కనక, అంగారకవాసులు అంతే చేస్తున్నారంటున్నాడు నిజము ఇంకా తెలుసుకోవాలి శేషనారాయణ కృష్ణ గారూ

—భూమిమీద నున్నవారికి భూమి తిరిగే వేగము ఉంది (రైలులోని వారికి రైలు వేగములాగ) కనక భూమిమీద ఎగిరే విమానమునకు కూడ భూమియొక్క వేగముంది మరి భూమి తిరిగిపోతూంటే విమానము కూడా ఆ వేగముతో తిరుగుతూ ఆపైన తన స్వంత (ఇంజనుల) వేగముతో నడుస్తుంది. భూమియొక్క వేగముతో తిరుగుతూ, భూమిమీద నున్నవారికి విమానపు స్వంత వేగమే మిగిలి కనబడుతుందమ్మా ఇందిరా. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras



లాల్‌బాగ్‌లో గ్లాస్ హౌస్ (బెంగుళూరు.)



మైసూరు మహారాజా పేలస్‌లో ఉద్యానవనం (బెంగుళూరు.)